
PMR
BUILDING PLANNER
House Planning, Building permission,
HMDA & DTCP Layout Permission
Estimation, Home Loans, Valuations,
Construction Drawings
P. Rajesh - 9866334557, 9100900931
polagonirajeshgoud@gmail.com Ragannaguda Bus stop, Near Jawid Habib

నేటి ప్రభాత
# సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784.




ప్రచురణ, హైదరాబాద్, సంపుటి : 01 సంచిక : 16 ఎడిటర్ : పాలగోని రాజేష్ పేజిలు : 8, వెల రూ. 4, /- మంగళవారం - 17 - జూన్ - 2025

## భారత రాఫెల్‌లను కూల్చామన్న పాక్ వాదనలు అబద్ధం

'ఆపరేషన్ సిందూర్'లో రాఫెల్స్ కూలిపోలేదన్న డసో ఏవియేషన్




భారత్ నుంచి నష్టాలపై అధికారిక సమాచారం లేదన్న సీఈవో ఎరిక్ ట్రాపియర్

యుద్ధంలో లక్ష్య సాధనే ముఖ్యం.. నష్టాలు కాదని వ్యాఖ్య

## మేం రంగంలోకి దిగితే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది..
# ఇరాన్ కు ట్రంప్ హెచ్చరిక




ఇజ్రాయెల్ దాడులతో తమకు సంబంధం లేదన్న అమెరికా అధ్యక్షుడు

తమపై దాడి చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని ఇరాన్ కు వార్నింగ్

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై కీలక వ్యాఖ్యలు చేసిన ట్రంప్

## బెంగళూరు తొక్కిసలాటతో కళ్లు తెరిచిన బీసీసీఐ..
# విజయోత్సవాలకు సరికొత్త నిబంధనలు!

2లో



ఆర్సీబీ విజయోత్సవాల్లో తొక్కిసలాటతో 11 మంది మృతి

భవిష్యత్ ఘటనల నివారణకు బీసీసీఐ త్రిసభ్య కమిటీ ఏర్పాటు

15 రోజుల్లో భద్రతా మార్గదర్శకాలు రూపొందించాలని ఆదేశం

## రేవంత్ రెడ్డిని కేటీఆర్ రెచ్చగొడుతున్నారు: సీతక్క




- కవిత జైలుకెళ్లి బీసీ ఎజెండా ఎత్తుకున్నారు
- కేటీఆర్ కూడా జైలుకి వెళ్లాలనుకుంటున్నారని ఎద్దేవా
- తోడేళ్లలా దోచుకుని వినయం నటిస్తున్నారని మండిపాటు



# రైతన్నలకు గుడ్ న్యూస్
## బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ

2లో

మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాలని మంత్రులకు సూచన

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు శుభవార్తను అందించింది. నేటి నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయనుంది. ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల గురించి కూడా



ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లా నేతలతో ఇన్‌ఛార్జ్ మంత్రులు సమన్వయం చేసుకోవాలని ఆయన ఆదేశించారు.

వైద్య కళాశాలలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని ముఖ్యమంత్రి

## ప్రధాని మోదీకి సైప్రస్
# అత్యున్నత పురస్కారం




మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3'ను ప్రదానం

ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవం

రెండు దేశాల సంస్కృతి, సోదరభావం, వసుధైవ కుటుంబకం భావనకు ప్రతీక

ఈ అవార్డును ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహానికి అంకితం చేస్తున్నట్లు ప్రకటన మిగతా..2లో




## ఆ పథకం అమలుకు తెలంగాణా సర్కార్ సన్నాహాలు

హైదరాబాద్ : ఈ క్రమంలో ఆ పథకాన్ని ప్రారంభించడానికి తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ పథకం ద్వారా సంవత్సరానికి మహిళలకు 30 వేల రూపాయల ఆర్థిక భరోసా అందనుంది. ఈ పథకం ద్వారా 55 సంవత్సరాలలోపు వయసున్న తెల్ల రేషన్ కార్డు కలిగిన మరియు పెన్షన్ సౌకర్యం లేని మహిళలకు నెలకు

## మాపై నమ్మకంతో ఎన్డీయేను ప్రజలు మూడుసార్లు గెలిపించారు

ప్రభుత్వ సుపరిపాలన, పేదల సంక్షేమంపై




రాజమహేంద్రవరంలో ఆమె సమీక్ష


"2047 నాటికి మనం 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలి

## ప్రపంచంలో 50 శాతం డిజిటల్ లావాదేవీలు యూపీఐ ద్వారానే: మోదీ

ఈ డిజిటల్ విప్లవం భారత్‌లో గేమ్ ఛేంజర్‌గా నిలిచింది

త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే లక్ష్యంగా ముందుకువెళ్తున్నాం

ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటి




## జనగణన నోటిఫికేషన్ జారీ..
# లెక్కల ప్రక్రియ ఇదే..

వచ్చే ఏడాది(2026) అక్టోబర్ 1 అర్ధరాత్రి నుంచి కేంద్ర పాలిత ప్రాంతాలైన లడఖ్, జమ్మూ కాశ్మీర్ తో పాటు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో జనగణన

2027 మార్చి 1 నుంచి మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో

ప్రతీ రాష్ట్రంలోనూ రెండు దశల్లో జనాభా గణన



న్యూఢిల్లీ: దేశంలోని జనాభాను లెక్కించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది. దీనిలో భాగంగా (జూన్ 16) జన గణనపై కేంద్ర హెూం శాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. వచ్చే ఏడాది(2026) అక్టోబర్ 1 అర్ధరాత్రి నుంచి కేంద్ర పాలిత ప్రాంతాలైన లడఖ్, జమ్మూ కాశ్మీర్ తో పాటు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో

## దేశంలో నెంబర్ వన్ సీఎం అంటే చంద్రబాబే: సుమన్




సీఎం చంద్రబాబుపై సినీ నటుడు సుమన్ ప్రశంసలు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి చంద్రబాబు నాయకత్వమే కీలకం అని వెల్లడి

ఆయన అనుభవం, దార్శనికత రాష్ట్రానికి ఎంతో మేలు అని ఉద్ఘాటన

అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రముఖ సినీ నటుడు సుమన్ ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబు తన అనుభవంతో, దార్శనికతతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలరని, ఆయన దేశంలోనే నెంబర్ వన్ ముఖ్యమంత్రి అని అభిప్రాయపడ్డారు.

## విశాఖలో యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లను
# స్వయంగా పరిశీలించిన సీఎం చంద్రబాబు

- అంతర్జాతీయ యోగా దినోత్సవ ఏర్పాట్ల పరిశీలనకు విశాఖ వెళ్లిన సీఎం చంద్రబాబు
- జూన్ 21న విశాఖ ఆర్కే బీచ్‌లో యోగా డే, హాజరుకానున్న ప్రధాని మోదీ
- సుమారు ఐదు లక్షల మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ఇబ్బందులు లేకుండా చూడాలని సీఎం ఆదేశం
- ట్రాఫిక్, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన ముఖ్యమంత్రి
- కార్యక్రమానికి ముందు మాక్ యోగా నిర్వహించాలని అధికారులకు సూచన




అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు విశాఖపట్నంలో పర్యటించారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలో చేపట్టనున్న 'యోగాంధ్ర' కార్యక్రమం ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొననుండటంతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్ల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. విశాఖ ఆర్కే బీచ్ వేదికగా జరగనున్న ఈ యోగా దినోత్సవ కార్యక్రమానికి సుమారు ఐదు లక్షల మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆర్కే బీచ్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన ఏర్పాట్లను ముఖ్యమంత్రి చంద్రబాబు క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

## ఇజ్రాయెల్ దాడుల్లో మరో 8 మంది
# టాప్ కమాండర్లను కోల్పోయిన ఇరాన్

టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు

ప్రతీకార దాడులు జరుపుతున్న ఇరాన్

పశ్చిమాసియాలో భగ్గుమంటున్న ఉద్రిక్తతలు




న్యూఢిల్లీ : ఇజ్రాయెల్ టెహ్రాన్‌తో పాటు ఇతర ఇరాన్ నగరాలపై భీకర దాడులు కొనసాగిస్తోంది. తాజాగా ఈ దాడుల్లో తమ ఏరోస్పేస్ విభాగానికి చెందిన 8 మంది సీనియర్ కమాండర్లు మరణించినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ధృవీకరించింది. ఐఆర్‌జీసీ అధికారిక వార్తా సంస్థ సెపా న్యూస్

నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com



# ప్రపంచంలో 50 శాతం డిజిటల్ లావాదేవీలు యూపీఐ ద్వారానే: మోదీ



లిమాసోల్: మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ద్వీప దేశమైన సైప్రస్ కు చేరుకున్న విషయం తెలిసిందే. లిమాసోల్‌లో జరిగిన భారత్–సైప్రస్ సీఈవో ఫోరమ్‌లో ప్రధాని ప్రసంగిస్తూ.. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న డిజిటల్ లావాదేవీల్లో 50 శాతం యూపీఐ ద్వారానే జరుగుతున్నట్లు వెల్లడించారు. ఈ డిజిటల్ విప్లవం భారత్‌లో గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని.. ఆర్థిక, నూతన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. భారత్ వేగంగా ఆర్థిక వృద్ధి సాధిస్తూ.. ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందని తెలిపారు. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే లక్ష్యంగా ముందుకువెళ్తున్నామన్నారు. నేడు ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని అన్నారు. జీఎస్టీ అమలు, కార్పొరేట్ పన్నులకు సంబంధించిన అనేక చట్టాల్లో సంస్కరణలను ప్రవేశపెడుతూ.. స్థిరమైన విధానాలను కలిగిఉండడం ద్వారా భారత్‌లో వ్యాపారరంగం వృద్ధి చెందుతోందని మోదీ అన్నారు. ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సెమీకండక్టర్లు, బయోటెక్, గ్రీన్ డెవలప్‌మెంట్ వంటి రంగాలపై దృష్టి సారించి, దేశ తయారీ రంగాన్ని మరింత అభివృద్ధి చేయడానికి భారత ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మోదీ పేర్కొన్నారు. దీంతో త్వరలో భారత్ సెమీకండక్టర్ తయారీకి ప్రపంచ కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ప్రస్తుతం భారత్ నౌకలు, వైమానిక రంగాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తోందని ప్రధాని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలతో వ్యాపారం చేయడంలో నమ్మకంతో పాటు వారి సౌలభ్యానికి కూడా భారత ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. భారతీయ కంపెనీలు సైప్రస్‌ను యూరప్‌కు ప్రవేశ ద్వారంగా చూస్తున్నాయని మోదీ అన్నారు. సైప్రస్‌ను యూపీఐలో చేర్చడానికి కొనసాగుతున్న చర్చలను ప్రధాని స్వాగతించారు.

'భారత్‌లో తయారీ' బంపర్‌హిట్!

మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్నారు. ఆయనకు లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్‌కు వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. సైప్రస్ పర్యటన అనంతరం.. ప్రధాని మోదీ కెనడా వెళ్లి అక్కడ జరగనున్న జీ7 సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి క్రొయేషియా పర్యటనకు వెళ్తారు.

# రేవంత్ రెడ్డిని కేటీఆర్ రెచ్చగొడుతున్నారు: సీతక్క

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు జైలుకు వెళ్లాలని కుతూహలంగా ఉన్నట్లు కనిపిస్తోందని రాష్ట్ర మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఏసీబీ విచారణకు హాజరయ్యే ముందు కేటీఆర్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమె ఈ విధంగా స్పందించారు. వీలైనంత త్వరగా జైలుకు వెళ్లేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కేటీఆర్ రెచ్చగొడుతున్నారని సీతక్క అన్నారు. "కల్వకుంట్ల కవిత జైలుకు వెళ్లివచ్చి బీసీ ఎజెండాను అందుకున్నారు. తాను వెనుకబడ్డాననే భావనతో కేటీఆర్ కూడా జైలుకు వెళ్లి ఏదైనా పథకం రచించాలని అనుకుంటున్నారేమో" అంటూ వ్యంగ్యంగా అన్నారు. కేటీఆర్ మాటల్లో పొగరు కనిపిస్తోందని ఆమె మండిపడ్డారు. ఏదో ఆశించే కేటీఆర్ జైలుకు వెళ్లాలని అనుకుంటున్నారని, తొడేళ్లలా దోచుకుని ఇప్పుడు వినయం నటిస్తున్నారని తీవ్రస్థాయిలో విమర్శించారు. "కేటీఆర్ పొగరుతో మాట్లాడుతుంటే, మా ముఖ్యమంత్రి పౌరుషంతో మాట్లాడుతున్నారు" అని సీతక్క వ్యాఖ్యానించారు. కేటీఆర్ వ్యవహారాన్ని దర్యాప్తు సంస్థలే చూసుకుంటాయని ఆమె స్పష్టం చేశారు. మరోవైపు, ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో భాగంగా కేటీఆర్ ఏసీబీ అధికారుల ఎదుట విచారణకు హాజరయ్యారు. విచారణకు వెళ్లేముందు ఆయన ఒక ట్వీట్ చేశారు. ఇప్పటికే మూడుసార్లు విచారణకు పిలిచారని, ముప్పైసార్లు పిలిచినా తాను హాజరవుతానని అందులో పేర్కొన్నారు. తనను ఏసీబీ విచారణకు పిలిచి కొందరు రాక్షసానందం పొందుతున్నారని, అవసరమైతే తనను అరెస్టు కూడా చేసుకోవచ్చని కేటీఆర్ సవాల్ విసిరారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తాను జైలుకు వెళ్లి వచ్చానని, తనకు జైళ్లు, కేసులు కొత్తేమీ కాదని ఆయన తన ట్వీట్‌లో తెలిపారు. కేటీఆర్ జైలు గురించి చేసిన ఈ వ్యాఖ్యలపైనే మంత్రి సీతక్క పైవిధంగా స్పందించారు.

# మాపై నమ్మకంతో ఎన్డీయేను ప్రజలు మూడుసార్లు గెలిపించారు

ప్రధాని మోదీ ఏ పథకం చేపట్టినా పేదలను కేంద్ర బిందువుగా చేసుకుని కార్యక్రమాలు చేపడతారు

రాజమహేంద్రవరం: ప్రజలు తమపై నమ్మకంతో కేంద్రంలో మూడుసార్లు ఎన్డీయే కూటమిని గెలిపించారని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ప్రభుత్వ సుపరిపాలన, పేదల సంక్షేమంపై రాజమహేంద్రవరంలో ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "2047 నాటికి మనం 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవాలి. ప్రధాని మోదీ ఏ పథకం చేపట్టినా పేదలను కేంద్ర బిందువుగా చేసుకుని కార్యక్రమాలు చేపడతారు. గతంలో కేవలం ఏడు కోట్ల మంది మాత్రమే బ్యాంకింగ్ రంగానికి దగ్గరగా ఉండేవారు. ప్రస్తుతం 52 కోట్ల మందికి సేవలు అందుతున్నాయి. దేశవ్యాప్తంగా 15 కోట్ల మందికి జలజీవన్ మిషన్ కింద మంచినీటి సరఫరా జరుగుతోంది. 12 కోట్ల మందికి మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాం" అని పురందేశ్వరి తెలిపారు

# ప్రధాని మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం

ఇంటర్నెట్ డెస్క్: ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ ద్వీపదేశమైన సైప్రస్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. మోదీకి సైప్రస్ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ మకరియోస్ 3'ను ప్రదానం చేశారు. ఈసందర్భంగా మోదీ మాట్లాడుతూ.. ఇక్కడి ప్రభుత్వానికి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవమన్నారు. రెండు దేశాల సంస్కృతి, సోదరభావం, వసుధైవ కుటుంబకం భావనకు ప్రతీక అని చెప్పారు. ఈ అవార్డును ఇరుదేశాల మధ్య ఉన్న స్నేహానికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ గుర్తింపు ఇరుదేశాల శాంతిభద్రతలు, సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రత, శ్రేయస్సుపై పరస్పర నిబద్ధతను మరింత బలపరుస్తుందని పేర్కొన్నారు. భారత్–సైప్రస్ మధ్య ఉన్న క్రియాశీల భాగస్వామ్యం భవిష్యత్తులో కొత్త శిఖరాలను చేరుకుంటుందని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు. ఇరుదేశాలు తమ దేశాల పురోగతిని బలోపేతం చేయడమే కాకుండా సురక్షితమైన, శాంతియుత వాతావరణాన్ని నిర్మించడానికి దోహదపడతాయన్నారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ ఆదివారం సాయంత్రం సైప్రస్ చేరుకున్నారు. ఆయనకు లార్నాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆ దేశాధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్ సాదర స్వాగతం పలికారు. రెండు దశాబ్దాల తర్వాత భారత ప్రధాని సైప్రస్‌కు వెళ్లడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. భారత్, సైప్రస్ సంబంధాల్లో గణనీయ ప్రగతికి ఈ పర్యటన దోహదం చేయనుందని.. ముఖ్యంగా వాణిజ్యం, పెట్టుబడులపై మరింతగా కలిసి పనిచేసే అవకాశముంది అని మోదీ పేర్కొన్నారు. సైప్రస్ పర్యటన అనంతరం.. ప్రధాని మోదీ కెనడా వెళ్లి అక్కడ జరగనున్న జీ7 సదస్సులో పాల్గొంటారు. అక్కడి నుంచి క్రొయేషియా పర్యటనకు వెళ్తారు.

# బెంగళూరు తొక్కిసలాటతో కళ్లు తెరిచిన బీసీసీఐ.. విజయోత్సవాలకు సరికొత్త నిబంధనలు!

న్యూఢిల్లీ : బెంగళూరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఐపీఎల్ టైటిల్ విజయోత్సవాల్లో జరిగిన తొక్కిసలాట, 11 మంది అభిమానుల మృతి నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక చర్యలు చేపట్టింది. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు, మ్యాచ్‌ల అనంతరం నిర్వహించే విజయోత్సవాలకు పటిష్టమైన భద్రతా మార్గదర్శకాలను రూపొందించేందుకు ఒక త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. నిన్న జరిగిన బీసీసీఐ 28వ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా నేతృత్వంలోని ఈ కమిటీలో ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కోశాధికారి ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా సభ్యులుగా వ్యవహరించనున్నారు. ఈ కమిటీ పదిహేను రోజుల్లోగా తమ నివేదికను, నూతన మార్గదర్శకాలను సమర్పించాలని బీసీసీఐ ఆదేశించింది. "బెంగళూరులో విజయోత్సవాల సందర్భంగా జరిగిన దురదృష్టకర సంఘటన దృష్ట్యా భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా నిరోధించడానికి సమగ్ర మార్గదర్శకాలను రూపొందించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని అపెక్స్ కౌన్సిల్ నిర్ణయించింది" అని బీసీసీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. జూన్ 4న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం వెలుపల ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఆర్సీబీ జట్టు తొలిసారి ఐపీఎల్ టైటిల్ గెలుచుకోవడంతో ఆ విజయాన్ని వేడుకగా జరుపుకునేందుకు భారీ సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. ఐపీఎల్ ఫైనల్ జరిగిన మరుసటి రోజే హడావుడిగా ఈ వేడుకలను ఏర్పాటు చేశారు. స్టేడియం సామర్థ్యం పరిమితంగా ఉన్నప్పటికీ, అంచనాలకు మించి సుమారు రెండు లక్షల మంది అభిమానులు ఒక్కసారిగా రావడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. తొలుత విధాన సౌధ నుంచి కవాతు నిర్వహించాలని భావించినప్పటికీ, అది చివరి నిమిషంలో రద్దయింది. అయినప్పటికీ, అప్పటికే అభిమానులు పెద్ద ఎత్తున ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ట్రాఫిక్ పోలీసుల హెచ్చరికలను బేఖాతరు చేయడం, ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఈ ఘటనకు ఆర్సీబీ యాజమాన్యం, వారి ఈవెంట్ భాగస్వాములు, కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (కేఎస్‌సీఏ) నిర్లక్ష్యమే కారణమని పలువురు ఆరోపించారు. ఈ దుర్ఘటన అనంతరం, ఆర్సీబీ మార్కెటింగ్ హెడ్, డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థకు చెందిన ఇద్దరు అధికారులను అరెస్ట్ చేశారు. కేఎస్‌సీఏ కార్యదర్శి, కోశాధికారి నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేశారు. ప్రణాళిక లోపం, జన నియంత్రణలో వైఫల్యం కారణంగానే ఈ దుర్ఘటన జరిగిందని రాష్ట్ర ప్రభుత్వం ఆర్సీబీ యాజమాన్యాన్ని, బీసీసీఐని బాధ్యులను చేసింది.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. డీఎన్ఏ పరీక్ష ద్వారా 87 మృతదేహాల గుర్తింపు

అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో డీఎన్ఏ పరీక్ష ద్వారా ఇప్పటి వరకూ 87 మృతదేహాలను అధికారులు గుర్తించారు. ఇప్పటికే 47 మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇక గుర్తించిన మిగతా మృతదేహాలను సైతం కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. ఇక ఇదే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీ డెడ్ బాడీని అధికారులు డీఎన్ఏ పరీక్ష ద్వారా గుర్తించిన విషయం తెలిసిందే. మరోవైపు, ఎయిర్ ఇండియా విమానానికి చెందిన కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ దొరకడంతో దర్యాప్తు ముమ్మరం చేసినట్లు అధికారులు వెల్లడించారు. విమాన ప్రమాదం ఎలా, ఎందుకు జరిగిందన్న అంశాలను తెలుసుకునేందుకు కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ కీలకం కానుంది. ఫ్లయిట్ డేటా రికార్డర్‌ను గుర్తించినట్లు ఇంతకుముందే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో(ఏఏఐబీ) వెల్లడించింది. ఎయిర్ ఇండియా విమానం కూలిన ఘటనపై ఏఏఐబీ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు కూడా ఈ ఘటన పట్ల విచారణ కొనసాగిస్తోంది. అలాగే ఎయిర్ ఇండియా విమానం.. అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థది కావడంతో ఆ దేశం కూడా విచారణలో సహకరిస్తోంది. బోయింగ్ కంపెనీకి చెందిన నిపుణులు కూడా ఈరోజు అహ్మదాబాద్ చేరుకున్నారు. విమాన దుర్ఘటనపై వాళ్లు దర్యాప్తు చేపట్టనున్నారు. కూలిన విమానం 787-8 డ్రీమ్‌లైనర్ మోడల్ కావడంతో బోయింగ్ సంస్థ ఈ ఘటనపై సమగ్ర స్థాయిలో విచారణ చేపట్టనుంది.

# రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త!

మొదటి పేజీ తరువాయి



రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న 34 వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల రాష్ట్రంలోని 26 వైద్య కళాశాలల్లో ఉన్న సౌకర్యాలపై జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ సమీక్ష నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రంలోని పలు మెడికల్ కళాశాలల్లో సదుపాయాల కొరత ఉందని గుర్తించిన జాతీయ వైద్య మండలి, ఈ విషయంపై వివరణ ఇచ్చేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లను ఈ నెల 18న ఢిల్లీకి రావాలని ఆదేశించింది. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ కూడా వర్చువల్ విధానంలో ఈ సమావేశంలో పాల్గొనాలని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కళాశాలల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసి, నివేదిక సమర్పించడానికి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఆయా కళాశాలల్లో అవసరమైన అన్ని వసతులను రాబోయే మూడేళ్లలో సమకూర్చాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, అనుమతుల వివరాలను తనకు అందజేస్తే, కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో మాట్లాడి వాటిని త్వరితగతిన మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానని రేవంత్ రెడ్డి అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ భాషను ఒక ఆప్షనల్ సబ్జెక్టుగా నేర్పించాలి. జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి మంచి డిమాండ్ ఉంది, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. వైద్య, విద్య శాఖలకు సంబంధించిన అంశాలపై ప్రతి నెలా మూడో వారంలో తప్పనిసరిగా సమీక్షా సమావేశం నిర్వహించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

# కేటీఆర్ ఏసీబీ విచారణపై ఎమ్మెల్సీ కవిత కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మద్దతుగా నిలిచారు. ఫార్ములా–ఈ కారు రేసింగ్ కేసులో ఏసీబీ విచారణ కొనసాగుతోంది. ఏసీబీ విచారణపై కవిత స్పందించారు. కేటీఆర్‌ను ఏసీబీ విచారణపై కవిత మీడియాతో మాట్లాడారు. 'ఏ పార్టీలోనైనా లోపాలు ఉన్నప్పుడు అధినేతకు చెప్పుకోవడం సహజం. చెప్పుకున్నంత మాత్రానా దాన్నేదో భూతద్దంలో చూపించాల్సి అవసరం లేదు. మా పార్టీలో లోపాలు సవరించుకుంటాం. మా మీద ఎవరైనా దాడి చేస్తే ఊరుకోం. ప్రధాన సమస్యల నుంచి దృష్టి మరల్చేందుకే ఏసీబీ విచారణలు అంటూ హడావిడి. మా కార్యకర్తలను, నేతలను ఇళ్లకు రాకుండా అడ్డుకోవడం దారుణం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒకసారి మాత్రమేరైతు భరోసా ఇచ్చింది. అది కూడా 60 శాతం మంది రైతులకే ఇచ్చింది. మిగిలిన 40 శాతం మందికి ఎప్పుడు రైతు భరోసా ఇస్తారో ప్రభుత్వం చెప్పాలి. నిరుడు యాసంగిలో ఇచ్చినట్టు మూడు ఎకరాల భూమి ఉన్న రైతులకే భరోసా ఇస్తారా. రైతులందరికీ ఇస్తారా అనే దానిపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతులకు, ప్రజలకి ఎన్నో హామీలిచ్చి అందరినీ మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రైతు భరోసా సహా అన్ని హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మోసం చేసింది. పింఛన్లు పెంచలేదు.. మహిళలకు రూ. 2,500 ఇవ్వలేదు.. ఇలా అన్ని హామీలను కాంగ్రెస్ ఎగవేసింది. హామీల అమలు పై, సర్కారు చేస్తోన్న అక్రమాలపై ప్రశ్నిస్తున్నామని మా పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావు లకు నోటీసులు ఇచ్చి ఈ ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తోంది. మొన్ననే కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్‌ను విచారించింది. ఇప్పుడు కేటీఆర్‌ను ఏసీబీ విచారిస్తోంది. మేం వేధింపులకు భయపడే వాళ్ళం కాదు.. కేటీఆర్ విచారణకు హాజరయ్యారు. కేటీఆర్ విచారణ సందర్భంగా ఈ ప్రభుత్వం తెలంగాణ భవన్ తాళం వేయడం దుర్మార్గం. మా కార్యకర్తలు, నాయకులను బయటికి రానివ్వకుండా అడ్డుకోవడం దారుణం. మా పార్టీ లోపాలను సవరించుకుంటాం.. మా మీద ఎవరైనా దాడికి వస్తే కలిసికట్టుగా ఎదుర్కొంటాం' అని వాఖ్యానించారు.

# మేం రంగంలోకి దిగితే పరిస్థితి తీవ్రంగా ఉంటుంది..

న్యూఢిల్లీ : ఇరాన్ అణ్వాయుధ కేంద్రాలపై ఇజ్రాయెల్ భారీ ఎత్తున విరుచుకుపడుతున్న సంగతి తెలిసిందే. దీనికి ఇరాన్ కూడా దీటుగా స్పందిస్తోంది. ఇజ్రాయెల్ నగరాలపై క్షిపణులతో ప్రతిదాడులు చేస్తోంది. రెండు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. దీనిపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా స్పందించారు. ఇరాన్ పై నిన్న రాత్రి జరిగిన దాడితో తమకు ఎలాంటి సంబంధం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయం, అణు ప్రాజెక్టుపై ఇజ్రాయెల్ "భారీ దాడులు" చేసిన కొన్ని గంటల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తాము రంగంలోకి దిగితే పరిస్థితి వేరేలా ఉంటుందని చెప్పారు. ఒకవేళ అమెరికాపై ఇరాన్ దాడికి ప్రయత్నిస్తే, తమ సాయుధ బలగాల పూర్తి శక్తితో ఇరాన్ మునుపెన్నడూ చూడని స్థాయిలో ప్రతిస్పందిస్తామని హెచ్చరించారు. "రాత్రి ఇరాన్‌పై జరిగిన దాడితో అమెరికాకు ఎలాంటి సంబంధం లేదు. ఇరాన్ మమ్మల్ని ఏ రూపంలోనైనా లక్ష్యంగా చేసుకుంటే, అమెరికా సాయుధ దళాల పూర్తి శక్తి ఏంటో చూపిస్తాం" అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తాను సులభంగా ఒక ఒప్పందం కుదిర్చి, ఈ రక్తపాత ఘర్షణకు ముగింపు పలకగలనని కూడా ఆయన పేర్కొన్నారు. ఇరాన్ పై దాడుల నేపథ్యంలో ఈ రోజు ఒమన్‌లో జరగాల్సిన అమెరికా–ఇరాన్ అణు చర్చలు రద్దయ్యాయి. ఇరాన్ తన అణు కార్యక్రమంపై అమెరికాతో ఒప్పందం చేసుకోవాలని, లేకపోతే ఏమీ మిగలదని ట్రంప్ ఇటీవల హితవు పలికారు. మరోవైపు, ఇరాన్ ప్రభుత్వ అణు ఆయుధాల ప్రాజెక్టుకు సంబంధించిన టెహ్రాన్‌లోని లక్ష్యాలపై తాము విస్తృతమైన దాడులు పూర్తి చేశామని ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడీఎఫ్) ఈ రోజు తెల్లవారుజామున ప్రకటించింది. ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయం, ఎస్‌పీఎన్‌డీ అణు ప్రాజెక్టు లక్ష్యాలలో ఉన్నాయని ఎక్స్ లో పేర్కొంది. ఇరాన్ తన "అణు ఆర్కైవ్‌ను దాచిన" ప్రదేశాన్ని కూడా తాము దెబ్బతీశామని ఐడీఎఫ్ తెలిపింది. ఇరాన్ ప్రతిదాడుల నేపథ్యంలో జెరూసలెం, టెల్ అవీవ్‌లలో వైమానిక దాడుల సైరన్లు మోగాయి. ఇరాన్ క్షిపణులు, డ్రోన్లు ఇజ్రాయెల్ ఇంధన మౌలిక సదుపాయాలు, ఫైటర్ జెట్ ఇంధన ఉత్పత్తి సౌకర్యాలను లక్ష్యంగా చేసుకున్నాయని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ తెలిపింది. ఈ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 10 ఏళ్ల బాలుడు, 20 ఏళ్ల యువతితో సహా కనీసం ఏడుగురు మరణించినట్లు సమాచారం.

# ఇజ్రాయెల్ దాడుల్లో మరో 8 మంది టాప్ కమాండర్లను కోల్పోయిన ఇరాన్

మొదటి పేజీ తరువాయి

ఐఆర్‌జీసీ అధికారిక వార్తా సంస్థ సెపా న్యూస్ ఈ విషయాన్ని వెల్లడిస్తూ, వారి 'అమరత్వం' పట్ల సంతాపం ప్రకటించింది. అంతకుముందు దాడుల్లో ఇరాన్ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ మహ్మద్ బఘేరి, ఐఆర్‌జీసీ చీఫ్ కమాండర్ హొసైన్ సలామీ సహా పలువురు ఉన్నత కమాండర్లు మరణించినట్లు వార్తలు వచ్చాయి.

ప్రతీకార దాడులు: ఇజ్రాయెల్‌లో ప్రాణ నష్టం

ఈ దాడులకు ప్రతిగా ఇరాన్... ఇజ్రాయెల్‌లోని లక్ష్యాలపై పలు దఫాలుగా క్షిపణి దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఇజ్రాయెల్‌లో ప్రాణనష్టంతో పాటు భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఉత్తర ఇజ్రాయెల్‌లో ఒక నివాస భవనంపై రాకెట్ దాడి జరగడంతో ఒక మహిళ మరణించగా, మరో 13 మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ జాతీయ అత్యవసర వైద్య సేవ సంస్థ మాగెన్ డేవిడ్ అడోమ్ (ఎండీఏ) తెలిపింది. ఇరాన్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి కనీసం ముగ్గురు మరణించగా, 204 మంది గాయపడ్డారని ఎండీఏ అంతకుముందు వెల్లడించింది.

దాడుల కొనసాగింపు: పశ్చిమాసియాలో ఉద్రిక్తత

తమ వాయు రక్షణ వ్యవస్థలు దూసుకొస్తున్న క్షిపణులు, రాకెట్లను సమర్థంగా అడ్డుకుంటున్నాయని, అదే సమయంలో ఇజ్రాయెల్ వైమానిక దళ విభాగాలు టెహ్రాన్‌లోని సైనిక లక్ష్యాలపై దాడులు నిర్వహిస్తున్నాయని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. హైఫా మరియు ఉత్తర ప్రాంతాల వెలుపల నివసించే ప్రజలు బాంబు షెల్టర్ల నుండి బయటకు రావొచ్చని, అయితే సురక్షిత ప్రాంతాలకు సమీపంలోనే ఉండాలని ఇజ్రాయెల్ హోమ్ ఫ్రంట్ కమాండ్ సూచించింది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి, తీవ్ర ఆందోళన నెలకొంది.

# జనగణన నోటిఫికేషన్ జారీ.. లెక్కల ప్రక్రియ ఇదే..

మొదటి పేజీ తరువాయి

వచ్చే ఏడాది(2026) అక్టోబర్ 1 అర్ధరాత్రి నుంచి కేంద్ర పాలిత ప్రాంతాలైన లడఖ్, జమ్మూ కాశ్మీర్ తో పాటు హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో జనగణన చేపడతారు. 2027 మార్చి 1 నుంచి మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో చేపట్టబోతున్నారు. ప్రతీ రాష్ట్రంలోనూ రెండు దశల్లో జనాభా గణన చేపడతారు. ఆదివారం జనగణన కమిషనర్, రిజిస్ట్రార్ జనరల్ తో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమీక్ష నిర్వహించారు. తదనంతరం జనాభా లెక్కలను గణించే తేదీలను ఖరారు చేశారు. జనగణనతో పాటు కులగణన చేయాలని ఇదివరకే కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. భారతదేశంలో జనాభా గణన 12 ఏళ్ల తరువాత జరుగుతోంది. సాంకేతికంగా అభివృద్ధి చెందిన ప్రస్తుత తరుణంలో జరుగుతున్న జనగనణ పలు కీలక అంశాలను వెల్లడించనుంది. 1948 జనాభా గణన చట్టం ప్రకారం దీనిని నిర్వహించనున్నారు. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని రిజిస్ట్రార్ జనరల్, జనాభా గణన కమిషనర్ కార్యాలయం జనగణన ప్రక్రియను చేపట్టనుంది. జనాభా గణన రెండు ప్రధాన దశల్లో నిర్వహించనున్నారు. మొదటి దశలో గృహ జాబితా, గృహ గణన (2026) ఉంటుంది. దీనిలో జనాభాకు అందుబాటులో ఉన్న సౌకర్యాలతో పాటు శాశ్వత లేదా తాత్కాలిక గృహాల డేటాను సేకరిస్తారు. ఈ దశ సమగ్ర చిరునామా రిజిస్టర్‌ను రూపొందించేందుకు సహాయపడుతుంది. రెండవ దశలో వ్యక్తులకు సంబంధించిన వివరణాత్మక సమాచారం సేకరిస్తారు. అంటే పేరు, వయస్సు, లింగం, మతం, కులం, విద్య, వృత్తి, వలస మొదలైనవి నమోదు చేస్తారు. దేశంలో తొలిసారిగా జనాభా గణన డిజిటల్‌గా ఉండనుంది. ఇందుకోసం 16 భాషలలో కూడిన మొబైల్ యాప్‌లను వినియోగించనున్నారు. పౌరులు ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వీయ గణనను కూడా ఎంచుకోవచ్చు. 2027 జనాభా గణనలో ఎస్సీలు, ఎస్టీలు మాత్రమే కాకుండా ఓబీసీలు సహా అన్ని కుల సమూహాలను కవర్ చేసేలా కులగణన కూడా ఉండనుంది. ప్రభుత్వ విధాన రూపకల్పన, సంక్షేమ పథకాలు, నియోజకవర్గాల పునర్విభజన, వ్యాపార ప్రణాళికలకు జనగణన ఎంతగానో ఉపయోగపడనుంది.

# ఆ పథకం అమలుకు తెలంగాణా సర్కార్ సన్నాహాలు

హైదరాబాద్ : ఈ క్రమంలో ఆ పథకాన్ని ప్రారంభించడానికి తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ పథకం ద్వారా సంవత్సరానికి మహిళలకు 30 వేల రూపాయల ఆర్థిక భరోసా అందనుంది. ఈ పథకం ద్వారా 55 సంవత్సరాలలోపు వయసున్న తెల్ల రేషన్ కార్డు కలిగిన మరియు పెన్షన్ సౌకర్యం లేని మహిళలకు నెలకు 2500 రూపాయల ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

మహాలక్ష్మి పథకంపై వేగంగా కసరత్తు

మహాలక్ష్మి పథకంలో భాగంగా అందించే ఈ ఆర్థిక సహాయాన్ని త్వరితగతిన ఇవ్వాలని ప్రయత్నిస్తోంది. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలను వేగంగా రూపొందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే దీనిని ఇవ్వగలిగితే ప్రజల మద్దతు పూర్తిస్థాయిలో పొందే అవకాశం ఉంటుందని భావిస్తోంది. ఇప్పటికే అనేకమార్లు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే తెలంగాణ మహిళలకు శుభవార్త చెబుతారని పేర్కొన్నారు .

ఎన్నికల ముందు మహిళల ఖాతాలో డబ్బులు

జూలై నెలలో సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, త్వరలో క్యాబినెట్ భేటీ నిర్వహించి ఎన్నికల తేదీని ప్రకటిస్తారని చెబుతున్న క్రమంలో ఎన్నికలకు ముందు మహిళల ఖాతాలో డబ్బులు జమ చేయడం ద్వారా ప్రజా మద్దతును కూడగట్టుకోవాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇప్పటికే రైతు భరోసా నిధుల ద్వారా రైతాంగం మద్దతును కూడగట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది.

మహిళలకు గుడ్ న్యూస్ చెప్పడానికి రెడీ అవుతున్న తెలంగాణ ప్రభుత్వం

ఇదే సమయంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల ఖాతాలో ఇచ్చిన మాట ప్రకారం 2500 రూపాయల నగదును జమచేసి ఆర్థిక భరోసా కల్పించి రెండు ముఖ్యమైన పథకాలను అమలు చేయడం ద్వారా ప్రజలలో విశ్వాసం పెంచుకోవాలని భావిస్తుంది. ఎన్నికల హామీలను నెరవేర్చడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలలో పట్టు సాధించాలని, తద్వారా రాష్ట్రంలో మళ్లీ బలంగా గ్రామీణ స్థాయిలో పాగా వేయాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే మహిళలకు గుడ్ న్యూస్ చెప్పడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

# విశాఖలో యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన సీఎం చంద్రబాబు



యోగాంధ్ర 2025 నోడల్ అధికారి ఎంటీ కృష్ణబాబు... యోగా దినోత్సవం కోసం చేసిన ఏర్పాట్లను ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే, బీచ్ రోడ్డు వెంబడి వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న పనుల పురోగతిని విశాఖ జిల్లా కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు 607 సచివాలయాల సిబ్బంది హాజరవుతున్నారని, వారిని సమన్వయం చేస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. యోగా దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనే వారితో ముందుగా మాక్ యోగా నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమం జరిగే రోజు ఉదయం 6:30 గంటల నుంచి 8:00 గంటల వరకు ఈ మాక్ యోగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రధానమంత్రితో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందున భద్రతాపరంగా తీసుకుంటున్న చర్యలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అలాగే, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, సామాన్య ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు వచ్చేవారి వాహనాల పార్కింగ్ కోసం చేసిన ఏర్పాట్ల గురించి కూడా సీఎం ఆరా తీశారు. ఆర్కే బీచ్‌లోని ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ముఖ్యమంత్రి ఆంధ్రా యూనివర్సిటీ గ్రౌండ్స్‌కు వెళ్లి అక్కడ కూడా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

# భారత రాఫెల్‌లను కూల్చామన్న పాక్ వాదనలు అబద్ధం

న్యూఢిల్లీ : భారత వైమానిక దళానికి చెందిన రాఫెల్ యుద్ధ విమానాలను 'ఆపరేషన్ సింధూర్' సమయంలో కూల్చివేశామంటూ పాకిస్థాన్ చేస్తున్న వాదనల్లో ఎంతమాత్రం నిజం లేదని రాఫెల్ విమానాల తయారీ సంస్థ దసో ఏవియేషన్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) ఎరిక్ ట్రాపియర్ స్పష్టం చేశారు. ఈ ఆరోపణలపై ఫ్రెంచ్ విమానయాన దిగ్గజం నుంచి వచ్చిన మొదటి అధికారిక స్పందన ఇదే కావడం గమనార్హం. పారిస్ ఎయిర్ షోకు ముందు ఫ్రాన్స్‌కు చెందిన ప్రముఖ మ్యాగజైన్ 'చాలెంజెస్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఎరిక్ ట్రాపియర్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. మే నెల ప్రథమార్ధంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా తమ రాఫెల్ యుద్ధ విమానాలకు నష్టం వాటిల్లినట్టు భారత ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి అధికారిక సమాచారం అందలేదని ఆయన తెలిపారు. అయితే, మూడు రాఫెల్‌లను ధ్వంసం చేశామన్న పాకిస్థాన్ ప్రకటన మాత్రం 'ఖచ్చితంగా తప్పుడు సమాచారం' అని ఆయన కుండబద్దలు కొట్టారు. "ఈ విషయంలో భారతీయులు ఎలాంటి ప్రకటన చేయలేదు, కాబట్టి సరిగ్గా ఏం జరిగిందో మాకు తెలియదు. కానీ పాకిస్థాన్ చెబుతున్నట్టు మూడు రాఫెల్‌లు ధ్వంసమయ్యాయన్న మాటలు అవాస్తవమని మాకు ఇప్పటికే తెలుసు" అని ట్రాపియర్ పేర్కొన్నారు. ఆధునిక యుద్ధ తంత్రాలను అంచనా వేసేటప్పుడు కేవలం నష్టాల ఆధారంగా కాకుండా నిర్దేశించుకున్న లక్ష్యాలను ఎంతవరకు చేరుకున్నారనే దానిపై దృష్టి సారించాలని ట్రాపియర్ హితవు పలికారు. "రెండో ప్రపంచ యుద్ధ సమయంలో మిత్రరాజ్యాల దళాలు సైనికులను కోల్పోయినంత మాత్రాన వారు యుద్ధంలో ఓడిపోయారని ఎవరూ చెప్పలేదు కదా" అంటూ చారిత్రక నేపథ్యాన్ని గుర్తుచేశారు. పూర్తి వాస్తవాలు వెలుగులోకి వస్తే "కొందరికి ఆశ్చర్యకరమైన విషయాలు తెలిసే అవకాశం ఉందని" అంతవరకు తొందరపడి ఎలాంటి నిర్ధారణలకు రాకూడదని ఆయన సూచించారు. 4.5వ తరానికి చెందిన ఓమ్నిరోల్ యుద్ధ విమానమైన రాఫెల్ భారత వ్యూహాత్మక వైమానిక దాడుల సామర్థ్యంలో అత్యంత కీలకమైనదని, దీని రాకతో ఈ ప్రాంతంలో వైమానిక శక్తి సమతుల్యత భారత్‌కు అనుకూలంగా మారిందని నిపుణులు భావిస్తున్నారు. రాఫెల్ విమానం విశిష్టతను ట్రాపియర్ మరోసారి నొక్కిచెబుతూ ఇది ప్రపంచంలోనే అత్యంత బహుముఖ ప్రజ్ఞ, సమర్థత కలిగిన మల్టీరోల్ యుద్ధ విమానాల్లో ఒకటిగా నిలుస్తుందన్నారు. అమెరికాకు చెందిన ఎఫ్–35 లేదా చైనా తయారుచేస్తున్న ఇతర ప్రత్యామ్నాయ విమానాలతో పోలిస్తే, విభిన్న రకాల సైనిక కార్యకలాపాలకు రాఫెల్ అత్యంత అనుకూలమైనదని ఆయన తెలిపారు. గగనతల పోరాటం, భూతలంపై దాడులు, నిఘా, అణ్వాయుధ ప్రయోగ సామర్థ్యం, యుద్ధనౌకల నుంచి కూడా కార్యకలాపాలు నిర్వహించగలగడం దీని ప్రత్యేక బలాలని ఆయన వివరించారు. దక్షిణాసియాలో యుద్ధరంగ ప్రదర్శనలు, ఆయుధాల కొనుగోళ్లు, వైమానిక ఆధిపత్యం వంటి అంశాలపై తీవ్ర చర్చ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఎరిక్ ట్రాపియర్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పాకిస్థాన్ చేస్తున్న ప్రచారానికి ఇప్పటివరకు ఇదే అత్యంత బలమైన, అధికారిక ఖండనగా నిపుణులు పరిగణిస్తున్నారు.

# దేశంలో నెంబర్ వన్ సీఎం అంటే చంద్రబాబే: సుమన్


ఓ న్యూస్ ఛానల్‌తో మాట్లాడుతూ ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "చంద్రబాబు ఒక విజనరీ. ఎలాంటి సంక్షోభం వచ్చినా పరిష్కరించగలిగిన సమర్థుడు చంద్రబాబు. దేశంలోనే నెంబర్ వన్ సీఎం ఎవరంటే చంద్రబాబే. దెబ్బతిన్న రాష్ట్రాన్ని చక్కదిద్దాలంటే చంద్రబాబు వల్లే సాధ్యం... అందుకు ప్రజలు కూడా సహకరించాలి. ఆయనకు కొంత సమయం ఇవ్వాలి. ఏది ముందు చెయ్యాలి, ఏది తర్వాత చెయ్యాలి అనే ప్రాధాన్యతలు ఉంటాయి... మనకు కావాల్సింది ఇప్పుడే జరగాలి అంటే కుదరదు... అందుకోసం వేచిచూడాలి. చంద్రబాబు గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. హైదరాబాద్ ను ఆయన అభివృద్ధి చేసిన తీరు అందుకు నిదర్శనం. ఆ తర్వాత రాజశేఖర్ రెడ్డి, కేసీఆర్ వచ్చారు... కాదనడంలేదు... కానీ హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్ పోర్టు వంటి నిర్మాణాలతో ఒక ఆర్కిటెక్చర్ మ్యాప్ ను ఏర్పాటు చేసింది మాత్రం చంద్రబాబే. ఇవాళ ఏపీ అభివృద్ధి అంటే ఒక పరీక్ష వంటిది. దాదాపు ఎడారి వంటి ప్రాంతాన్ని సుభిక్షంగా తయారుచేయాలంటే ఆయనకు సమయం ఇవ్వాలి... మనమందరం సహకరించాలి. మనుషులు అన్న తర్వాత తప్పులు ఉంటాయి.. ఎవరూ పర్ఫెక్ట్ కాదు. అయితే ఆ తప్పు పెద్దదా, చిన్నదా అనేది చూడాలి. పెద్ద తప్పు అయితే మాట్లాడాలి, చిన్న తప్పు అయితే పట్టించుకోకూడదు. గత ప్రభుత్వం తప్పులు చేయలేదా? వాళ్లు కొన్ని మంచి పనులు చేశారు, కొంత చెడు కూడా జరిగింది. మనకు మోదీ గారి సహకారం ఉంది. ఆయన అండను వీలైనంతగా ఉపయోగించుకోవాలి" అని సుమన్ పేర్కొన్నారు.

## ఆపరేషన్ కగార్ దాడిని ఖండిస్తూ జూన్ 20న బంద్‌కు మావోయిస్టుల పిలుపు




**న్యూఢిల్లీ,:** తెలుగు రాష్ట్రాల్లో ఈనెల 20న బంద్‌కు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఇటీవల జరిగిన ఆపరేషన్ కగార్ దాడిని ఖండిస్తూ ఈ బంద్‌ను ప్రకటించినట్లు మావోయిస్టు అధికార ప్రతినిధి జగన్ పేరుతో ఒక ప్రకటన విడుదలైంది. ప్రకటనలో ప్రకారం, జూన్ 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ జరిగిన ఆపరేషన్ కగార్ పేరుతో నేషనల్ పార్క్ పరిధిలో చేపట్టిన దాడుల్లో రాష్ట్ర స్థాయి కీలక నాయకులైన కామ్రేడ్ టీఎల్ఎన్ఎస్ చలం అలియాస్ ఆనంద్, కామ్రేడ్ మైలారపు అడెల్ అలియాస్ భాస్కర్ సహా 7 మంది మావోయిస్టులను పోలీసులు హత్య చేశారని మావోయిస్టులు ఆరోపించారు. కామ్రేడ్ గౌతం, భాస్కర్ వంటి 30 ఏళ్ల విప్లవ అనుభవం కలిగిన నాయకులు ఈ ఆపరేషన్‌లో అమరులయ్యారని పేర్కొన్నారు. గౌతం విజయవాడలోని ఆయుర్వేద మెడికల్ కళాశాలలో విద్యార్థిగా ఉండగా, ఆర్ఎస్‌యూ ద్వారా ఉద్యమంలో చేరారు. 1981లో పూర్తిస్థాయి కార్యకర్తగా మారి, పలు ప్రాంతాల్లో మావోయిస్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారు. భాస్కర్ అదిలాబాద్ డివిజన్‌లోని పలు గ్రామాల్లో పనిచేసి, రాష్ట్ర కమిటీ స్థాయికి ఎదిగారు. ప్రభుత్వ బలగాలు ఈ దాడుల్లో విప్లవకారులను అణిచివేయాలనే లక్ష్యంతో ముందుకు సాగాయని మావోయిస్టులు విమర్శించారు. కార్పొరేట్ శక్తులకు లబ్ధి కలిగించే విధంగా అడవుల్లోని ఆదివాసీలపై దాడులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. చర్చలకు తమ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉన్నప్పటికీ, గతంలో చర్చల నిమిత్తం వచ్చిన తమ ప్రతినిధి కామ్రేడ్ స్టధాకర్‌ను కూడా ప్రభుత్వం హత్యచేసిందని పేర్కొన్నారు. ప్రభుత్వం శాంతి చర్చల పేరుతో ప్రజలను మోసం చేస్తోందని, వాస్తవిక లక్ష్యం విప్లవ ఉద్యమాన్ని అణచివేయడమేనని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, ప్రభుత్వ అణచివేత చర్యలకు నిరసనగా జూన్ 20న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో బంద్ పాటించాలని ప్రజలకు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు.. ప్రభాకర్, ప్రణీత్‌లను ఒకేసారి విచారణ



**హైదరాబాద్, :** ఫోన్ ట్యాపింగ్ కేసులో దూకుడు పెంచింది సిట్. నాకేం తెలీదని ప్రభాకర్ రావు అంటుంటే ప్రభాకర్ రావు చెప్పిందే తాను చేశానని ప్రణీత్ రావు అంటున్నాడు !! దీంతో ఇద్దరినీ కలిపి వాచారించాలని భావిస్తున్నారు సిట్ అధికారులు. అలా ఐతే కానీ.. అసలు బండారం బయటపడేలా లేదు. ఫోన్ ట్యాపింగ్ నిందితులంతా ప్రభాకర్ రావు పేరు చెప్తుంటే ప్రభాకర్ రావు మాత్రం తెలీదు గుర్తులేదు.. మరిచిపోయా అంటూ సిట్‌ను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాడట ! ఫోన్ ట్యాపింగ్ కీలక నిందితుడు.. ప్రభాకర్ రావు అమెరికా నుంచి తిరిగిరావడంతో కేసు కొలక్కి వస్తుందని భావించారు. కానీ.. ప్రభాకర్ రావు కథ మొదటికి తెచ్చారు. ఇప్పటికే ఈ కేసులో ఉన్న నిందితులంతా ప్రభాకర్ రావు పేరు చెప్పారు. తన డైరెక్షన్‌లోనే ట్యాపింగ్‌కి పాల్పడ్డామని ఆధారాలు కూడా పోలీసులకు సమర్పించారు. కానీ.. ప్రభాకర్ రావు మాత్రం తనకేం తెలీదని.. శాఖాపరమైన ఆదేశాలు మాత్రమే ఇచ్చానని చెప్తున్నాడు. అదీకాకుండా ఉల్టా సిట్ అధికారులనే ప్రశ్నిస్తున్నాడు. నాపై ఉన్నతాధికారులను కూడా ఈ కేసులో ఎందుకు చేర్చలేదని సిట్ అధికారులనే ప్రశ్నిస్తున్నాడు. దీంతో సిట్ అధికారులు ఈసారి పక్కాగా ప్లాన్ చేశారు. రెండుసార్లు ప్రభాకర్ రావును విచారించిన సిట్ ఈసారి అనూహ్యంగా ప్రణీత్‌రావును మరోసారి విచారించింది. ప్రభాకర్ రావు ఎలాంటి ఆదేశాలు ఇచ్చాడు అనే వివరాలపై మరోసారి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు. మరుసటి రోజే అంటే ఈరోజు ప్రభాకర్ రావును మరోసారి విచారణకు పిలిచారు సిట్ అధికారులు. ప్రణీత్ రావు ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను ప్రభాకర్ రావు ముందుంచి విచారణ స్టార్ట్ చేశారు. మధ్యాహ్నం తర్వాత ప్రణీత్ రావును కూడా సిట్ కార్యాలయానికి పిలిచి ఇద్దరినీ ఒకేసారి విచారించాలని భావిస్తున్నారు సిట్ అధికారులు. రెండోసారి విచారణకు ప్రభాకర్ రావును పిలిచిన సిట్ అధికారులు తన మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్, మ్యాక్ బుక్ లను తీసుకురావాలని సూచించారు సిట్ అధికారులు. దీంతో తాను వాడిన రెండు మొబైల్ ఫోన్లను సిట్‌కు అందజేశారు ప్రభాకర్ రావు. ఆ మొబైల్స్ నుంచి ఏవైనా ఆధారాలు సేకరిస్తే.. వాటిని కూడా ముందుంచి ప్రభాకర్ రావును విచారించనుంది సిట్.

## ఇజ్రాయెల్ కౌంటర్ దాడులతో ఇరాన్ అణు కేంద్రాల గుండె బద్దలైందా..?



**న్యూఢిల్లీ,:** ఇజ్రాయెల్ చేపట్టిన “ఆపరేషన్ రైజింగ్ లయన్” పేరిట నిర్వహించిన వైమానిక దాడుల తర్వాత, ఇరాన్ అణుశక్తి కేంద్రాల్లో సంభవించిన నష్టాన్ని స్పష్టంగా చూపించే ఉపగ్రహ చిత్రాలను మాక్సార్ టెక్నాలజీస్ విడుదల చేసింది. ఈ చిత్రాలలో నాటాంజ్, ఫోర్డో ఇంకా ఇస్ఫహాన్ ప్రాంతాల్లోని కీలక అణు కేంద్రాలపై జరిగిన దాడుల ముందు, తర్వాత పరిస్థితుల తేడా స్పష్టంగా కనిపిస్తోంది. ఈ దాడులలో నాటాంజ్ అణు కేంద్రం పైభాగంలోని కీలక నిర్మాణాలు ధ్వంసమయ్యాయని, అంతర్జాతీయ అణు శక్తి సంస్థ పేర్కొంది. విద్యుత్ సరఫరా సదుపాయాలకు పెద్దెత్తున నష్టం వాటిల్లిందని ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైన్స్ అండ్ ఇంటర్నేషనల్ సెక్యూరిటీ పేర్కొంది. విద్యుత్ లేమితో కేంద్రాల లోపల ఉన్న సెంట్రిఫ్యూజ్‌లు (యురేనియం శుద్ధికరణ యంత్రాలు) తీవ్రమైన నష్టాన్ని పొందవచ్చని పేర్కొంది. నాటాంజ్ అణు కేంద్రం తెహరాన్‌కు దక్షిణాన 220 కి.మీ. దూరంలో ఉన్న ఈ కేంద్రం ఇరాన్ అణుశక్తి కార్యక్రమంలో కీలకంగా వ్యవహరిస్తుంది. ఇందులో అనేక సెంట్రిఫ్యూజ్ క్యాస్కేడ్లు పని చేస్తుంటాయి. గతంలోనూ ఇది స్టక్స్‌నెట్ వైరస్, 2021లో బాంబు పేలుళ్ల వంటి దాడులకు గురైంది. అలాగే ఫోర్డో కేంద్రం తెహరాన్‌కు దక్షిణాన 100 కి.మీ. దూరంలో, క్వోమ్ నగరానికి సమీపంలో కొండల కింద నిర్మించబడిన ఈ కేంద్రం, గగనతల దాడులకు ఎదురుగానే రూపొందించబడింది. ఇక్కడ సైతం సెంట్రిఫ్యూజ్ క్యాస్కేడ్లు ఉన్నాయి. ఇరాన్ వర్గాల ప్రకారం ఫోర్డోకు జరిగిన నష్టం తక్కువగానే ఉందని ప్రకటించబడినా నిపుణుల దృష్టిలో దీనిపై ఖచ్చితమైన అంచనాలివ్వలేనని చెప్పారు. ఇరాన్ అణు బాంబులు తయారు చేస్తున్నదని, అవి తీవ్ర ఉగ్రవాద సంస్థలకు అందించబడే ప్రమాదముందని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతాన్యహు హెచ్చరించారు. ప్రపంచంలోని అత్యంత ప్రమాదకరమైన శాసన వ్యవస్థకు, అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు లభించకూడదని ఆయన పేర్కొన్నారు. మా పోరాటం ఇరానీయుల పట్ల కాదు. మా పోరాటం గత 46 సంవత్సరాలుగా ప్రజలను అణచివేస్తున్న తత్వవాది పాలనతోనే అని నెతాన్యహు అన్నారు. మీ విముక్తి సమయం సమీపంలోనే ఉంది. అది వచ్చినప్పుడు, మన మధ్య స్నేహం మళ్లీ వికసిస్తుందని ఆయన అన్నారు.

# విద్యాధికారులు చిక్కరు దొరకరు


### అధికారులు కూడా ఫేక్ స్కూళ్లతో కుమ్మక్కు అయ్యారా?
### సీబీఎస్ఈ కరికులం పేరుతో సెంట్ జోసెఫ్ స్కూల్ మోసాలు...
### సెంట్ జోసెఫ్ స్కూల్ పై చర్యలు ఏవి.
### హయత్ నగర్‌లో ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం
### విద్యార్థిసంఘాలుప్రశ్నిస్తున్నా...పట్టించుకోకపోవడానికి కారణాలేంటి?
### హయత్ నగర్‌లో ప్రైవేట్ పాఠశాలల ఇష్టారాజ్యం
### విద్యాశాఖ అధికారుల వ్యవహారంపై అనుమానాలు
### అనుమతులు లేని పాఠశాలల నుంచి మామూళ్లకు మరిగిన అధికారులు




హయత్ నగర్-ప్రభాత సూర్య:
రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ పరిధిలో లెక్కలేనన్ని ప్రైవేట్ స్కూళ్లు ఉన్నాయి. అన్నీ పాఠశాలలు అత్యుత్తమ బోధన అంటూ ఊదరగొడుతున్నాయి. విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు అనేక రకాలుగా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. కానీ సరైన అనుమతులు మాత్రం ప్రైవేట్ పాఠశాలలు తీసుకోవడం లేదు. ఇష్టానుసారం వ్యవహరించడం, అనుమతులు లేకపోవడం, ఫీజులం వంటి వ్యవహారాలు కొనసాగుతున్నాయి. ఆయా పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒక్కరికి కూడా ఉచిత విద్యా బోధన లేదు. లక్షల్లో ఫీజులు తీసుకున్నా...సరైన వసతులు కల్పించలేని స్కూళ్లు ఎన్నో ఉన్నాయి. ఐతే వీటిపై తల్లిదండ్రులు ప్రశ్నిస్తే...దిక్కున్న చోట చెప్పుకోండి అంటూ బెదిరింపులకు దిగుతున్నాయి. ఈ క్రమంలో పలువరు జర్నలిస్టులు, బీసీ సంక్షేమ సంఘం సభ్యులు ఆయా స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కోరారు. సమస్యలను, ప్రైవేట్ స్కూళ్ల వ్యవహారాన్ని ఆయా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సెంట్ జోసెఫ్ స్కూల్ వ్యవహారంలోనూ అధికారులు పట్టిపట్టనట్టు వ్యవహరిస్తున్నారు. సెంట్ జోసెఫ్ స్కూల్ లో సీబీఎస్ఈ కరికులం పేరుతో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. కానీ ఆ పాఠశాలకు సీబీఎస్ఈ కరికులం అనుమతులు లేవు. ఇది గ్రహించని తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్చించి నష్టపోతున్నారు. అంతేకాదు లక్షల్లో ఫీజులు కట్టి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాలపై మాట్లాడేందుకు స్థానిక విద్యాశాఖ అధికారులు, ఎంఈవోతో ప్రయత్నించినప్పటికీ స్పందన లేదు. ఎన్ని సార్లు జర్నలిస్టులు, బీసీ సంక్షేమ సంఘం సభ్యులు ఫోన్ కాల్ చేసినా ఎత్తడం లేదు. ఆఫీసుకు వెళితే చిక్కడు దొరకడు అన్నట్టు వ్యవహరిస్తున్నారు. అధికారుల తీరుపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేని, నిబంధనలు పాటించని స్కూళ్లపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి అధికారులకు మాముళ్లు అందుతున్నాయా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

**సెంట్ జోసెఫ్ స్కూల్ విషయంలో ఫిర్యాదు చేసినా చర్యలు లేవు**

వేసవి సెలవులు ముగిసి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైంది. స్కూళ్లు తెరుచుకోవడంతో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో అడ్మిషన్ల కోసం రష్ కొనసాగుతోంది. ఇదే అదనుగా కొన్ని స్కూళ్లు మోసాలకు తెరలేపాయి. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ ప్రభాత సూర్య కథనాలు ప్రచురించింది. కానీ విద్యాశాఖ అధికారులు ఇప్పటికీ చర్యలు తీసుకోవడం లేదు. తల్లిదండ్రుల నుంచి లక్షల్లో ఫీజులు స్కూళ్లు గుంజుతున్నా...అధికారులు కిమ్మనడం లేదు. చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు.? అధికారులు కూడా ఫేక్ స్కూళ్లతో కుమ్మక్కు అయ్యారా? ప్రశ్నిస్తున్నా...పట్టించుకోకపోవడానికి కారణాలేంటి?


తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం
TELANGANA B.C. SANKSHEMA SANGAM
Regd. No. 108/10
B.C. Bhavan, H.No. 3-6-427/1, 2nd Floor, Street No. 4 & 5, Beside Taruni Jewellers, Himayat Nagar, Hyderabad - 500029

EKASHILA GROUP OF INSTITUTIONS- TELANGANA PRESENTS St.JOSEPH HIGH SCHOOL - CBSE CURRICULUM - Priyadarshini Colony, Bagh Hayath Nagar, Rangareddy

date: 09/06/2025

To
The Collector/district educational officer Rangareddy
subject: please take action immediately

In Hayathnagar village of Hayathnagar Mandal, St. Joseph High School ( EkaShila group of schools ) doesn't have any CBSE recognition, but they are taking admissions under the name of CBSE curriculum, and also in the name of CBSE curriculum they are collecting more and more fees'es minimum 70.000 from parents.and openly they are publicityzing CBSE curriculum in name plates and name boards and pomplets and all publicity , so they are brutally cheating simultaneously parents, students and education department also. so please file a cheating case and take immediate action against that school management

DEO Take n/a


V. Shiva kumar
State Spokes Person
+919394736326

# పవనశక్తిని ఒడిసిపట్టాలి



ప్రపంచ పవన శక్తి సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏట 15 జూన్ రోజున ప్రపంచ పవన దినం లేదా వరల్డ్/గ్లోబల్ విండ్ డే నిర్వహిస్తూ యువత, పౌర సమాజానికి పర్యావరణ హితమైన పవన శక్తి ప్రాధాన్యాలను, దాని ప్రయోజనాలను వివరించుట జరుగుతుంది. సంప్రదాయేతర తరగని పునరుత్పత్తి చేయగల శక్తి వనరుల్లో సౌరశక్తి తర్వాత రెండవ ప్రధానమైనదిగా పవన శక్తికి గుర్తింపు ఉన్నది. శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గిస్తూ, పర్యావరణహిత శక్తిని ఉత్పత్తి చేయడానికి దేశవ్యాప్తంగా సహజంగా వీస్తున్న పవనాల్లో దాగిన అపార శక్తిని విద్యుచ్ఛక్తిగా మార్చడానికి ట్బన్లను వినియోగిస్తారు. ఈ ట్బన్లు గవీస్తున్న గాలిలో దాగిన గతిశక్తిని యాంత్రిక శక్తిగా మార్చడం, తర్వాత విద్యుచ్ఛక్తిగా మార్చడం జరుగుతోంది. ఆన్షోర్, ఆఫ్షోర్ పవన శక్తులను ఒడిసిపట్టి, ఆరోగ్యకర పనరుత్పత్తి శక్తిని ఉత్పత్తినచేయడం నేటి కనీస అవసరంగా మారుతోంది. ప్రపంచ దేశాల్లో చైనా, యూఎస్, జర్మనీ, భారత్ లాంటి దేశాలు పవన శక్తి వినియోగంలో ముందున్నాయి. యూరోప్లో వినియోగిస్తున్న మొత్తం శక్తిలో 20 శాతం పవన శక్తి ఉండడం హర్షదాయకం. తీరప్రాంతాలు, గాలి వీచే మైదాన ప్రాంతాలు అధికంగా ఉన్న భారత్ నాలుగవ అతి పెద్ద పవన శక్తి ఉత్పత్తి చేస్తున్న భారతంలో గుజరాత్, తమిళ నాడు, కర్నాటక, రాజస్థాన్ రాష్ట్రాలు పవన శక్తి పరిశ్రమలో ముందు ఉన్నాయి. తెలంగాణలో దాదాపు 130 మెగావాట్లకు పైగా పవనశక్తి ఉత్పత్తి కావడం, రానున్న రోజుల్లో మరింత పెంచే ప్రయత్నాలు చేయడం జరుగుతోంది. దేశ పవన శక్తిలో 40 శాతం వరకు తమిళ నాడు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నది. 2025 తొలి త్రైమాసికంలో 50,000 మెగావాట్ల పవనశక్తి ఉత్పత్తికి నిర్మాణాలు జరిగాయి. కార్బన్ ఉద్గారాలను తగ్గించడానికి శిలాజ ఇంధనాల వినియోగాన్ని తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా పునరుత్పత్తి పవన శక్తిని ఒడిసిపట్టడం మన తక్షణ కర్తవ్యం అని భావించాలి. ప్రపంచ పవన దినోత్సవ వేదికగా పవన శక్తి పట్ల అవగాహన, పర్యావరణ పరిరక్షణ, ఆర్థిక ప్రగతికి దోహదపడడం, పవనాల నుంచి చవకైన విద్యుచ్ఛక్తిని తయారు చేయడం, పవన శక్తి వినియోగం పట్ల ప్రభుత్వ పాలసీలు రచించడం/అమలు చేయడం జరుగుతుంది. నేడు ప్రపంచవ్యాప్తంగా పవనశక్తి రంగంలో 3.7 లక్షల ఉద్యోగులు పని చేస్తుండగా, 2030 నాటికి వీరి సంఖ్య 6 లక్షలకు పెరగవచ్చని అంచనా వేస్తున్నారు. పవనశ క్తి ఉత్పత్తిని క్రమంగా పెంచడానికి పలు దేశాలు కార్యాచరణను సిద్ధం చే యడం, అధిక ప్రాధాన్యం ఇవ్వడం కొనసాగుతున్నది. గృహాల్లో వెలుగు లు నింపడం, పరిశ్రమల్లో యంత్రా లు కదలడానికి పవనశక్తిని వినియోగిస్తున్నాం. కొండలు, పర్వతాలు, స ముద్రాలు, తీరప్రాంతాల్లో పవనశక్తిని ఒడిసిపట్ట వచ్చని గమనించాలి. పవనశక్తి ప్రాధాన్యాన్ని గుర్తించి, ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తూ, సుస్థిరాభివృద్ధికి ఊతం ఇవ్వాలి. నేడు ప్రపంచాన్ని కుదిపేస్తున్న వాతావరణ ప్రతికూల మార్పులను కట్టడి చేయడానికి తరగని శక్తి వనరులను ఆశ్రయించాల్సిందే. పవనశక్తి ఉత్పత్తికి అనుకూలంగా ఉన్న భారతం రానున్న రోజుల్లో పవనశక్తి ఉత్పత్తిని పెంచుతూ ప్రపంచ పవనశక్తి దేశంగా పేరు తెచ్చుకోవాలి, పర్యావరణాన్ని పరిరక్షిణచుకోవాలి. భవిష్యత్తు శక్తి భద్రతలో పవనశక్తి పాత్ర విశిష్టమైనదని తెలుసుకోవాలి. మెయింటెనెన్స్ ఖర్చులు అతి తక్కువగా ఉన్న పవనశక్తి రంగం రానున్న రోజుల్లో మన దేశంలో మరింత పుంజుకోవాలని కోరుకుందాం.

# పదండి ముందుకు పడండి త్రోసుకు!




నేడు మహాకవి శ్రీశ్రీ వర్ధంతి కాబట్టి ఆయన్ని మననం చేసుకుందాం. ”పదండి ముందుకు/ పదండి త్రోసుకు!/ పోదాం పోదాం పైపైకి” అని మహాకవి చెప్పాడు. ఒక ప్రశ్న వస్తుందిక్కడ అలా ముందుముందుకు, త్రోసుకుంటూ ఎక్కడికి పోవాలి అని. అందుకే ఎక్కడికి పోవాలో ఆ పంక్తులకంటే ముందే చెప్పాడు ”మరో ప్రపంచం/ మరో ప్రపంచం/ మరో ప్రపంచం పిలిచింది!” అని. అందుకే పడుతూ లేస్తూ, తోసుకుంటూ అందరిదైన ఆ మరో ప్రపంచం సాధించమన్నాడు. పైకి పోవడానికి అంటే పైలోకానికి పోవడానికి త్రోసుకుంటూ పొమ్మనలేదాయన. అలాగే యువత అంటే మహాకవికి ప్రాణం అందుకే ”కొంతమంది యువకులు ముందు యుగం దూతలు” అన్నాడు. దాంతో పాటే ”కొంతమంది కుర్రవాళ్లు పుట్టుకతో వృద్ధులు” అనీ అన్నాడు ఎందుకంటే వీళ్లు సమాజాన్ని ఏమాత్రం పట్టించుకోరు కాబట్టి. ఇదంతా ఎందుకు చెప్పుకుంటున్నామో ఇప్పటికే మీకు అర్థమై ఉంటుంది. ఈమధ్యే ఒక సినిమా దగ్గర, పద్దెనిమిది సంవత్సరాల తర్వాత కప్పు కొట్టుకొచ్చిన ఒక క్రికెట్ జట్టు సంబురాలు చేసుకుంటుంటే అక్కడ తొక్కిసలాట జరిగి కొందరి ప్రాణాలు పోవడం జరిగింది. మహాకవి చెప్పిన మరో ప్రపంచానికి ఎలా పోవాలో వీళ్లకి ఎవరు చెబుతారు? పిచ్చి ముదిరి, స్నేహితులతో కలిసి తమ క్రికెట్ హీరోలు, సినిమా హీరోలను చూడడానికి పోయి శవంగా ఇంటికొస్తే వాళ్ల తలిదండ్రుల పరిస్థితి ఏమిటి? ఆ హీరోలను చూడడం ముఖ్యమా లేక వాళ్లు ఆ స్థితికి ఎంత కష్టపడి వచ్చారో అలా రావడం మానేసి వాళ్లతో సెల్ఫీ తీసుకోవాలని, షేక్ హ్యాండ్ ఇవ్వాలని, ఆ కోలాహలంలో పాల్గొనాలని ఎందుకనుకుంటున్నారు? అంతకంటే ముఖ్యమైన తమ చదువులు, తమ ఇంట్లో పనులు చూసుకోవాలన్న కోర్కె ఉండొద్దా? అవన్నీ చేసుకునేవాళ్లు కూడా ఒకసారి చూసొద్దామని పోయి తిరిగి రాకుండా ఉండొచ్చు కూడా ఎందుకంటే అందరినీ నిందించలేము. చనిపోయిన మనుషుల్ని బతికించడానికి ఇదేమీ సినిమా కాదు, జీవితం. ఒక మనిషితో ఇంట్లో వాళ్లకు రకకాల బంధాలుంటాయి. తోపులాటలో చనిపోయిన వారికి ఏ పదిలక్షలో, ఇరవై లక్షలో పరిహారం కింద ఇస్తే సరిపోతుందా అంటే పోయిన మనిషిని వెనక్కు తీసుకురావడం జరుగుతుందా? మళ్లీ సినిమాలు విడుదలవుతాయి, హిట్ అవుతాయి, డబ్బులు రాబట్టుకుంటాయి. క్రికెట్ మ్యాచులూ అంతే మళ్లీ జరుగుతాయి, సిక్సర్లూ, ఫోర్లు బాదుతారు, వందల పరుగులు చేస్తారు వరదలా, వికెట్లు కూడా తీస్తారు. క్రికెట్లో అవుట్ అయినవారిని మళ్ళీ ఆడిస్తారా? లేదు కదా. అలాగే నిజ జీవితంలో ప్రాణం పోగొట్టుకున్నవాళ్లు తిరిగి బతకడం జరగదు గాక జరగదు. ఈ విషయం గుర్తు పెట్టుకోవాలి. ఈతకోసం పోయి ప్రాణాలు పోగొట్టుకునేవారిని, ప్రమాదాల్లో అసువులు బాసేవారినీ కూడా చూస్తున్నాం. ఇంగ్లీషువారిపై బెర్నార్డ్ షా ఎప్పుడూ బాణాలు సంధించేవాడు. ఆయన క్రికెట్ పై వేసిన చురక చాలామందికి తెలుసు. పనిలేనివారు కనిపెట్టిన ఆటగా దాన్ని జమకట్టాడు. పదకొండుమంది మూర్?లు ఆడుతూవుంటే పదకొండువేల మంది మూర్?లు చూస్తారంటాడు. ఆ ఆట ఇప్పుడు విస్తరించి దేశదేశాలు పాకి వెలిగిపోతోంది. అందులో డబ్బుపెట్టేవారు పెరిగిపోయి కౌంటీలనుండి ఇప్పుడు ఐపియల్ మ్యాచులొచ్చి క్రికెట్ సంతలో ఆటగాళ్లను కొంటున్నారు. షా చెప్పిన ఆడేవాళ్లూ, చూసేవారూ ఎంతింతై అన్నట్టు పెరిగిపోయి వాళ్లలోనే ఈ ఆటకు పెట్టుబడిపెట్టేవాళ్లూ, పందాలు కట్టేవాళ్లూ, ఊరకనే చూసేవాళ్లు, ప్రకటన కర్తలు, వ్యాపారాలూ అన్నీ కలగలసి పోయాయి. ఇప్పుడు ఏ.ఐ.ని ఈ పరిస్థితుల్లో షావారు ఏమనేవారని అడిగితే ఏమని సమాధానమొస్తుందో మరి? బెంగళూరులో జరిగిన తొక్కిసలాటలో జట్టును చూడడానికొచ్చినవారిలో పదకొండుమంది అమాయకులు చనిపోవడం యాదృచ్ఛికం. ఎవరి హీరోలు వారికుంటారు. ఉండడమే కాదు అభిమానుల మధ్య గొడవలూ ఉంటాయి. ఇది ఇప్పటిది కాదు సీనియర్ ఎంటీయార్ ఏయెన్నార్ కాలం నుండీ ఉంది. తరువాత వచ్చిన హీరోలు అందరికీ తెలుసు. సినిమా విడదలయ్యిందంటే ఇక సందడే సందడి. పద్ధతులు మారిండొచ్చు కాని పిచ్చి మారలేదు. హీరోల బాబీ కాలర్లు, అడవిరాముడు కాలర్లు, బెల్‌బాటాలు, స్టెప్ కటింగులు అప్పుడైతే ఇప్పుడు టాట్టూలు, విచిత్ర కటింగులు, చినిగిపోయిన ప్యాంట్లు, కూల్ డ్రింకుల రాజ్యం చూస్తాం. పురుగు మందులు కలిసిన శీతల పానీయాలు తాగమని హీరో ఒక వీరోచిత చర్య చేసేసినాక చెబుతాడు. కింద తెరమీద కనిపించీ కనిపించక ఇది ప్రత్యేకంగా శిక్షణ పొందినవారి ఆధ్వర్యంలో చేసేది అని ప్రకటన వస్తుంది. సిగరెట్టు, మద్యం ప్రకటనలాగే దీన్నీ ఎవ్వరు చూడరు. పాత హీరోలు ప్రకటనల్లో సంపాదించుకున్నా వరదలు, ఉప్పెనలు వచ్చినప్పుడు ఉచిత షోలలో పాల్గొని నిధులు సేకరించి పెట్టేవాళ్లు. ఇప్పటివాళ్లు కూడా ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు సమయానికి సహాయం అందిస్తూనే ఉంటారు. కాబట్టి హీరోలు తెరమీద చేసే కార్యాలు కాకుండా నిజజీవితంలో ఏవైనా మంచిపనులు చేస్తే వాటిని అనుకరించాలి యువత. అంతా యువతనే అంటారు, కొంచెం ముందుకు పోయి వాళ్ల తలిదండ్రులనంటారు తప్ప వారిని ఎక్కువగా ప్రభావితం చేస్తున్న విషయాలమీద సమాజం, ప్రభుత్వాలు, ఎన్నో వ్యవస్థలు ఉన్నాయి కదా మరి వారిని అనరెందుకని ఏ కొద్దిమందో అడగొచ్చు. ఇది నిజం. ఎవరికి వారు ఎప్పటికప్పుడు తప్పించుకొని వాళ్ల ఎన్నికల్లో వాళ్ళు మునిగిపోయి ఉంటే వీళ్లని ఎందుకు పట్టించుకుంటారు పట్టించుకోకపోగా వీళ్లను అవసరానికి వాడుకుంటారని ఇంకో పెద్దాయన ఉసూరుమనొచ్చు. నావరకు నాకు ఇంటరులో చేరినప్పుడు మా నాన్న సైకిలు కొనిచ్చాడని, అదే వయస్సున్న తమ పిల్లలకు పెద్ద పెద్ద బైకులు కొనిస్తున్నారని ఇంక పిల్లలు ఎలా బాగుపడతారండి అని ఓ మధ్య తరగతి మానవుడనొచ్చు. మారే కాలంప్రకారం మనమూ మారాలండి ఇది స్పీడు యుగం అని సాఫ్టువేరు పిల్లలున్న తండ్రి కారు దోరేసుకుంటూ అనొచ్చు. అందుకే వేటిలో ముందుగా ఉండాలో, ఏ విషయాల కోసం పడుతూ లేస్తూ పోవాలో యువతకు సరైన మార్గదర్శకం కావాలి. మహాకవికి జోహార్లర్పిస్తూ ఆయన పాత్రను ఎవరైనా తీసుకొని మనకు మరో ప్రపంచం తెస్తారని ఆశిస్తూ.

## పొదిలి పర్యటనలో ఉసిగొల్పి రాళ్లు విసిరి గలాటా చేయించారు : వైఎస్ జగన్



తాడేపల్లి : సిఎం చంద్రబాబుపై ఎక్స్ వేదికగా వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ ఫైర్ అయ్యారు. పొగాకు పంటకు కనీస మద్దతు ధరలు లభించక రైతులు అన్యాయానికి గురవుతున్నారని.. వారిని పరామర్శించి భరోసా ఇవ్వడానికి నేను ప్రకాశం జిల్లాలోని పొదిలికి వెళ్తే.. ఆ కార్యక్రమాన్ని డైవర్ట్ చేయడానికి మీరు కుట్ర చేయడం భావ్యమా? అని ప్రశ్నించారు. రైతులను పరామర్శించే ఈ కార్యక్రమానికి సంఘీభావంగా దాదాపు 40 వేల మంది రైతులు, ప్రజలు తరలి వచ్చారు.. మేం వెళ్తున్న మార్గంలో మీరు 40 మంది టీడీపీ కార్యకర్తలను పెట్టి, వారిని ఉసిగొల్పి, రాళ్లు విసిరి గలాటా చేయించారు అని ఆరోపించారు. కానీ, ప్రజలు- రైతులు ఆ పన్నాగాన్ని అర్థం చేసుకుని అత్యంత సంయమనంతో వ్యవహరించారు అని జగన్ మోహన్ రెడ్డి చెప్పుకొచ్చారు. హింసను సృష్టించడానికి మీరు పంపిన ఆ 40 మంది చేసిన దుశ్చర్యలపైన, అక్కడున్న 40 వేల మంది ప్రజలు, రైతులు ప్రతిస్పందించి ఉంటే ఏం జరిగి ఉండేది చంద్రబాబు? అని మాజీ సీఎం జగన్ ప్రశ్నించారు. రైతుల సమస్యలపై గొంతెత్తితే దాన్ని డైవర్ట్ చేయడానికి మీరు ఇలా చేయించడం దుర్మార్గం కాదా? అని మండిపడ్డారు. పైగా ఉల్టా రాళ్లు మీ వాళ్లు విసిరితే, మీరు ఉసిగొల్పిన మీ కార్యకర్తలు గొడవలు చేసే ప్రయత్నం చేస్తే, అన్యాయంగా రైతులపై, ప్రజలపై కేసులు పెడతారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## కేసీఆర్‌తో మాట్లాడానో.. లేదన్నది ఇప్పుడు అనవసరం



**హైదరాబాద్, :**ఎర్రవల్లి ఫాంహౌస్‌లో తన తండ్రి కేసీఆర్‌తో మాట్లాడానో.. లేదన్నది ఇప్పుడు అవసరం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత తేల్చిచెప్పారు. కవిత మీడియాతో చిట్‌చాట్ చేశారు. ఇటీవల ఎర్రవల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను కలిసేందుకు కవిత వెళ్లింది. కవితను పలకరించకుండానే కేసీఆర్ బయటకు వెళ్లిపోయారంటూ వార్తలు వచ్చాయి. తాజాగా ఇదే అంశంపై కవిత నోరు విప్పారు. ఫాంహౌస్‌కు వెళ్లినప్పుడు మా నాన్నతో మాట్లాడానో లేదో అనేది ఇప్పుడు అనవసరమైన మేటర్ అంటూ కొట్టిపారేశారు. ఇక కేటీఆర్ విచారణకు వెళ్తున్నప్పుడు వెళ్లాలో.. వద్దో అనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. అయినా విచారణ సమయంలో ఎవరినీ రానీయకుండా దూరంగానే అడ్డుకుంటున్నారు కదా? అని వ్యాఖ్యానించారు. ఇక కేసీఆర్ నార్మల్ చెకప్ కోసమే ఆస్పత్రికి వెళ్లారన్నారు. బోన్‌కు ఇంజక్షన్ వేయించుకుంటున్నారని.. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న ట్రీట్‌మెంట్ ఇప్పుడు జరుగుతోందని కవిత వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి.. మోడీని కలిసి 26 అంశాలై వినతిపత్రం ఇచ్చారని.. కానీ అందులో బీసీ బిల్లు లేదన్నారు. బీసీ బిల్లు అమలు కావాలనే చిత్తశుద్ధి రేవంత్‌రెడ్డికి లేదని ఆరోపించారు. బీసీ బిల్లు అమలు కోసం గట్టిగా పోరాటం చేస్తామని తెలిపారు. ఈనెల 17న జాగృతి ఆధ్వర్యంలో మెదక్‌లో రౌండ్ టేబుల్ సమావేశం పెట్టినట్లు చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇస్తామని కాంగ్రెస్ చెప్పడం కరెక్ట్ కాదన్నారు. రాష్ట్రంలో పాఠ్య పుస్తకాలను మార్చారని.. పుస్తకాలపై కొమురం భీమ్ బొమ్మను తీసివేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ఉద్యోగి అని ఆయనే చెప్పారని ఆయనకు వాళ్ల ముఖ్య నేతలే అపాయింట్‌మెంట్ ఇవ్వట్లేదన్నారు. వేరే వాళ్ల గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదన్నారు.

## ఆ ఇద్దరి వ్యాఖ్యల వెనుక జగన్మోహన్ రెడ్డి ప్రమేయం ఉంది..




**అమరావతి,:** అమరావతి రాజధాని నిర్మాణం ఆగదని పురపాలక శాఖ మంత్రి నారాయణ తేల్చి చెప్పారు. రాజధాని నిర్మాణాన్ని జగన్ ఆపాలని ప్రయత్నిస్తున్నాడు.. ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉన్నా పథకాలను కొనసాగిస్తున్నాం. ఎన్డీయే ప్రభుత్వ పని తీరును ప్రజలే మెచ్చుకుంటున్నారు అని చెప్పుకొచ్చారు. జగన్ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి రూ. 10 లక్షల కోట్ల అప్పులు వదిలి వెళ్ళడం.. ఏపీలో రూ. 85లక్షల టన్నుల చెత్తను వదిలేశారు.. ఏపీని స్వచ్ఛాంధ్రాగా మారుస్తున్నాం.. మచిలీపట్నంలో సీఎం ప్రకటన చేసిన విధంగా అక్టోబర్ 2వ తేదీకి 85 లక్షల టన్నుల చెత్తను ఎరువుగా మారుస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నాం.. పెన్షన్లను పెంచాం.. నిన్న ఒక్కరోజే రూ.10 వేల కోట్ల రూపాయలు తల్లికి వందనం ద్వారా ఖాతాల్లో జమ చేశామని పొంగూరు నారాయణ వెల్లడించారు. అలాగే, ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకుంటున్నాం అని మంత్రి నారాయణ తెలిపారు. మహిళలకు ఆగష్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తాం.. అన్న క్యాంటీన్ ద్వారా రోజుకు 2 లక్షల 20 వేల మందికి ప్రతిరోజు భోజనం అందిస్తున్నాం.. ఏసీ రూమ్స్ లో కూర్చుని మాట్లాడటం కాదు.. రాజధానిలో జరుగుతున్న పనులు వచ్చి చూడాలని సవాల్ చేశారు. ఇక, జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాస్, క్రిష్ణంరాజుల వ్యాఖ్యల వెనుక జగన్మోహన్ రెడ్డి ప్రమేయం ఉంది అని ఆయన ఆరోపించారు. టిడ్కో బాధితులను ఆదుకుంటాం.. ఇప్పటి వరకు 50 లక్షల టన్నుల చెత్త తొలగించాం.. మరో మూడు నెలల్లో 3.50 లక్షల టన్నుల చెత్త తొలగిస్తామని హామీ ఇచ్చారు. తిరుపతిలో రోజుకు 2500 టన్నులు చెత్త ప్రాసెస్ చేయాలి.. కాంట్రాక్ట్ సంస్థ 900 టన్నులు మాత్రమే ప్రాసెస్ చేస్తోంది అన్నారు. మరిన్ని అదనపు యంత్రాలు పెట్టి.. చెత్తను ప్రాసెస్ చేయాలని ఆదేశించామని మంత్రి నారాయణ చెప్పుకొచ్చారు.

## "సిందూర్" తర్వాత తొలి విదేశీ పర్యటన..
## మూడు దేశాలకు వెళ్తున్న ప్రధాని మోడీ..



**న్యూఢిల్లీ,:** పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారిగా ప్రధాని నరేంద్రమోడీ విదేశీ పర్యటనకు వెళ్తున్నారు. వచ్చే వారం కెనడాలో జరగబోయే జీ-7 సదస్సుకు ప్రధాని హాజరు కానున్నారు. ఈ విషయాన్ని విదేశాంగ మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. కెనడా ప్రధాని మార్క్ కార్నీ స్వయంగా మోడీకి ఫోన్ చేసి ఆహ్వానించారు. ఖలిస్తానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య తర్వాత కెనడా-భారత్ మధ్య దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈ పరిణామాల తర్వాత తొలిసారి ప్రధాని మోడీ కెనడా వెళ్తున్నారు. కెనడాతో పాటు ప్రధాని మోడీ సైప్రస్, క్రొయేషియా దేశాల్లో కూడా పర్యటిస్తారు. జూన్ 16-17 తేదీల్లో కెనడాలోని కననాస్కిస్‌లో జరిగే జీ-7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. ఈ శిఖరాగ్ర సమావేశంలో, ఇంధన భద్రత, సాంకేతికత మరియు ఆవిష్కరణలతో సహా కీలకమైన ప్రపంచ సమస్యలపై భారతదేశం యొక్క వైఖరిని ప్రధాన మంత్రి భారత వైఖరి తెలియచేస్తారని మంత్రిత్వ శాఖ వెల్లడించింది. జూన్ 15 నుంచి 16 వరకు మోడీ సైప్రస్ పర్యటనలో ఉంటారు. ఆ తర్వాత 16-17 వరకు జీ-7 సమావేశంలో పాల్గొంటారు. దీని తర్వాత జూన్ 18న క్రొయేషియాలో పర్యటిస్తారు.

# రక్తదానం.. మానవతా ధర్మం



జూన్ 14, ఈ తేదీ వినగానే ఓ గొప్ప సేవా భావానికి, ఓ మానవత్వానికి నిదర్శనంగా నిలిచే రోజు గుర్తుకు వస్తుంది. అదే అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం. మనుషుల్లో నిజమైన మానవత్వాన్ని, కరుణను, నిస్వార్థతను ప్రతిబింబించే అద్భుతమైన సందర్భం ఇది. ఈ రోజు, మనకు తెలిసిన, తెలియని వేలాది మంది రక్తదాతల సేవలను స్మరించుకునే, గౌరవించుకునే రోజు మాత్రమే కాదు - మరెంతో మందిలో రక్తదానం చేయాలనే స్ఫూర్తిని కలిగించే రోజు కూడా. ఒక్కోసారి మనం చేసే చిన్న సహాయం ఎన్నో లక్షల కుటుంబాలను నిలబెడుతుంది. రక్తదానం అచ్చంగా, స్వచ్ఛంగా అలాంటి సహాయమే. రక్తాన్ని ఇవ్వడం కోసం మనం ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. కానీ, మనం ఇచ్చే ప్రతి ఒక్క రక్తపు బొట్టు లక్షల జీవితాలకు ఊపిరిగా నిలుస్తుంది. మన రక్తంలో ఉన్న జీవశక్తి ఇంకొకరికి శ్వాసగా మారుతుంది. రక్తదానం మనిషి చేసే అన్ని దానాల కంటే చాలా గొప్పది. వాస్తవానికి ఇది దానం చేయడం కాదు ప్రాణం పోయడం. ప్రతి బ్లడ్ బ్యాంక్ దగ్గర, హాస్పిటల్ దగ్గర పరిస్థితులను గమనించగలిగితే ఈ వాస్తవికత మనకు అర్థమవుతుంది. ప్రతి రెండు నిమిషాలకో వ్యక్తికి భారతదేశంలో రక్తం అవసరం అవుతుందని కొన్ని గణాంకాలు చెబుతున్నాయి. గర్భిణీలు సురక్షితంగా బిడ్డకు జన్మనివ్వాలంటే, రోడ్డు ప్రమాద బాధితులు మరలా తమ జీవితాన్ని, కుటుంబ భవిష్యత్తును చూడాలంటే, క్యాన్సర్, ఇతర తీవ్రవ్యాధులతో పోరాడుతున్న వారిలో ఆశను బతికించాలంటే రక్తదానమే ప్రాణాధారం. ఇలాంటి సందర్భాల్లో రక్తదానం అక్షరాలా ఓ సంజీవినిగా మారుతుందని చెప్పడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. అయితే, ఆందోళన పడవలసిన వాస్తవం ఏమిటంటే, మన దేశంలోని అనేక హాస్పిటళ్లూ, బ్లడ్ బ్యాంకులూ అవసరమైనంత రక్తనిల్వలను కలిగి లేవు. ప్రతి రోజు వేలాది మందికి రక్తం అవసరమవుతున్నా, అందుబాటులోలేక బాధితులు ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ కొరతను అధిగమించగల శక్తి మనందరిలో ఉంది. అందుకే ప్రజలందరిలో ముఖ్యంగా యువతలో, రక్తదానం పట్ల స్పష్టమైన అవగాహన కల్పించాలి. రక్తదానం చేయడాన్ని కేవలం ఓ సేవగానే కాకుండా ఒక బాధ్యతగా కూడా భావించాలి.రక్తదానం చేయడం వలన మనకు శారీరిక, మానసిక ఆరోగ్యాలతో పాటు ఆత్మసంతృప్తి కలుగుతుంది. ఇది మనల్ని ఎవరు గుర్తించకపోయినా కూడా కలిగే నిజమైన ఆత్మసంతృప్తి. అంతేకాదు, మన మీద మనకి గౌరవం పెరుగుతుంది. ప్రతి రక్తదానంతో శరీరంలోని అదనపు ఐరన్ మోతాదును తగ్గించుకోవచ్చు. ఇది గుండెపోటు వంటి సమస్యల అవకాశాలను తగ్గిస్తుంది. మరిన్ని పరిశోధనల ప్రకారం, రక్తదానం చేసే వారికి గుండె ఆరోగ్య పరిస్థితులు మెరుగుగా ఉంటాయని తేలింది. ఒక జీవితాన్ని కాపాడినప్పుడు కలిగే ఆనందం చాలా అమూల్యమైనది, వెలకట్టలేనిది. రక్తదానం చేయడం వలన మనలో మానవతా దృక్పథం పెరుగుతుంది. ఈ జీవితం మనకోసమే కాదు ఇతరుల కోసం కూడా అనే సామాజిక భావం మనలో చిగురిస్తుంది. ఈ భావన మనల్ని మరింత బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్ది మనకు గౌరవాన్ని తీసుకొస్తుంది. వయస్సు 18 నుండి 65 ఏళ్ళ మధ్యలో ఉండి, ఆరోగ్యంగా ఉండేవారు రక్తదాతలుగా మారవచ్చు. మధుమేహం, బిపి వంటివి ఉన్నవారైనా, వాటిని నియంత్రణలో ఉంచి డాక్టరు సలహా మేరకు రక్తం ఇవ్వవచ్చు. ప్రతి రక్తదాత ఒకరి జీవితాన్ని మార్చడమే కాదు, తమను తాము గొప్పగా చూసుకునే అవకాశం పొందుతారు! ఒక మనిషి మానవతా వాదిగా మారటానికి మొట్టమొదటి అడుగు రక్తదానం. సామాజిక బాధ్యత గల ప్రతి ఒక్కరూ రక్తదానాం చేసి తమలోని మానవత్వాన్ని చాటుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రతి ఒక్కరూ రక్తం ఎందుకు ఇవ్వాలని ఆలోచించడం మాని, ఎప్పుడు ఇవ్వాలని ఆలోచించాలి. మనిషి తన మేధస్సును అనుకరించగల కృత్రిమ మేధస్సును సృష్టించాడు గాని కృత్రిమ రక్తాన్ని సృష్టించలేకపోయాడు. మనం ఒక్కసారి రక్తం ఇవ్వడం ద్వారా ఒక వ్యక్తిని కాదు, ఆ వ్యక్తి మీద ఆధారపడి బతుకుతున్న ఓ కుటుంబాన్ని బతికించగలం. ఈ అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు తమ రక్తాన్ని దానం చేయాలనే ఒక మంచి నిర్ణయాన్ని తీసుకొని తమ మానవత్వాన్ని చాటుకోవాలి. మనిషికి ఉన్నది ఒకే ఒక్క జీవితమైనా, దానికి ఇంకొకరికి జీవితం ఇవ్వగల శక్తి ఉంది.

# చట్టసభల కాలం తగ్గడం, దేశానికి నష్టదాయకం!



ఏకపక్ష పాలన కోసం కేంద్రపాలకులు అధ్యక్ష తరహా పాలనవైపు మొగ్గుచూపుతున్నాయి. ప్రజలు దాన్ని తోసిపుచ్చి పార్లమెం టరీ ప్రజాస్వామ్యాన్ని ఎంచుకుంటు న్నారు. చర్చలు, ప్రశ్నలు, జవాబు లతో కార్య నిర్వహక వర్గాన్ని, చట్టసభలను జవాబుదారీ చేయాలనే ఇందులో సదుద్దేశం. ఇది ప్రజా ప్రతినిధుల ద్వారా నిర్మాణాత్మక అధికారం పౌరులందరి చేతుల్లో ఉంచబడే ఆయుధం. ఇటీవల జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రదాడులు అమాయకుల ప్రాణాలు తీసినప్పుడు ఆ దేశంపై యుద్ధ సన్నద్ధత కోసం కేంద్రం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. దానికి ప్రధాని గైర్హాజరు కావడం గమనార్హం. ఆ తర్వాత నాలుగు రోజుల్లో యుద్ధవాతావరణం, ఇరుదేశాల మధ్య కాల్పుల విరమణ విషయాన్ని సామ్రాజ్యవాద దేశ అధిపతి ట్రంప్ "ఎక్స్"లో ప్రకటించడంతో కేంద్రం దానికి అనుగుణంగా విరమించింది. అయితే ఉగ్రవాదం విషయంలో పాకిస్తాన్‌ను అంతర్జాతీయ సమాజంలో దోషిగా నిలబెట్టడానికి అఖిలపక్ష ఎంపీలతో ప్రతినిధి బృందాలను పంపడంలో ఉన్న శ్రద్ధ, పార్లమెంటును సమావేశపరిచి యుద్ధానంతర పరిణామాలను తెలియపరిచే బాధ్యత కేంద్రం చేయలేదు. 1962,1971 ఇండో-పాక్ యుద్ధ సమయాల్లో సభకు అప్పటి పరిస్థితులను ప్రభుత్వాధినేతలు వివరించారు.కానీ, నేడు దేశాన్ని ఏలుతున్నవారు ఆ బాధ్యతను పూర్తిగా విస్మరిస్తున్నారు. భారత పునర్నిర్మాణం, ప్రజాస్వామ్య రక్షణ, రాజ్యాంగబద్ధ పాలన కోసం చట్టసభలు పనిచేస్తున్నవి. కానీ వాటిని అమలు చేయడంలో పాలకుల నిర్లక్ష్యం ప్రజల్ని నిండా ముంచుతున్నది. పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీలు ప్రతి ఏటా విరివిగా భేటీ కావాల్సి ఉన్నప్పటికీ అది అంతంతమాత్రంగానే ఉన్నది. పాలకుల తప్పులను ఎండగడుతూ ప్రజాసేవలో నాణ్యత, చిత్తశుద్ధి పెంపునకు దేశ ఆత్మ గౌరవానికి, సార్వ భౌమాధికారానికి భంగం వాటిల్ల కుండా సూచనలు అందించాల్సి ఉన్నప్ప టికీ ఆ దిశగా అడుగులు వేయకపోవడం లోపంగా కనిపిస్తున్నది. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రజా సమస్యలపై ఎంపీలు, ఎమ్మెల్యేలు గళమెత్తుతూ వాటి పరిష్కా రానికి కృషి చేయడం వారి ప్రధాన కర్తవ్యంగా ఉన్నా దాన్ని పట్టించుకోకపో వడం శోచనీయం.చట్టసభలు మొక్కు బడిగా సమావేశమవుతుంటే? ప్రజా ప్రతి నిధులు తమ బాధ్యతలను ఎలా నిర్వహించగలరు? మన దేశంలో చట్టసభలు సమావేశమయ్యే రోజులు నానాటికీ తగ్గిపోతున్నాయి. అంతేకాదు, ఉద్దేశపూర్వకంగా అంతరాయం కల్పిం చడం సంఖ్యాబలంతో చర్చలు జరపకుండానే ఏకపక్షంగా బిల్లులు ఆమోదించుకోవడం మూలంగా మన దేశ చట్టసభల గౌరవ మర్యా దలు అడుగంటి పోతున్నాయి. మనదేశంలో మొదటి లోక్‌సభ వార్షిక సగటు పనిదినాలు 135 రోజులు అయితే, 17వ లోకసభ (2019-24)కు వచ్చేసరికి అవి 55కు పడిపోయాయి. చట్టసభల భేటీ సంఖ్య తగ్గి పోవడంపై స్పీకర్ల సదస్సు (ఏఐపీఓసీ) గతంలోనే ఆందోళన చెంది, ఇవి సాలీనా ఎన్ని రోజులు సమావేశమవ్వాలో నిర్దేశిస్తూ రాజ్యాంగ నిబంధనలను రూపొందించాలని 1993 "ఏఐపీఓసీ" తీర్మానించింది. ఆ మేరకు 70 మంది కంటే తక్కువ సభ్యులు ఉన్న అసెంబ్లీ ఏడాదికి కనీసం యాభైరోజులు కొలువుదీరాలని, మిగిలిన రాష్ట్రాల చట్టసభలు తొంభై రోజులు నడపాలని సంధాన సమీక్ష సంఘం (జస్టిస్ వెంకటాచలమయ్య) కమిషన్ సిఫారసు చేసింది. ఆ మేరకు రాజ్యసభ 100, లోక్‌సభ 120 రోజులపాటు భేటీ కావాలి. కానీ ఈ సూచనలేవి అమలు కాకపోవడంతో ప్రజాస్వామ్య స్ఫూర్తికి విఘాతం కలుగుతోంది. దీంతో ప్రభుత్వాలపై చట్టసభల పర్యవేక్షణతో పాటు పాలనలో పారదర్శకత అడుగంటి పోతోంది. చట్టసభల భేటీ తగ్గిపోవడంతో పాటు, అనవసర వాగ్వివాదాలతో ప్రజా సమస్యలపై చర్చించాల్సిన కాలాన్ని వృధా చేయడం, నిశిత చర్చలు లేకుండానే మంద బలంతో కార్పొరేట్లకు ఉపయోగపడే చట్టాలు ఆమోదించుకోవడం మరో దౌర్భగ్యం. ప్రజాప్రయోజనాల్ని, శ్రేయస్సును గాలికొదిలేసి నాయకులు అధికారానికి సాగిలపడి వ్యక్తి పూజతో విలువైన సమయాన్ని, ప్రజాధనాన్ని వృథా చేస్తుంటే ప్రజలు ప్రశ్నించకర్లేదా? పని వేళల సగటు 20 రోజులే.. 500 బిల్లులకు ఆమోదం అంటూ (పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రిసెర్చ్ సంస్థ) అధ్యయనం ఈ విష యాన్ని తెలియజేసింది. మన దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన శాసనసభలు గత సంవత్సరం సగటున 20 రోజులు 100 గంటలు మాత్రమే పనిచేశాయి. ఆ కాలంలో 17 బిల్లులను ఆమోదించాయి. వీటిలో 51శాతం బిల్లులు ప్రవేశపెట్టిన ఒక్కరోజు వ్యవధిలోనే ఆమోదం పొందాయి. ఒడిశా శాసనసభ 42 రోజులు, కేరళ శాసనసభ 37 రోజులు, పశ్చిమబెంగాల్ శాసనసభ 36 రోజులు పనిచేసి కొంత మెరుగనిపించాయి. కర్నాటక శాసనసభ ఏడాదికి 60 రోజులు సమావేశం కావాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నప్పటికీ, కేవలం 29 సీటింగ్స్ మాత్రమే జరిగాయి. దేశంలో అతిపెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ ఏడాదికి 90 సీటింగ్స్ జరపాలని అనుకుంటే, కేవలం 16 సమావేశాలతోనే సరిపెట్టింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ కూడా 16 రోజులే సమావేశమైంది. మణిపూర్‌లో 14, జమ్ము కాశ్మీర్ 5, నాగాలాండ్ 6, సిక్కింలో 8 రోజులపాటు శాసనసభ సమావేశాలు జరిగాయి. రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర శాసనసభలు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేశం కావాల్సి ఉంటుంది. కానీ ఒకటి రెండు రోజులు స్వల్పకాలిక సిట్టింగ్లతో కలిపి 11 రాష్ట్రాల్లో ఈ నియమాన్ని పాటించాయి. 2017 నుంచి ఏడాదికి సగటున 30 రోజుల కంటే తక్కువగా సమావేశాలు జరిగాయి. ఆ సమయంలో 28 సీటింగ్స్ జరగ్గా, 2020లో కోవిడ్ కాలంలో ఆ సంఖ్య 16కు పడిపోయాయి. అప్పటినుంచి సగటున ఏడాదికి సుమారు 20 రోజుల పాటే సమావేశాలు జరిగాయి. 2018లో సగటున 26 సీటింగ్స్, 2019లో 24 సీటింగ్స్, 2021లో, 22లో 21 సీటింగ్స్ చొప్పున, 2023లో 22 సీటింగ్స్ జరగగా గత సంవత్సరం ఆ సంఖ్య 20 కి తగ్గిపోయింది. కొన్ని రాష్ట్రాలు శాసనసభ ద్వారా లేదా నిబంధనలు రూపొందించుకోవడం ద్వారా కనీసం వార్షిక సిట్టింగ్స్‌ను నిర్దేశించుకున్నప్పటికీ 2017 నుంచి 2024 మధ్య వాటిలో ఏ రాష్ట్రము లక్ష్యాన్ని చేరలేదని నివేదిక వేలెత్తి చూపింది. గత సంవత్సరం శాసనసభలు సగటున 100 గంటలు సమావేశం అయ్యాయి. కేరళ అత్యధికంగా 228 గంటల పాటు సమావేశం నిర్వహించగా, ఒడిస్సా 193 గంటలు, మహారాష్ట్ర, రాజస్థాన్ 187 చొప్పున, గోవా 172, ఛత్తీస్‌గఢ్ 155, తెలంగాణ 149, కర్నాటక 145 (గంటలు) తర్వాత స్థానాల్లో నిలిచాయి. బిల్లులకు సంబంధించి సగటున ప్రతి శాసనసభ 17 బిల్లులను ఆమోదించింది. గతేడాది మొత్తం మీద 500 బిల్లులు ఆమోదం పొందాయి. 49 బిల్లులతో కర్నాటక మొదటి స్థానంలో నిలువగా, తమిళనాడు 45, హిమాచల్ ప్రదేశ్ 32, మహారాష్ట్ర 32 తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఢిల్లీ శాసనసభ కేవలం ఒకే బిల్లును ఆమోదించగా, రాజస్థాన్ అసెంబ్లీ రెండు బిల్లులకు ఆమోదం తెలిపింది. ఇలా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ, రాజ్యాంగబద్ధ పాలనలో ప్రజాప్రతినిధుల పాత్ర, చట్టసభల నిర్వహణ భేటీ తగ్గిపోతుంటే,. ప్రజా సమస్యలు ఎలా పరిష్కరించబడతాయి? కీలక సందర్భాల్లో సైతం ప్రజాభిప్రాయాలు వెల్లడి చేసుకునే అవకాశం లేకపోవడం బాధాకరం. వ్యక్తి ఆరాధన, పార్టీల సొంత ఎజెండా కోసం ప్రజా కాలాన్ని వృధా చేస్తూ నిశిత చర్చలు లేకుండానే చట్టసభలు ముందుకెళ్లడం భావ్యమా! ప్రజాసామ్య స్ఫూర్తికి విఘాతం కలిగించడంతో ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజల నమ్మకం తగ్గుతున్నది. దీన్ని నిలబెట్టేలా పాలకులు నిర్దిష్టమైన కాలాన్ని ప్రజల కోసం వెచ్చించాలి. చట్టసభల పనిగంటల్ని పెంచాలి.

# అమ్మో ఏఐతో జాబ్ ఇంటర్వ్యూ.. అన్నీ పట్టేస్తుంది!



ఆర్టిఫీషియల్ వినియోగం విస్తృతంగా పెరిగిపోయింది. ఇది లేదనకుండా ఏఐ అన్ని పనులూ చేసేస్తోంది. నోయిడాకు చెందిన అనుభవజ్ఞురాలైన ప్రొడక్ట్ మేనేజర్ రాధికా శర్మకు ఇటీవల ఒక ప్రత్యేకమైన ఉద్యోగ ఇంటర్వ్యూ అనుభవం ఎదురైంది. అక్కడ ఆమెను హ్యూమన్ ప్యానెల్‌కు బదులుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత రోబోట్ ఇంటర్వ్యూయర్ అంచనా వేశారు. టెక్ లో దాదాపు దశాబ్ద అనుభవం ఉన్న శర్మ బిజినెస్ ఇన్ సైడర్ తో తన అనుభవాన్ని పంచుకున్నారు. వర్చువల్ స్క్రీనింగ్ సిస్టమ్ ఆమె నైపుణ్యాలను అంచనా వేయడమే కాకుండా ఆమె వస్త్రధారణపైనా ఫీడ్ బ్యాక్ అందించిందని వెల్లడించారు. ఈ అనుభవాన్ని "అద్భుతమైన అదేసమయంలో కలవరపరిచేది"గా ఆమె అభివర్ణించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటర్వ్యూ ప్రక్రియ నుండి లాభనష్టాలు, ఇతర కీలక అంశాలను చర్చించారు. చిన్నదైన కుమార్తె సంరక్షణ కోసం రాధికా శర్మ తన ప్రొడక్ట్ ఓనర్ బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. ఇప్పుడు ప్రొడక్ట్ మేనేజ్ మెంట్ పొజిషన్ ను వెతుక్కుంటూ మళ్లీ జాబ్ మార్కెట్లోకి రీఎంట్రీ ఇస్తోంది. ఒక సాస్ కంపెనీ ఆమెను ఏఐ ఆధారిత స్క్రీనింగ్ ఇంటర్వ్యూకు ఆహ్వానించింది. ఇంటర్వ్యూ ప్రక్రియ ప్రారంభానికి ముందు నిశ్శబ్ద వాతావరణం ఉండేలా చూసుకోవాలని, కంప్యూటర్‌లోని ట్యాబ్ లను మార్చవద్దని, పర్యవేక్షణ కోసం స్క్రీన్ షేరింగ్ చేయాలని అవతల నుంచి సూచనలు వచ్చాయి. 'ఇంటర్వ్యూ ప్రారంభమైన వెంటనే, సుమారు 20 నిమిషాల టైమర్ ప్రారంభమైంది. అటు పక్క నుంచి మహిళా వాయిస్ తో కూడిన ఖాళీ స్క్రీన్ నన్ను పలకరించింది. ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ గురించి చాలా నిర్దిష్టమైన ప్రశ్నలు అడగడం ప్రారంభించింది" అని రాధికా శర్మ చెప్పారు. ఈ ఇంటర్వ్యూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా జరుగుతుందని కంపెనీ ముందుగానే స్పష్టంగా పేర్కొంది. ఇంటర్వ్యూ ముగిసిన వెంటనే శర్మ ఏఐ టూల్ నుంచి సవివరమైన పనితీరు మదింపును అందుకున్నారు. తాను నిమగ్నమయ్యే విధానం, ఐ కాంటాక్ట్, ముఖ కవళికలు, భంగిమలు, వస్త్రధారణ వంటి అన్ని కొలమానాలతో పాటు ఆమె సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏఐ అంచనా వేసింది. ఆమె సాంకేతిక నైపుణ్యాలు బాగా సాధించినప్పటికీ, ఆమె దుస్తులు ప్రొఫెషనల్‌గా ధరించలేదని, ఐ కాంటాక్ట్ సక్రమంగా లేదని పేర్కొంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యాలను తక్కువగా అంచనా వేశానని, అమ్మో ఏఐ అన్నింటినీ క్షణ్ణంగా గమనిస్తుందని రాధికా శర్మ చెప్పుకొచ్చారు.

## సంపాదకీయం

# మళ్లీ రణరంగంలా పశ్చిమాసియా


ఆగర్భ శత్రువులైన ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న పోరుతో పశ్చిమాసియా మరోసారి భగ్గుమంటోంది. ఇటీవల ఇరాన్‌తో అమెరికా జరిపిన అణుచర్చలు విఫలం కావడంతో ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని ఇజ్రాయెల్ అమెరికా దన్నుతో దాడులు మొదలు పెట్టింది. గురువారం అర్ధరాత్రి నుంచి ఇరాన్ లోని అణుకేంద్రాలతోపాటు సైనిక స్థావరాలను లక్షంగా చేసుకుని క్షిపణులు కురిపిస్తోంది. అతిపెద్ద నతాంజ్ అణుశుద్ధి కేంద్రం తీవ్రంగా దెబ్బతింది. ఇరాన్ పారామిలిటరీ రెవల్యూషనరీ గార్డ్ చీఫ్ సలామీ, ఆర్మీ చీఫ్ మహమ్మద్‌బాఘెరీ, ఖాత్ అల్ అన్‌బియా హెడ్‌క్వార్టర్స్ చీఫ్ అలి రషీద్, ఇరాన్ సుప్రీం లీడర్ సలహాదారు అలాషంఖాని సహా ఆరుగురు అణుశాస్త్రవేత్తలు, పలువురు కీలక వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో అత్యయిక స్థితిని ప్రకటించగా, ఇజ్రాయెల్ దేశమంతా అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఇరాన్ కూడా కొన్నిగంటల్లోనే ఇజ్రాయెల్‌పై వందకు పైగా డ్రోన్లతో దాడి చేసింది. వాటిని కూల్చివేసినట్టు ఇజ్రాయెల్ వెల్లడించింది. ఇరాన్ అణుకార్యక్రమానికి గుండెకాయ వంటి ప్రదేశాన్ని ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వెల్లడించగా, ఈ దాడులకు ప్రతీకార చర్య తీవ్రంగా ఉంటుందని ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ హెచ్చరించారు. ఎప్పుడూ లేని విధంగా నివాస ప్రాంతాలపై దాడి చేయడం ద్వారా ఇజ్రాయెల్ తమ దుష్టబుద్ధిని చాటుకుందని ఆగ్రహించారు. దాడులతో విపరీత పరిణామాలే తప్ప సాధించేదేమీ లేదని, ఇకనైనా అమెరికాతో అణు ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరించారు. పరిస్థితి చేయిదాటక ముందే తమతో చర్చలు జరపాలని స్పష్టం చేశారు. తాను చెప్పినట్టు చేస్తే ఇక మరణాలు, విధ్వంసాలు ఉండవన్నారు. తమతో ఒప్పందం కుదుర్చుకోవడానికి ఇరాన్‌కు ఒక అవకాశం తర్వాత మరో అవకాశం ఇస్తూ వచ్చామన్నారు. ప్రపంచంలోనే ఎక్కడా లేని అత్యుత్తమ, అత్యంత ప్రాణాంతకమైన సైనిక పరికరాలను అమెరికా తయారు చేస్తోందని, అందులో అనేకం ఇజ్రాయెల్ వద్ద ఉన్నాయని తెలిపారు. వాటిని ఎలా ఉపయోగించాలో కూడా ఆ దేశానికి తెలుసని, తరువాత పరిస్థితి తాను ఊహించిన దానికంటే దారుణంగా ఉంటుందని హెచ్చరించారు. అంటే ఒక విధంగా ఇజ్రాయెల్ దాడికి అమెరికా పూర్తిగా సమర్థిస్తున్నట్టే. ఇజ్రాయెల్ దాడులను సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. ఇవి ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, భద్రతను బలహీనపరుస్తాయని ఆగ్రహించింది. ఈ దాడులతో ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాలు, నిబంధనలను ఉల్లంఘించిందని తీవ్రంగా విమర్శించింది. ఇజ్రాయెల్ ఇరాన్ దేశాలకు చిరకాల మిత్రదేశంగా ఉన్న భారత్ ఈ దాడులకు తీవ్రంగా స్పందించింది. ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కాకుండా, దౌత్యమార్గాల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ సూచించింది. ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు సాయం చేస్తామని చెప్పింది. ఇజ్రాయెల్ వైమానిక దాడులతో పశ్చిమాసియా మళ్లీ ఉద్రిక్తంగా మారడంతో ఈ రెండు దేశాల్లో నివసిస్తున్న భారత పౌరులను ఉద్దేశించి అక్కడి మన ఎంబసీలు అడ్వైజరీలు జారీ చేశాయి. ఎవరూ అనవసర ప్రయాణాలు చేయొద్దని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించాయి. స్థానిక అధికారులు చెప్పే భద్రతా ప్రమాణాలను పాటించాలని, ఎంబసీల సోషల్ మీడియా ఖాతాలను అనుసరించి తాజా సమాచాతెలుసుకోవాలని పేర్కొన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సురక్షిత శిబిరాలకు చేరుకొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించాయి. ఇరాన్ గత కొన్నేళ్లుగా భారీ ఎత్తున యురేనియం నిల్వలు చేస్తున్నట్టు బయటపడింది. 2003 వరకు ఇరాన్ రహస్య అణ్వాయుధాలను అభివృద్ధి చేసిందని పాశ్చాత్య దేశాలు నిరూపిస్తున్నాయి. అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక నిబంధనలను ఇరాన్ ఉల్లంఘిస్తోందని ఐక్యరాజ్యసమితికి చెందిన ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఎఇఎ) బోర్డు గుర్తించింది. ఈ విధమైన ప్రకటన ఐఎఇఐ చేయడం గత ఇరవై ఏళ్లలో ఇదే తొలిసారి. ఈ మేరకు ఫ్రాన్స్ ప్రవేశపెట్టిన తీర్మానానికి బ్రిటన్, జర్మనీ, అమెరికా దేశాలతోపాటు ఐఎఇఎ బోర్డు గవర్నర్లు ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ దాడులు మొదలు పెట్టింది. ఈ పరిస్థితి భారత్‌లో స్టాక్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపించింది. శుక్రవారం భారీ నష్టాలతో ప్రారంభమైన సూచీలు అలాగే కొనసాగుతున్నాయి.ప్రారంభంలోనే సెన్సెక్స్ 1000 పాయింట్లకు పైగా నష్టపోయింది. నిఫ్టీ 24,600 దిగువకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు 12 శాతం పెరిగాయి. వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ బ్యారెల్ 12.6 శాతం పెరిగి 76.61 డాలర్లకు చేరుకోగా, బ్రెంట్ నార్త్ సీ క్రూడ్ 12.2 శాతం పెరిగి 77.77 డాలర్లకు చేరింది. చమురు ధరలు పెరగడమే కాకుండా చమురు సరఫరాకు కూడా అంతరాయం ఏర్పడవచ్చనే ఆందోళనలు పెరిగాయి. దీంతో చమురు రంగ షేర్లు ఒత్తిడికి లోనవుతున్నాయి. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 6.1 శాతం తగ్గి రూ. 299.20 వద్ద ట్రేడవుతున్నాయి. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ షేర్లు 3.9 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ షేర్లు 5.3 శాతం నష్టపోయాయి. ఒమన్ ఇరాన్ సముద్ర మార్గంలో హర్మోజ్ జలసంధి ద్వారా సౌదీ అరేబియా, యుఎఇ, కువైట్, ఖతార్, ఇరాక్, ఇరాన్ దేశాల నుంచి వివిధ దేశాలకు రోజుకు 2.1 కోట్ల (21 మిలియన్ ) బ్యారెళ్ల చమురు ఎగుమతి అవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా రోజువారీ వినియోగంలో ఇది 21 శాతం ఇక్కడి నుంచే సరఫరా అవుతోంది.

# మానవ ఆరో గ్యానికి మేలు చేసే సాధనగా యోగాను ప్రోత్సహించాలి



మానవ ఆరోగ్యాన్ని పెంపొందించే ప్రాచీన భారతీయ సాధన యోగ. శరీరంపై పట్టు సాధించడం కోసం యోగ అనే ప్రక్రియను ప్రాచీన కాలంలో తాంత్రికులు ప్రారంభించారు. ఈ యోగాసనాలు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే గాక, నిద్రలేమి, మానసిక ఒత్తిడి, జీవనశైలి సంబంధిత వ్యాధులను తగ్గించడంలో సహాయపడతాయి. ప్రాచీన గ్రంథాలు, పతంజలి 'యోగ సూత్రాలు' మొదలైన పుస్తకాలు కూడా శరీరాన్ని ఆరోగ్యంగా వుంచే ప్రక్రియగా దీన్ని వివరిస్తాయి. 'దాచిపెట్టిన జ్ఞానం నిరుపయోగం కావడమేగాక ప్రజలను పీడించడానికి సాధనమౌతుంది' అంటారు కొడవటిగంటి. ఆ కాలంలో అనేక వ్యాధులను నయం చేయడానికి యోగ ఉపయోగపడుతుందనే దురభిప్రాయం వుండేది. అది కాస్తా ఇప్పుడు, జబ్బులు నయం చేయడానికి యోగాను మించింది లేదన్న ప్రచారంగా మారింది. కొన్ని రకాల జబ్బులకు వాకింగ్ వంటి వ్యాయామాన్ని డాక్టర్లు సూచిస్తున్నట్లుగానే, యోగాని కూడా చూడాలి. శరీరంలోని కండరాల నొప్పులను నయం చేయగలదేమో కాని, యోగ వల్ల గుండె జబ్బుల వంటి వ్యాధులు కూడా నయమౌతాయన్న ప్రచారం నిజం కాదు. దానికి సంబంధిత వైద్యులను సంప్రదించాల్సిందే. శాస్త్రీయంగా రుజువుకాని, ఎట్టి పరిశోధనలూ జరగని, పాతకాలపు నాటు వైద్యాలు, నమ్మకాలు ప్రకృతి వైద్యం, ప్రాణిక్ హీలింగ్, యోగా, ధ్యానం వంటి పేర్లతో ఇటీవల అనేకం ప్రచారంలోకి వస్తున్నాయి. క్రీ.పూ. మొదటి శతాబ్దం- నాల్గవ శతాబ్దం మధ్య సంకలనం చేయబడిన 'పతంజలి యోగ సూత్రాలు' యోగ తత్వ శాస్త్రానికి సంబంధించిన మొదటి గ్రంథంగా చెబుతారు. నాటి పతంజలి సూత్రాలను ఇప్పుడు పట్టుకొచ్చి నేటి పతంజలి పెద్ద వ్యాపారం నడుపుతున్నాడు. రామ్‌దేవ్ బాబా 'యోగా' సామ్రాజ్యం విలువ దాదాపు రూ.4వేల కోట్ల పైమాటే. ఈ యోగా వ్యాపారానికి మీడియా పెద్దఎత్తున ప్రచారం ఇస్తోంది. ఇది విచ్చలవిడిగా వెలుస్తున్న యోగా కేంద్రాల వ్యాపారానికి దోహదపడు తోంది. ప్రాచీన కాలం నుంచి మన దేశానికున్న ప్రత్యేకతల్లోకి నేడు మతాన్ని చొప్పించే ప్రయత్నం ప్రతి సందర్భంలోనూ జరుగుతుండటం బహిరంగ రహస్యం. ఇంకోవైపు దేశంలో రోజురోజుకీ పెరుగుతున్న సమస్యల నుంచి జనం దృష్టి మళ్లించడానికీ, పైసా ఖర్చు లేకుండా పెద్దఎత్తున రాజకీయ ప్రచారానికీ యోగాకు భారీ ప్రచారం కల్పిస్తున్నారు. ప్రతి యేడాది మల్లే ఈ ఏడాది కూడా జూన్ 21న జరుగు తున్న యోగా దినోత్సవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖరీదైన ఈవెంట్ మాదిరిగా పెద్దఎత్తున చేస్తున్న ప్రచారమే దీనికి నిదర్శనం. ఇప్పటికే రెండుకోట్ల మందికిపైగా ఎన్‌రోల్ చేసు కున్నట్లు చెప్తున్నారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ లోని విశాఖ ఆర్‌కే బీచ్‌లో ప్రధాని మోడీ పాల్గొంటు న్నట్టు ప్రచారం చేస్తున్నారు. ఈ యోగా కార్యక్రమంలో ఐదు లక్షల మంది ప్రత్యక్షంగా పాల్గొం టారని, దీనికోసం రూ.యాభై కోట్లు మంజూరు చేసినట్టు వార్తలు.యోగాంధ్ర పేరుతో నెల రోజులుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇదంతా ఎవరి ప్రయోజనం కోసం? మరీ ముఖ్యంగా యోగాకి హిందూమతానికి లింక్ పెట్టి, హిందూత్వ సిద్ధాంతాన్ని జనానికి ఎక్కించే ప్రయత్నం ప్రభుత్వ కార్యక్రమంగా చేయడం శోచనీయం. అందుకు మన రాష్ట్రం వేదికగా మారడం విచారకరం. కార్పొరేట్ సంస్థలు దీన్ని వ్యాపార అవకాశంగా మార్చుకుని, యోగా పాఠ శాలలు, బ్రాండెడ్ యోగా కేర్, ప్రత్యేక శిబిరాల పేరుతో వ్యాపారం చేసుకుంటున్నాయి. 'ఇంతవరకూ తత్వవేత్తలు ప్రపంచాన్ని గురించి వివరించారు. కావల్సింది దాన్ని మార్చడం' అంటారు కారల్ మార్క్స్. 'మన చేతుల్లో ఏముంది? అంతా దైవ నిర్ణయం' అంటారు ఆధ్యాత్మికవాదులు. అయితే, అంతా మన చేతుల్లోనే వుందనీ, మనం ఏం చేయాలనుకుంటే అది చేసెయ్యగలమనీ మార్క్స్ చెప్పలేదు. ప్రకృతి, సమాజం నిరంతరం మారుతుం టాయనీ, ఈ ప్రక్రియలో మనం జోక్యం చేసుకుని ఆ మార్పును అభివృద్ధి వైపు పయనింపజేయాలనీ చెప్పాడు. యోగాని కూడా ఈ విధంగానే చూడాలి. 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయష' అన్నట్లుగా అంతా యోగాలోనే వుందనే రాజకీయ ప్రచారం నుంచి బయటపడాలి. రాజకీయ, వ్యాపార, మత ప్రయోజనాలకు అతీతంగా, మానవ ఆరో గ్యానికి మేలు చేసే సాధనగా యోగాను ప్రోత్సహించాలి. అంతేగాని యోగా పేరుతో హిందుత్వ సిద్ధాంతాన్ని ప్రచారం చేసి, విద్వేష రాజకీయాలకు పురిగొలిపే ప్రచార ఆర్భాటాలకు ప్రజలు దూరంగా వుండాలి.

# విద్యావ్యవస్థ-మానవీయ విలువలు



మానవజాతిని కలవర పెడుతున్న హింసాత్మక ఘటనలు దేశంలో అనేకం చోటుచేసుకుంటున్నాయి. అనాగరిక దుశ్చర్యలు, మానవీయ సంబంధాల మధ్య అగాధం సృష్టిస్తున్నా యి. మంచులా కరిగిపోతున్న ఆత్మీయతలు, మితిమీరిన హింసా ప్రవృత్తి, అంతర్గతంగా దేశభద్రతకు విఘాతం కలిగిస్తున్నాయి. ఈ మధ్యకాలంలోజమ్మూకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన మతోన్మాద ఉగ్రదాడి పట్ల దేశమంతా స్పందించింది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ముక్త కంఠం వినిపించింది. అయితే దేశభక్తి ముసుగులో కొంతమంది చేస్తున్న అరాచకత్వం మాత్రం ఆక్షేపణీయం. అవీ పార్టీలైనా, సంస్థలైనా, సంఘాలైనా ఉగ్రవాదాన్ని ప్రేరేపించే విధంగా వ్యవహరిస్తున్న వారిపట్ల కఠినంగానే వ్యవహరించాలి. అయితే ఈ మతోన్మాదాన్ని పెంచిపోషించేది పాలకులే అయితే గనుక వారికి తగిన సమయంలో ప్రజలు బుద్ధి చెప్పాలి. ఇప్పుడు చెప్పదలుచుకున్న అంశం ప్రధాన ఉద్దేశం ఏమిటంటే? ఈ ఉగ్రదాడులు, వారికి సహకరించేవారు, లేదంటే ప్రోత్సహిస్తూ తోడ్పాటునందించే వారు ఇతరదేశాల్లోనే కాదు, మనదేశంలో కూడా ఉన్నారన్నది ఇంటిలిజెన్స్ సమాచారం. దాన్ని అరికట్టడం ఇప్పుడు సాధ్యమా? వారు అలా ఎందుకు తయారయ్యారన్న మూలాల్ని పట్టుకోవడం ముఖ్యం. అందుకు మన విద్యా విధానంలో చిన్నప్పటి నుంచే మానవీయ విలువల్ని నేర్పడం అత్యవశక్యం.ఎందుకంటే, నేటి బాలలు రేపటి భారత పౌరులుగా, భారత సమాజ నవనిర్మాణానికి పునాదులుగా చెప్పుకుంటున్నాం. కానీ వారికి మంచి బుద్దులు నేరాల్సింది ఈతరం విద్యా బోధకులదే. భారత జాతీయ సమైక్యతత్వాన్ని, లౌకికవాదాన్ని, దేశభక్తిని విద్యార్థి దశ నుండే విద్యార్థుల మనసుల్లోకి చొచ్చుకుపోయేలా వారికి ఈ విలువల్ని నేర్పించాలని ఇప్పుడు పౌర సమాజం బలంగా అభిప్రాయ పడుతున్నది. పహల్గాం ఉగ్రవాద దాడి అనంతరం తీగ లాగితే డొంకంతా కదిలినట్లు ఉగ్రముఖులకు సహకరించిన కొందరు వ్యక్తులు దేశంలో కూడా ఉన్నారని వార్తల్లో, టీవీల్లో చూశాం. అయితే ఇంతటి తెగింపు, ఉన్మాదం తలకెక్కించుకునే పరిస్థితి ఎందుకు వస్తుందనేది కీలకం. చదువులో సరిగా రాణించని వారుంటే నైపుణ్యాన్ని బట్టి పనిచేసుకుంటారు. కానీ ఇక్కడ దేశద్రోహం పేరుతో ముద్రవేస్తూ వారిని ముప్పు తిప్పలు పెడుతున్నవారే ఉగ్రవాదానికి సహరిస్తున్నారా? అనే అనుమానం కలగకమానదు. బాల్య దశ నుండి సరైన దిశానిర్దేశం లేక, మానవియ కోణంలో ఆలోచించే ధోరణి తగ్గిపోవడం,హానికరమైన కనికరం లేని లేని కఠినత్వ మనస్తత్వాలతో కొందరు క్రూరంగా మారడం ఈ దుస్థితికి కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు. సమాజంలో హింసాత్మ ధోరణికి చాలా కారణాలు వెతకచ్చు. కానీ వాటి మూలాల్ని అణిచివేసే దిశగా పాలకులు అడుగులు వేయడం కావాలి. తల్లిదండ్రుల తర్వాత విద్యార్థుల జీవనగమనంలో విద్యతోపాటు భవిష్యత్తు సమాజ నిర్దేశికత ఆలోచన విధానాలను ప్రతిబింబించేలా ఉపాధ్యాయులు ప్రేరణగా నిలుస్తారు. ప్రాథమిక పాఠశాల బాల్య దశలో విద్యార్థుల ఆలోచన విధానానికి బీజం పడుతుందనడంలో సందేహం లేదు. పరిసరాల్లో జరుగుతున్న విషయాలపై ఆసక్తి ఈ దశలోనే పెరుగుతుంది. విద్యతో పాటు విద్యార్థుల మనసులో మానవతా విలువలు, మానవతా దృక్కోణం, ఆలోచనలు దేశ జాతీయభావ స్ఫూర్తితో నేర్పాల్సింది ఈ దశలోనే. నేర ప్రవృత్తిని నిరోధించే విధంగా, హింసకు తావులేని ఆదర్శవంతమైన జీవన విధానాలను గమ్యాన్ని నిర్దేశించి విద్యావ్యవస్థనే.అక్కడ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలతో పాటు, జీవన విధానంలో వస్తున్న మార్పులకనుగుణంగా వారిని తీర్చిదిద్దడం వారి లక్ష్యంగా ఉండాలి.నేడు శాస్త్రీయ విద్యా విజ్ఞానాన్ని పెంపొందించే బోధన రోజురోజుకూ అంతరిస్తున్నది. పాలకులే మూఢ నమ్మకాల్ని పెంచిపోషిస్తున్న దుస్థితిని ఈ దశాబ్ద కాలంగా చూస్తున్నాం. స్ఫూర్తివంతమైన రచనలు, అందులోని అంశాలు, దేశ శ్రేయస్సు కోసం పోరాడిన మహానుభావుల చరిత్రల్ని తొక్కిపెట్టడం, తొలగించడం అత్యంత శోచనీయం. ఇలాంటి విధానాలే మన విద్యార్థులకు శాపాలుగా మారుతు న్నాయి. వారిని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు విఫలమవ్వ డానికి ఇలాంటివి కూడా దోహదపడతాయి. ఇలాంటి వాటి ప్రభావంతో విద్యార్థులకు నష్టం జరగకుండా ఉంటాలంటే ముందు వారి మనసుల్లో ద్వేషభావం పోవాలి. వారిలో పాజిటివ్ ధోరణి పెంచే విధంగా పాఠాలు, బోధనలు ఉండాలి. సమాజంలో జరిగే ప్రతిచర్య వెనుక ఉన్న మూలాన్ని పట్టుకుని వారికి వివరించాలి. మతోన్మాద భావజాలాన్ని వ్యతిరేకించే విధంగా వారిని తయారు చేయాలి. లేదంటే వారు పెద్దయ్యాక కులం, మతం, ప్రాంతం పేరుతో కొట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఒక నేరం లేదంటే ద్వేషభావం కుటుంబాన్ని ఎలా విచ్చిన్నం చేసి వారి ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తుందో ఉదాహర ణలతో చూపించాలి. జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీల గురించి వివరించాలి. నేరాల్ని తగ్గించేందుకు విద్యావ్యవస్థలో ఉన్న అనేక అవకాశాల్ని ఉపయోగించుకోవాలి. పోలీసులు కూడా ఈ ప్రయత్నాన్ని గౌరవించాలి, సహకరించాలి. అన్నింటికన్నా ముందు తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతిఒక్కరూ మంచిచె డుల పట్ల అవగాహన కలిగి ఉండాలి. ప్రతి గ్రామంలో పోలీసులు, ప్రభుత్వ అధికారులు సమావేశమై ప్రజలతో మమేక మవ్వాలి. నేర ప్రవృత్తిగల యువకుల్లో మౌళిక ఆలోచనలు పెంచే విధంగా కృషి చేయాలి. సమాజంలో చదువే అన్నింటికి మూలమన్న విషయాన్ని గమనించేలా, దానితోనే వారు అభివృద్ధి అయ్యేలా తోడ్పాటునందించాలి. అప్పుడే మెరుగైన సమాజంలో విద్యార్థులు, యువకులు భాగస్వాములవుతారు.

# ఇరాన్‌లో 80 మంది మృతి.. గగనతలం మూసేసిన ఇజ్రాయిల్..

**న్యూఢిల్లీ,:** మిడిల్ ఈస్ట్ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇజ్రాయిల్ ఇరాన్ అణు కార్యక్రమాలపై దాడులు చేయడంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తత తారాస్థాయికి చేరింది. టాప్ మిలిటరీ జనరల్స్, అణు శాస్త్రవేత్తలు టార్గెట్‌గా ఇజ్రాయిల్ దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఇరాన్ అణు కేంద్రాలు దారుణంగా దెబ్బతినడంతో పాటు కీలకమైన అధికారులు మరణించారు. ఇరాన్ కూడా ఇజ్రాయిల్‌పై ప్రతీకార దాడులు చేస్తోంది. వందలాది మిస్సైళ్లతో ఇజ్రాయిల్ రాజధాని జెరూసలెంతో పాటు కీలక నగరాలైన టెల్ అవీవ్, హైఫా పై దాడులు చేసింది. శుక్రవారం ప్రారంభమైన ఈ సంఘర్షణ ఆదివారం కూడా కొనసాగింది. ఆదివారం తెల్లవారుజామున ఇరు దేశాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నాయి. ఇరాన్‌లోని ఎస్పీఎన్డీ అణు ప్రాజెక్టు ప్రధాన కార్యాలయం అయిన ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయంపై దాడులు చేసినట్లుగా ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) తెలిపింది. అణు అర్కైవ్ దాడి పెట్టిన ప్రదేశాన్ని కూడా టార్గెట్ చేసినట్లు వెల్లడించింది. ఇజ్రాయిల్ టెహ్రాన్‌లోని అతిపెద్ద చమురు డిపో అయిన షహ్రాన్‌ని టార్గెట్ చేసింది. శనివారం ఇజ్రాయెల్ దాడిలో అగ్నిప్రమాదం సంభవించిన తర్వాత, ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ క్షేత్రం అయిన సౌత్ పార్స్ క్షేత్రంలో ఉత్పత్తిని కూడా ఇరాన్ పాక్షికంగా నిలిపివేసింది. ఇజ్రాయెల్ సైన్యం శుక్రవారం ఆపరేషన్ "రైజింగ్ లయన్"ను ప్రారంభించిన తర్వాత నుంచి ఇరాన్‌లో 78 మంది మరణించారని, 320 మందికి పైగా గాయపడ్డారని యూఎన్‌లోని ఇరాన్ రాయబారి వెల్లడించారు. మరోవైపు, ఇరాన్ జరిపిన దాడుల్లో కనీసం 10 మంది ఇజ్రాయిలీలు, 300 మందికి పైగా గాయపడినట్లు వెల్లడించింది. దాడులు తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇజ్రాయిల్ తన గగనతలాన్ని పూర్తిగా మూసేసింది.

## ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థలకు ఎన్నికల షెడ్యూల్

**హైదరాబాద్, :** పాలేరు నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి శనివారం కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఖమ్మం రూరల్, ఏదులాపురం మున్సిపాలిటీ, కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాల నుంచి నేతలు హాజరయ్యారు. ఒక్కో మండలానికి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించిన మంత్రి, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కీలక సూచనలు చేశారు. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఈ నెలాఖరులోగా స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. రేపటి క్యాబినెట్ సమావేశంలో ఈ అంశంపై చర్చించి, స్పష్టమైన తేదీలు ప్రకటిస్తాం అని తెలిపారు. తొలుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నిర్వహిస్తామని, ఆ తర్వాత సర్పంచ్ , మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటిస్తామని చెప్పారు. "ఎన్నికలకు రావడానికి 15 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. కావున, మీరు మీ గ్రామాల్లో చిన్న చిన్న లోటుపాట్లను వెంటనే గుర్తించి పరిష్కరించి, సిద్ధంగా ఉండాలి," అని మంత్రివర్యులు సూచించారు. రిజర్వేషన్ల ఆధారంగా గెలిచే అవకాశాలు ఉన్న అభ్యర్థులనే ఎంపిక చేయాలని సూచించారు. "ప్రజలలోకి సంక్షేమ పథకాల ప్రాధాన్యతను తీసుకెళ్లే బాధ్యత నాయకులదే. ఇప్పటికే అనేక పథకాలు ప్రజల దరి చేరాయి. రాబోయే వారం రోజుల్లో అర్హులైన రైతులకు రైతు భరోసా, సన్నాలకు రైతు బోనస్, వారి వారి ఖాతాల్లో జమ చేయబడుతుంది," అని మంత్రి పేర్కొన్నారు. మీ గ్రామాల్లో లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేయించుకోవడమే కాదు, నిర్మాణం పూర్తి చేయించే బాధ్యత కూడా స్థానిక నాయకులదే. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తవ్వాలి అని మంత్రి స్పష్టం చేశారు.

## ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని సీఎం.. మాజీ మంత్రి ఫైర్..!

**అమరావతి,:** ఏపీ మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, సీఎం చంద్రబాబు నాయుడు పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. 'తల్లికి వందనం' పథకం ప్రారంభ కార్యక్రమంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై బుగ్గన నేడు హైదరాబాద్ లో జరిగిన మీడియా సమావేశంలో స్పందించారు. ఈ సందర్భంగా బుగ్గన తన అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తూ.. చంద్రబాబును ఎవరు ప్రశ్నించినా ఉపేక్షించరనీ ఆయన మాటలు వింటే అర్థం అవుతుంది.. అది ప్రజలైన కూడా ఆయన ఉపేక్షించరని విమర్శించారు. ప్రజలు ఎన్నికల ముందు ఆయన ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, వాటి అమలుపై ప్రశ్నిస్తే ఆయన ఉగ్రంగా స్పందిస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలు అమలయ్యాయంటూ చంద్రబాబు ప్రకటించిన విషయాన్ని గుర్తుచేసిన బుగ్గన, ఆగస్టులో ఉచిత బస్సులు వస్తాయని చెబుతున్నారని, కానీ 15వ తేదీలు మారుతూ ఉన్నా ప్రజలను మభ్యపెడుతున్నారని ఎద్దేవా చేశారు. సిలిండర్ అన్నారు, ఒకటి ఇచ్చి ఎగనామం పెట్టారు. తల్లికి వందనం అంటున్నారు, కానీ ఎక్కువ మందిని అర్హులే కాదు అంటూ తిరస్కరిస్తున్నారన్నారు. ప్రభుత్వం పీపీపీ (పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్) విధానాన్ని అవలంబించడంపై బుగ్గన ప్రశ్నించారు. 2 కోట్ల 7 లక్షల మందికి డబ్బులు ఇవ్వాలి అంటున్నారు. కానీ పీపీపీ ప్రకారం ఎవరు ఇస్తారు? ఎందుకు ఇస్తారు? అని అస్పష్టతపై విమర్శించారు. ఈసారి బడ్జెట్ బుక్‌లో మొదటిసారి అప్పు వివరాలు ఇవ్వలేదు. ఇది చంద్రబాబు ప్రభుత్వానికి మచ్చ అని బుగ్గన పేర్కొన్నారు. మా ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు ఉన్నా పథకాలు అమలు చేశాం. మీరు మాత్రం తక్కువ ఖర్చుతో కూడిన పాలన ఉన్నా, అమలు చేయలేకపోతున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దిగజారిందని బుగ్గన తెలిపారు. రాష్ట్రం మరో శ్రీలంకగా మారబోతోంది. వ్యాపారాలు నడవడం లేదు. ప్రజలు మళ్లీ అప్పుల్లో మునుగుతున్నారు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు మళ్లీ కాల్ మనీ పేరుతో వడ్డీ వ్యాపారానికి పాల్పడుతున్నాయని హెచ్చరించారు. ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్‌ను చంద్రబాబు ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని బుగ్గన ఆరోపించారు. 2014లో పబ్లిక్ అకౌంట్ లయబిలిటీస్‌లో 19,130 కోట్లు ఉన్న ఉద్యోగుల డబ్బు చంద్రబాబు హయాంలో 76,516 కోట్లకు పెరిగింది. మేము 76,038 కోట్లకు తగ్గించాం. 478 కోట్లు తిరిగి ఉద్యోగులకు చెల్లించాం అన్నారు. చంద్రబాబు హయాంలో సంపద సృష్టి 3 శాతమే, కానీ అప్పులు మాత్రం 30 శాతం పెరిగాయి. కానీ మేము మాత్రం 10 శాతం సంపద పెంచాము అన్నారు. ప్రజల సంక్షేమం కోసం హామీలు ఇవ్వడం కన్నా వాటిని నిజంగా అమలు చేయడమే ముఖ్యమని, ప్రజలు మళ్లీ మోసపోవద్దని సూచించారు.ు

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ.. సర్వదర్శనానికి 20 గంటల సమయం..!

**అమరావతి,:** తిరుమల శ్రీవారి ఆలయంలో భక్తుల రద్దీ ఉధృతంగా కొనసాగుతోంది. భక్తులు తిరుమలకు అధిక సంఖ్యలో పోటెత్తుతుండటంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని అన్ని కంపార్టుమెంట్లు నిండి పోయాయి. వీటితో పాటు వెలుపల కూడా భక్తులు గట్టి క్యూలైన్లలో వేచి నిలుస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్వదర్శనం కోసం ప్రస్తుతం భక్తులకు సుమారు 20 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లో భక్తుల రద్దీతో అధికారులు భద్రతా ఏర్పాట్లు, నీటి సదుపాయాలు, అన్నప్రసాద పంపిణీ వంటి చర్యలను ముమ్మరంగా చేపడుతున్నారు. గత 24 గంటల్లో 91,720 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఇందులో 44,678 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ద్వారా వచ్చిన కానుకల మొత్తం రూ. 3.8 కోట్లుగా అధికారులు వెల్లడించారు. తిరుమల టిటిడి అధికారులు భక్తుల రద్దీకి అనుగుణంగా అన్ని ఏర్పాట్లను వేగవంతం చేస్తున్నారు.

నేటి ప్రభాత సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
WWW. Prabhata surya.com


## కేటీఆర్ జైలుకు వెళ్లాలని కుతూహలంగా ఉన్నారు..


### మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు..!



**హైదరాబాద్, :** రాష్ట్ర మంత్రి సీతక్క నిర్వహించిన కార్యకర్తల మీటింగ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ ఎన్నికల విషయంలో త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. నాలుగు నుంచి ఐదు రోజుల్లో పూర్తి వివరాలు బయటకు వస్తాయి. నోటిఫికేషన్ గురించి ఇప్పటివరకు ఎవరూ అధికారికంగా ప్రకటన చేయలేదు. అలాగే నేను కూడా ఎటువంటి తప్పుడు ప్రకటన ఇవ్వలేదు.. నా మాటల్లో మార్పు లేదని స్పష్టతనిచ్చారు. ఈరోజు జరిగే సమావేశంలో ఈ అంశంపై పూర్తి అవగాహన వచ్చే అవకాశముందని మంత్రి తెలిపారు. ఎన్నికలపై పార్టీ శ్రేణుల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగుతామని, అన్ని వర్గాలను ప్రతినిధ్యం కలిగించేలా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. ఇది ఇలా ఉండగా.. మంత్రి సీతక్క మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్యే కేటీఆర్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసారు. కేటీఆర్ జైలుకు పోవాలని కుతూహలంగా ఉన్నారు.. వీలైనంత త్వరగా జైలుకు పంపించాలని మా సీఎంను రెచ్చగొడుతున్నారు. కేటీఆర్, కవిత మధ్య పోటీ ఉంది.. కవిత జైలుకు పోయివచ్చి బీసీ ఎజెండా ఎత్తుకుంది.. నేను వెనకబడ్డా అని కేటీఆర్ కూడా జైలుకు వెళ్లే పథకం రచించాలని అనుకుంటున్నాడు. కేటీఆర్ పొగరుతో మాట్లాడుతున్నాడు. ఏదో ఆశించి కేటీఆర్ జైలుకు పోవాలనుకుంటున్నాడని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు హాట్ టాపిక్ గా మారాయి.

## బీచ్ లో యోగా డే వేడుకలు..

## 5 లక్షల మంది హాజరయ్యేలా ఏర్పాట్లు



**అమరావతి,:** యోగాంధ్ర ఏర్పాట్లను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొంటున్న ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ఏపీ సర్కార్ తీసుకుందని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా, విశాఖ ఆర్కే బీచ్ వేదికగా ఐదు లక్షల మంది యోగాడేకు హాజరయ్యేలా ఏర్పాట్లు కొనసాగిస్తున్నారు. ఆర్కే బీచ్ సహా వివిధ ప్రాంతాల్లో చేసిన ఏర్పాట్లను స్వయంగా సీఎం పరిశీలించారు. యోగా డే కోసం చేసిన ఏర్పాట్లను వివరించారు యోగాంధ్ర 2025 నోడల్ అధికారి ఎం.టి. కృష్ణబాబు. అయితే, బీచ్ రోడ్డు వెంబడి వివిధ ప్రాంతాల్లో చేసిన ఏర్పాట్లను ముఖ్యమంత్రి చంద్రబాబుకి విశాఖ జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ వివరించారు. 607 సచివాలయాల సిబ్బంది ఈ యోగాడేకు హాజరవుతున్నారు.. వారే సమన్వయం చేస్తున్నట్టు తెలిపారు. అలాగే, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలన్నారు సీఎం.. ఇక, యోగా డే కార్యక్రమంలో పాల్గొనే వారితో ఉదయం 6:30 నుంచి 8 గంటల వరకు మాక్ యోగా నిర్వహించాలని సూచనలు చేశారు. దీంతో పాటు ట్రాఫిక్ అంతరాయం లేకుండా, సామాన్య ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రధాని మోడీ సహా ఇతర ప్రముఖులు పాల్గొంటున్న నేపథ్యంలో భద్రతాను కట్టుదిట్టం చేయాలని అధికారులకు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి యోగా డే కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చేవారి వాహనాలకు పార్కింగ్ ఏర్పాట్లను ఏ విధంగా చేశారని అడిగి తెలుసుకున్నారు సీఎం చంద్రబాబు.

## హైదరాబాద్ అభివృద్ధికి అడ్డుగా కేంద్ర ప్రభుత్వం..

### మంత్రి హాట్ కామెంట్స్..!



హైదరాబాద్ లోని జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు నిర్వహించిన ధర్నాపై తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. జీహెచ్ఎంసీ అభివృద్ధిపై బీజేపీ చేస్తున్న విమర్శలను మంత్రి ఖండించారు. ఈ విషయమై మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. బీజేపీ నేతలు ధర్నా చేయాల్సింది జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు కాదు.. హైదరాబాద్ నగరం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేయాలని మండిపడ్డారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి కేంద్రం నుండి ఒక్క రూపాయి కూడా తెచ్చేందుకు ప్రయత్నించకుండా బీజేపీ నాయకులు రాజకీయ స్టంట్లు వేయడం సరికాదని విమర్శించారు. నగర అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా కేంద్ర ప్రభుత్వం మారిందని, దీనికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వైఫల్యమే కారణమని తెలిపారు. జీహెచ్ఎంసీ అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఈ విధమైన రాజకీయాలు చేయడం కన్నా, కిషన్ రెడ్డి ఇంటి ముందు ధర్నా చేస్తే మేము కూడా వస్తాం అని మంత్రి పిలుపునిచ్చారు. హైదరాబాద్ అభివృద్ధికి అందరం కలిసి నిధులు తీసుకురావాలన్న మంత్రి, ఈ విషయాన్ని రాజకీయాలకు దూరంగా ఉంచాలని అన్నారు. నగర అభివృద్ధి మా బాధ్యత. రాజకీయాలు దానికి అడ్డుకావద్దు అని హెచ్చరించారు. మొత్తంగా కేంద్రం నుండి నిధులు తీసుకురావడానికి బీజేపీ నాయకులు తమ సొంత నేత కిషన్ రెడ్డిపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు.

## 'జనగణన'కు గెజిట్ నోటిఫికేషన్ జారీ



న్యూఢిల్లీ : జనగణనకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్‌ను హోం మంత్రిత్వ శాఖ సోమవారం జారీ చేసింది. రెండు దశల్లో చేపట్టనున్న జనగణన 2027 మార్చి 1వ తేదీ నాటికి పూర్తికానుంది. కేంద్రపాలిత ప్రాంతాలు జమ్మూకశ్మీర్, లడఖ్‌తో పాటు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబరు 1 అర్ధరాత్రి వరకు జన గణనను నమోదు చేయనున్నామని హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఈ ప్రాంతాలు మినహాయంచి దేశవ్యాప్తంగా మిగతా ప్రాంతాలన్నింటిలో 2027 మార్చి 1 నాటికి జనగణన పూర్తిచేయనున్నామని తెలిపింది. సుమారు 34 లక్షల మంది గణనదారులు, సూపర్‌వైజర్లు, 1.34 లక్షల మంది సిబ్బంది పనిచేయనున్నారు. ఈసారి జనగణనను మెబైల్ అప్లికేషన్లను వినియోగించి పూర్తిగా డిజిటల్ విధానంలో చేపట్టనున్నట్లు ప్రకటించింది. అలాగే ప్రజలు స్వయంగా తమ వివరాలను నమోదుచేసే అవకాశం కూడా ఉన్నట్లు ఎంహెచ్ఏ తెలిపింది. సమాచార సేకరణ, బదిలీ, స్టోరేజీ అత్యంత కట్టుదిట్టంగా ఉండనున్నట్లు వెల్లడించింది. జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టనున్నట్లు ప్రకటించింది. చివరిసారిగా జనగణన 2011లో నిర్వహించారు. 2021లో చేపట్టాల్సిన జనగణన కొవిడ్ మహమ్మారి కారణంగా కేంద్రం వాయిదా వేసింది. 15ఏళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వం జనగణన చేపట్టనున్నట్లు తెలిపింది. ఇది మొత్తంగా 16వ, స్వాతంత్ర్యం అనంతరం చేపట్టబోయే 8వ జనగణన.

## ఇంతింతై.. కాస్తంతై..


### దేశీయ ఐటీ రంగంలో తగ్గిన అతివలు

### టాప్-5 కంపెనీల్లో నాలుగింట తగ్గుదల

### మేనేజర్ స్థాయిలోనూ పురుషుల కంటే తక్కువే

### మగవాళ్లతో పోలిస్తే వేతనాల్లోనూ భారీ అంతరం

భారత ఐటీ పరిశ్రమలోని 5 అగ్రశ్రేణి సంస్థల్లోని మొత్తం ఉద్యోగుల్లో.. నాలుగింట మహిళా ఉద్యోగుల సంఖ్య స్వల్పంగా తగ్గింది. అదే సమయంలో మొత్తం మహిళా ఉద్యోగుల సంఖ్య మూడింట పెరిగింది. ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో మహిళల వాటా మూడింట ఒక వంతు కంటే ఎక్కువే ఉంది. కానీ సీనియర్ స్థాయిల్లో మాత్రం బాగా తగ్గింది. ఐటీ కంపెనీల్లో స్త్రీ, పురుష ఉద్యోగుల మధ్య వేతన అంతరం కూడా ఎక్కువగా ఉంది. దేశీయ ఐటీ రంగంలో మహిళలు గట్టిపోటీని ఎదుర్కొంటున్నారు. మనదేశంలోని అగ్రశ్రేణి 5 కంపెనీల్లో నాలుగు సంస్థలు 2024-25లో తమ ఉద్యోగుల్లో మహిళల వాటా తగ్గినట్లు నివేదించాయి. మొత్తం మీద ఈ ఐదు కంపెనీలు 2024 మార్చి నుండి 2025 మార్చి వరకు నికరంగా 27,000 మందికిపైగా మహిళలను కొత్తగా చేర్చుకున్నట్లు వెల్లడించాయి. విప్రో మినహా...: మహిళా సిబ్బంది వాటా




2023-24లో 35.6 శాతం నుండి 2024-25లో 35.3 శాతానికి తగ్గిందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) నివేదించింది. ఇన్ఫోసిస్‌లో ఈ సంఖ్య 39.3 నుండి 39 శాతానికి వచ్చి చేరింది. హెచ్‌సీఎల్ టెక్‌లో మహిళా ఉద్యోగుల వాటా 29.1 నుండి 28.8 శాతానికి తగ్గింది. క్యాలెండర్ ఇయర్ అకౌంటింగ్ (జనవరి-డిసెంబర్)ను అనుసరించే కాగ్నిజెంట్‌లో మొత్తం ఉద్యోగుల్లో మహిళా సిబ్బంది వాటా 2023లో 38.8 నుంచి 2024లో 38 శాతానికి పరిమితమైంది. విప్రో మాత్రమే ఈ విషయంలో మినహాయింపు. ఈ సంస్థలో మహిళామణుల సంఖ్య 2023-24తో పోలిస్తే 36.6 నుండి గత ఆర్థిక సంవత్సరంలో 37.1 శాతానికి పెరిగింది. సీనియర్ స్థాయిల్లో తగ్గుతోంది..: మన



సమాజంలోని లింగ అసమానతలు, సాంస్కృతిక సవాళ్ల కారణంగా మహిళా ఉద్యోగుల వాటా స్తబ్దుగా ఉందని క్వెస్ ఐటీ స్టాఫింగ్ చెబుతోంది. ప్రారంభ స్థాయి ఉద్యోగాల్లో మహిళల వాటా మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మందిని కలిగి ఉన్నప్పటికీ.. సీనియర్ స్థాయిల్లో వారి సంఖ్య బాగా తగ్గుతోందని వెల్లడించింది. సీనియర్ నాయకత్వం విషయంలో చాలా సంస్థలలో మహిళల నిష్పత్తి సింగిల్ డిజిట్‌లోనే ఉంది. టీసీఎస్‌లో అగ్రశ్రేణి జట్టులో మహిళలు 3.6

| కంపెనీ | 2023-24 | 2024-25 | వ్యత్యాసం |
|---|---|---|---|
| టీసీఎస్ | 2,14,098 | 2,14,039 | -0.03 |
| ఇన్ఫోసిస్ | 1,24,569 | 1,26,332 | 1.4 |
| విప్రో | 82,595 | 85,330 | 3.3 |
| హెచ్‌సీఎల్ | 66,057 | 64,345 | -2.6 |
| కాగ్నిజెంట్ | 1,02,600 | 1,27,864 | 24.6 |

శాతం మాత్రమే ఉన్నారు. కాగ్నిజెంట్ ఈ విషయంలో 20 శాతం మార్కును దాటింది. చాలా సంస్థలు శ్రామిక శక్తిలో మహిళల వాటా విషయంలో మూడింట ఒక వంతు (33 శాతం) సంఖ్యకు కట్టుబడి ఉన్నాయి. సాంకేతిక రంగంలో సందర్భం, మార్కెట్ తీరు, యజమానుల విచక్షణపైనే మహిళల నియామకాలు ఉంటాయని స్టాఫింగ్ కంపెనీ ఎక్స్‌ఫెనో అంటోంది.

### వేతనాల్లోనూ అంతరమే..

స్త్రీ, పురుష నిష్పత్తితోపాటు ఐటీ కంపెనీల్లో వేతన అంతరం కూడా పెద్ద ఎత్తున ఉంది. టీసీఎస్‌లో బోర్డు సభ్యులు, సీనియర్ మేనేజ్‌మెంట్ మినహా మహిళా ఉద్యోగుల సగటు వార్షిక జీతం 2024-25లో రూ.10.6 లక్షలు మాత్రమే. ఈ కంపెనీలో ఇదే స్థాయి ఉద్యోగాల్లో పురుషులకు ఏకంగా రూ.16.7 లక్షల వేతనం ఉంది. అలాగే ఇన్ఫోసిస్‌లో మహిళా ఉద్యోగుల సగటు వార్షిక జీతం రూ.8 లక్షలు ఉంది. పురుష సహోద్యోగులకు ఇది రూ.11 లక్షలు.

### ఇతర దిగ్గజ కంపెనీల్లో ఇలా..

యాక్సెంచర్, క్యాప్‌జెమిని వంటి గ్లోబల్ కంపెనీలలో మహిళా ప్రాతినిధ్యం బలంగా ఉంది. 2024లో యాక్సెంచర్ మొత్తం సిబ్బందిలో మహిళా సిబ్బంది వాటా 48 శాతం కావడం విశేషం. క్యాప్‌జెమినిలో మహిళా సిబ్బంది వాటా 38.8 శాతం నుండి 39.7 శాతానికి పెరిగింది. మేనేజర్ స్థాయి రోల్స్‌లోకి వెళ్లే అవకాశాలు పురుషుల కంటే మహిళలకు 2.1 రెట్లు తక్కువగా ఉన్నాయని క్వెస్ చెబుతోంది. కరోనా మహమ్మారి తరువాత వచ్చిన వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం మహిళా ఉద్యోగులకు లాభిస్తుందని భావించినప్పటికీ.. అది ఆశించిన ఫలితాలు అందించలేదని నిపుణులు అంటున్నారు. ఇంటి నుంచే పని వల్ల ఇంటి పని భారం మరింత పెరిగిందని.. దానివల్ల వృత్తి, ఉద్యోగాలపై శ్రద్ధ పెట్టడం చాలామందికి కష్టమైందని చెబుతున్నారు.

## భారతావనిలో 'ఉష్ణ' తాండవం

### ఎండ ప్రచండం!

### దేశమంతటా వడగాడ్పులు, ఉక్కపోత

### 2030 నాటికి రెట్టింపు వడగాడ్పు రోజులు

### ఈ జాబితాలో హైదరాబాద్, ఢిల్లీ వంటి నగరాలు

### కోస్తా జిల్లాలపైనా తీవ్ర వేడిమి ప్రభావం

### దేశ ఆర్థిక వ్యవస్థకు అపార నష్టం

### ఐపీఈ గ్లోబల్, ఎస్రి ఇండియా నివేదిక

జూన్ 14 వరకు తీవ్రమైన వడగాడ్పులు.. వాయవ్య భారతానికి వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరిక.పంజాబ్, హరియాణాలకు రెడ్ అలర్ట్. వచ్చే 48 గంటల్లో భానుడి ఉగ్రరూపం అంటూ జూన్ 12న ఐఎండీ మరో హెచ్చరిక.వేసవి వెళ్లిపోయింది. ఉష్ణోగ్రత ఉండిపోయింది! దేశంలోని అన్ని ప్రాంతాలను వడగాడ్పులు చుట్టుముట్టాయి. ఇది ప్రస్తుతం. 2030 నాటికి ఢిల్లీ, హైదరాబాద్, ముంబై, చెన్నై, వంటి నగరాల్లో వడగాడ్పులు వీచే రోజుల సంఖ్య ఇప్పటితో పోలిస్తే రెట్టింపు కానుందట. టైర్ -1, 2 సిటీల్లో 72 శాతం వాటికి తీవ్ర వేడిమి, భారీ వర్షాల ముప్పు పొంచి ఉందట. ఐపీఈ గ్లోబల్ - ఎస్రి ఇండియా సంయుక్త అధ్యయనం ఇలాంటి ఆసక్తికర విషయాలు వెల్లడించింది. భానుడి ప్రతాపానికి పంజాబ్, హరియాణా, రాజస్తాన్



తల్లడిల్లిపోతున్నాయి. ఢిల్లీలో రెడ్ అలెర్ట్. స్కూళ్లు బంద్. ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ఈ ఏడాది ఏప్రిల్ మధ్య నుండి జూన్ 10 వరకు దాదాపు 700 వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. ప్రపంచ చరిత్రలోనే 'హాటెస్ట్ ఇయర్'గా 2024 నమోదైంది. మళ్లీ ఇప్పుడు ఆ స్థాయిలో భారత్‌లో సెగలు రేగుతున్నాయి. భవిష్యత్తుల్లో వేసవి కాలం.. మరిన్ని రోజులు ఉండనుందట. వడగాడ్పుల తీవ్రత మరింత పెరగనుందట. ఒకపక్క భారీ వర్షాలు.. మరోపక్క పిడుగుల వర్షం కురవనుంది. మానవాభివృద్ధి, సుపరిపాలన వంటి అంశాల్లో పనిచేసే ఐపీఈ గ్లోబల్‌బీ భౌగోళిక సమాచార వ్యవస్థ (జీఐఎస్)పై పనిచేసే ఎస్రి ఇండియా సంయుక్తంగా దేశంలో తీవ్ర వేడి, అత్యంత వర్షపాతం అంశాలపై అధ్యయనం చేశాయి. జిల్లా స్థాయిలో సమస్య తీవ్రతను మ్యాపింగ్ చేశాయి. పట్టణాల్లో మౌలిక సదుపాయాలు, వ్యవసాయం, ప్రజారోగ్య వ్యవస్థలను పర్యావరణ ఉత్పాతాలను తట్టుకునేలా తీర్చిదిద్దాల్సిన అవసరాన్ని ఈ అధ్యయనం నొక్కి చెప్పింది.


| 2010 నుంచి 2025 వరకు వడగాడ్పుల రోజులు | |
|---|---|
| 2014 | 89 |
| 2015 | 161 |
| 2016 | 170 |
| 2017 | 188 |
| 2018 | 96 |
| 2019 | 178 |
| 2020 | 40 |
| 2021 | 52 |
| 2022 | 455 |
| 2023 | 217 |
| 2024 | 536 |
| 2025 | 134 |

(జూన్ 12 వరకు)

ఇండియాలో వడగాడ్పులు వీచే రోజుల సంఖ్య పెరుగుతోంది! జమ్మూకశ్మీర్ వంటి చల్లగా ఉండే ప్రాంతాలు సైతం ఈ ఏడాది మేలో వడగాడ్పులతో ఉడుకెత్తిపోయాయి.

(దేశంలో వివిధ ప్రాంతాలలోని వడగాడ్పు రోజులను విడివిడిగా తెచ్చి కలపటం వల్ల కొన్ని సంవత్సరాలలో 365 కంటే ఎక్కువగా నమోదయ్యాయి)

(ఆధారం : ఐ.ఎం.డి., వార్తా నివేదికలు)




### పదింట 8 జిల్లాల్లో...

1993 నుంచి చూస్తే.. వేసవిలో తీవ్రమైన వడగాడ్పులు ఉండే రోజులు 15 రెట్లు పెరిగాయి. కోస్తా జిల్లాల్లో తీవ్రమైన వేడి, భారీ వర్షాలు.. ఇలావిచిత్రమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. 2040 నాటికి.. ప్రతి 10 కోస్తా జిల్లాల్లోనూ 8 జిల్లాల్లో వేసవి ముగిసినా తీవ్ర వేడి, ఉక్కపోత వంటివి వర్షాకాలంలో కూడా నమోదైనా ఆశ్చర్యపోనవసరం లేదు. ఈ సమస్యలకు పరిష్కారంగా.. రియల్‌టైమ్‌లో వాతావరణాన్ని అంచనా వేసేందుకు ఒక క్లైమేట్ రిస్క్ అబ్జర్వేటరీ (సీఆర్ఓ) ఏర్పాటును ఈ అధ్యయనం సూచించింది.

### జీడీపీలో 4.5 శాతం తగ్గుదల

ఎండ దెబ్బకు ఆర్థిక నష్టం కూడా పెరిగే ముప్పు పొంచి ఉంది. 2030 నాటికి భారతదేశం అంచనా వేసుకున్న 8 కోట్ల ప్రపంచ ఉద్యోగాలలో 3 కోట్ల 40 లక్షల ఉద్యోగాలు తగ్గిపోయే ప్రమాదం ఏర్పడింది. తీవ్రమైన వేడి, ఉక్కపోత కారణంగా పని గంటల్ని కోల్పోయే పరిస్థితి ఉండటంతో ఈ దశాబ్దంలో స్థూల జాతీయోత్పత్తి (జి.డి.పి.)లో 4.5 శాతం వరకు తగ్గుదల కనిపించవచ్చని రిజర్వు బ్యాంకు హెచ్చరించింది.

### తీవ్రం.. సాధారణం!

తీవ్రమైన వాతావరణం అన్నది ఇప్పుడు చాలా సాధారణమైన విషయమైపోయింది. దీన్ని కనిపెట్టి, మార్చుకోవాలంటే మనకు భౌగోళిక ఉపకరణాలు చాలా అవసరం.


### వాతావరణ అస్థిరతలు పసిగట్టాలి

వాతావరణం, అభివృద్ధి అనేవి పరస్పర అవినాభావ సంబంధం ఉన్నవి. భారత్ సహా గ్లోబల్ సౌత్‌గా పిలిచే దేశాలన్నింటి ముందూ ఇప్పుడు ఒక సమస్య ఉంది. అదేంటంటే.. వాతావరణ అస్థిరతలను పసిగట్టి, అందుకు అనుగుణంగా చర్యలు చేపడుతూనే ప్రజల జీవన ప్రమాణాలనూ పెంచాలి.

### కోస్తా ప్రాంతాల్లోనే ఎక్కువ

భారతదేశం అంతటా వడగాడ్పులు వీచే రోజులు 2030, 2040 నాటికి గణనీయంగా పెరుగుతాయని అంచనా. ప్రాంతాల వారీగా వడగాడ్పు రోజుల సంఖ్యలో పెరుగుదల అంచనాలు..

## నవ్వే నేరమౌనా?



మనుషులకు సహజసిద్ధమైన మనోల్లాస ప్రకటన నవ్వు. మాటలు రాని పసికందుల మొదలుకొని, వయోవృద్ధుల వరకు అందరూ నవ్వుతారు. నవ్వు ఒక విశ్వజనీన భాష. కొందరు అనునిత్యం చిరునవ్వులు చిందిస్తూ ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉంటారు. ఇంకొందరు తాము నవ్వుతూ, ఎదుటివారిని కూడా నవ్విస్తుంటారు. అరుదుగా అతితక్కువ మంది ఉంటారు -వారు నవ్వరు, ఎదుటివారు ఉల్లాసంగా నవ్వుతూ, ఆనందంగా ఉంటే ఏమాత్రం భరించలేరు. నవ్వేవారు తమను చూసే నవ్వుతున్నారేమోననే భ్రమలోపడి లోలోన కుమిలి కునారిల్లిపోతారు. జీవితంలో నవ్వెరు గని మనుషులను చూసి మిగిలిన లోకం జాలిపడటం తప్ప చేయగలిగిందేమీ లేదు. నవ్వు ఒక ఆరోగ్య లక్షణం. పసిపిల్లలు బోసినవ్వులు చిందిస్తుంటారు. బాల్యంలో నవ్వే నవ్వుల సంఖ్య వయసు పెరిగిన తర్వాత క్రమంగా తగ్గిపోతుంది. ఎంత ఎదిగినా పెద్దలు కూడా సమయ సందర్భాలను బట్టి నవ్వుతుంటారు. వైద్య పరిశోధనల ప్రకారం పసిపిల్లలు రోజుకు దాదాపు నాలుగు వందల సార్లు నవ్వులొలికిస్తారు. పెద్దలు రోజులో కనీసం ఇరవైసార్లయినా నవ్వుతారు. సంతోషకరమైన జీవితం గడిపేవారు నలభైసార్లకు పైబడి కూడా నవ్వుతారు. 'నవ్వడం ఒక భోగంబీ నవ్వించడం ఒక యోగంబీ నవ్వకపోవడం ఒక రోగం' అన్నారు జంధ్యాల. నవ్వెరుగని రోగులే హాయిగా నవ్వుతూ కనిపించే మనుషులను చూసి కుళ్లుకుంటారు. 'ఒకరిని నవ్వమని శాసించలేముబీ కాని నవ్వవద్దని శాసించినాబీ నవ్వకూడదని భీష్మించుకొని కూర్చొనినా నవ్వు రాక మానదు... అసలు మన నవ్వుకి కొన్ని చోట్ల అర్థం పర్థం లేకపోవటం కూడ కద్దు' అని 'తెలుగు హాస్యం' రచయిత ముట్నూరి సంగమేశం అన్నారు. ఆయన మాటలు అక్షర సత్యం. నవ్వమని ఎవరో శాసిస్తే నవ్వు రాదు. నవ్వొద్దని ఆంక్షలు విధిస్తే, వచ్చే నవ్వు రాకుండా మానదు. 'నవ్వు ఒక దిద్దుబాటు చర్య. పెడదారి పట్టినవారిని సన్మార్గంలోకి తీసుకురావడానికి, చాదస్తాలను సరిదిద్దడానికి నవ్వు చేయూతనిస్తుంది' అన్నారు ఫ్రెంచ్ తత్త్వవేత్త హెన్రీ బెర్గ్‌సన్. 'నవ్వులేని రోజు దండగ రోజు' అన్నాడు ప్రపంచ ప్రఖ్యాత హాస్యనటుడు చార్లీ చాప్లిన్. 'మానవ జాతి చేతిలో గొప్ప ప్రభావవంతమైన ఆయుధం ఉంది, అదే నవ్వు' అన్నారు అమెరికన్ రచయిత మార్క్ ట్వైన్. నవ్వు అంటే నవ్వులాట కాదు, నవ్వును నిర్వచించడం అంత తేలిక కాదు. నవ్వులోని సంక్లిష్టత నిర్వచనాలకు అందనిది. 'నవ్వవు జంతువుల్ నరుడు నవ్వును, నవ్వులు చిత్తవృత్తికిన్/ దివ్వెలు కొన్ని నవ్వులెటు తేలవు కొన్ని విషప్రయుక్తముల్/ పువ్వులవోలె ప్రేమరసముల్ వెలిగ్రక్కు విశుద్ధమైనవే/ నవ్వులు సర్వదుఃఖదమంబులు వ్యాధులకున్ మహౌషధుల్' అన్నారు జాషువా. పురాణకాలంలో నవ్వు వల్ల అపార్థాలు, అనర్థాలు వాటిల్లిన సందర్భాలు రెండు ఉన్నాయి. వాటిలో ఒకటి మహాభారతంలోని పాంచాలి నవ్వు కురుక్షేత్ర సంగ్రామానికి దారితీసిన వైనం తెలిసినదే! మరొకటి రామాయణంలో లక్ష్మణుడి నవ్వు. రాముడి పట్టాభిషేక సమయంలో లక్ష్మణుడికి రెప్పలు మూతబడ్డాయి. పద్నాలు గేళ్ల అరణ్యవాస కాలంలో అన్నాళ్లూ రాని నిద్ర పట్టాభిషేక వేడుక జరుగుతున్నప్పుడే రావాలా అనుకుంటూ లక్ష్మణుడు తనలో తాను నవ్వుకున్నాడు. అతడి నవ్వు సీతారాములు సహా ఆ వేడుకలో కొలువుదీరిన వారందరిలోనూ రకరకాల అపార్థాలకు తావిచ్చింది. పాంచాలి నవ్వు అనర్థాలకు దారితీస్తే, లక్ష్మణుడి నవ్వు అపార్థాలకు దారితీసింది. కేవలం ఈ రెండు ఉదంతాలను ఉదహరిస్తూ, 'నవ్వు నాలుగు విధాల చేటు' అనే నిర్ధారణకు రావడం పూర్తిగా అసమంజసం. నవ్వులలో రకరకాలు ఉన్నాయి. మన ప్రాచీన అలంకారికులు నవ్వులను ఆరు రకాలుగా విభజించారు. అవి: స్మితం, హసితం, విహసితం, ఉపహసితం, అపహసితం, అతిహసితం. నవ్వుకు నానా ప్రయోజనాలు ఉన్నాయి. నవ్వు మానసిక ఒత్తిడిని తగ్గిస్తుందిబీ రోగ నిరోధక శక్తిని పెంచుతుందిబీ గుండె జబ్బులను నివారిస్తుంది. నవ్వు వల్ల ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని ఆధునిక వైద్యశాస్త్రం చెబుతోంది. రాజరికాలు కొనసాగిన కాలంలో రాజులను నవ్వించడానికి విదూషకులు ఉండేవారు. రాజకీయాలతోను, రణతంత్రాలతోను బుర్రలు వేడెక్కిన ప్రభువులకు విదూషకులు తమ హాస్యంతో మనోల్లాసం కలిగించి, వినోదపరచేవారు. పలువురు ఆస్థాన కవులు చమత్కార పద్యాలతో ప్రభువులను నవ్వించేవారు. నేటి ప్రజాస్వామ్యంలోని ప్రభువుల కంటే రాజరికాల నాటి ప్రభువులే హాస్యాన్ని ఆదరించడంలో చాలా నయం అనిపిస్తారు. నవ్వించే విదూషకులకు, కవులకు వారు నజరానాలు ఇచ్చి, గౌరవించేవారు. హాస్యాన్ని ఆస్వాదించాలంటే కాస్త హాస్యప్రియత్వం, చమత్కారాభిరుచి ఉండాలి. ఆనాటి ప్రభువుల్లో అవి కొంత మెండుగా ఉండేవి. హాస్యం కోసం ఆనాటి కవులు బూతులు కూడా ప్రయోగించేవారు. 'నీతులకేమి ఒకించుక/బూతాడక నవ్వు దొరకు పుట్టదు ధరలో/ నీతులు బూతులు లోక ఖ్యాతులురా' అన్నాడు చౌడప్ప. ఆనాటి కవులు ప్రభువుల తీరుతెన్నులను, సామాజిక పరిస్థితులను తెగనాడటానికి పదునైన వ్యంగ్యంతో అధిక్షేప పద్యాలు రాశారు. ఆ పద్యాల్లోని వ్యంగ్యం కటువుగా ఉన్నా, నవ్వు తెప్పిస్తుంది. అంతమాత్రాన ఆ ప్రభువులెవరూ ఆ కవులను శిక్షించిన దాఖలాలు లేవు. పాపం, సత్తెకాలం మారాజులు వాళ్లు. మనోభావాల శకం మొదలయ్యాక నవ్వుల వివాదాలు న్యాయస్థానాల ముందుకు వెళుతున్నాయి. నవ్వులను తాళలేని పాలకుల విన్యాసాలు నవ్వులపాలవుతున్నాయి.

# పార్టీ లోపాలను సవరించుకుంటాం ఎవరైనా దాడికి వస్తే ఎదుర్కొంటాం: కవిత



**హైదరాబాద్, :** తెలంగాణలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపై, చేస్తోన్న అక్రమాలపై ప్రశ్నిస్తున్నాం..అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. జగిత్యాల జిల్లాలో పర్యటించిన ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మా పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ రావుకు నోటీసులు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం వేధింపులకు గురి చేస్తోంది. మొన్న కాళేశ్వరం కమిషన్ పేరుతో కేసీఆర్‌ను విచారణ చేశారు. నేడు కేటీఆర్‌ను ఏసీబీ విచారించింది. మేం వేధింపులకు భయపడే వాళ్లం కాదు...అని కవిత వ్యాఖ్యానించారు రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తుండగా, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ ఇస్తామని చెప్పి యువతను మోసం చేశారని ఆరోపించారు. విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలకు అమలుకాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. ఈ విఫలతలపై ప్రజల నుండి వస్తున్న ఒత్తిడిని తప్పించుకునేందుకే బీఆర్ఎస్ నేతలపై నోటీసుల పేరుతో దృష్టి మళ్లింపుదిశగా చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. తాము ఏ తప్పూ చేయలేదని స్పష్టంగా చెబుతూ, వచ్చిన ప్రతి నోటీసుకు సమగ్రంగా స్పందిస్తామని చెప్పారు. కేటీఆర్ విచారణకు పూర్తిగా సహకరిస్తున్నప్పటికీ, తెలంగాణ భవన్‌కు తాళాలు వేసి కార్యకర్తలను నిర్బంధించడం అత్యంత దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీలో ఎలాంటి అంతర్గత విభేదాలు లేవని స్పష్టం చేస్తూ, లోపాలపై చర్చించుకుని పరిష్కరించుకునే శక్తి తమకు ఉందని కవిత చెప్పారు. బీఆర్ఎస్ నాయకత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ రాజకీయ లబ్ధికోసం ప్రయత్నిస్తోంది..ఎమ్మెల్సీ కవిత విమర్శించారు.

## వైద్య కళాశాలల పనులపై కార్యాచరణ ప్రణాళిక..
# అధికారులకు సీఎం ఆదేశం..!



**హైదరాబాద్, :** తెలంగాణ రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పని చేయాలని.. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి అక్కడ ఏం అవసరాలు ఉన్నాయి. ఎంత మేర నిధులు కావాలి, తక్షణమే పూర్తి చేయాల్సిన పనులు, ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయం తదితర వివరాలతో నివేదికను సమర్పించాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఐసీసీసీలో సోమవారం ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నియామకాలు, బోధన సిబ్బందికి ప్రమోషన్లు, వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో పడకల పెంపు, ఆయా కళాశాలలకు అవసరమైన వైద్య పరికరాలు, ఖాళీల భర్తీ వీటన్నింటిపై సమగ్ర నివేదిక రూపొందించి అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలుంటే వెంటనే తెలియజేయాలని కేంద్ర మంత్రి నడ్డా, ఆ శాఖ అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరిస్తామని సీఎం పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ (జపాన్ భాష) ను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో మనకు మద్దతు ఇచ్చేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వెల్లడించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, ఆసుపత్రుల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. విద్యా, వైద్య రంగాలు ఎంతో కీలకమని, ప్రతి నెలా మూడో వారంలో ఈ రెండు శాఖలపై సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## భయపడితే రాజకీయాలు చేయలేం..
# అంబటి రాంబాబు సంచలన వ్యాఖ్యలు..



**అమరావతి,:** జగన్ పల్నాడు జిల్లా పర్యటనకు పోలీసులు చిత్రవిచిత్రమైన ఆంక్షలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు అని వైసీపీ మాజీమంత్రి అంబటి రాంబాబు పేర్కొన్నారు. పోలీసుల వేదింపులకు ఆత్మహత్యకు పాల్పడ్డ వైసీపీ కార్యకర్త నాగ మల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను జగన్ పరామర్శించనున్నారు. ఆయన పర్యటనకు అనుమతి తీసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారు.. జగన్ ఇంట్లో నుంచి బయటకు వస్తే ఊరుకోం అనేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పొదిలి పర్యటనలో పొగాకు రైతులను పరామర్శించేందుకు వెళ్ళారు.. అక్కడ నలుగురు మహిళల్ని పెట్టీ నల్ల బెలూన్లతో జగన్ కి వ్యతిరేకంగా నిరసన తెలియజేశారు.. వాళ్ళే రాళ్ళు వేసి మావాళ్ళ మీద కేసులు పెట్టారు అని అంబటి రాంబాబు ఫైర్ అయ్యారు. అయితే, పోలీసుల వేధింపుల వల్ల ఆత్మహత్య చేసుకున్న నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పేందుకు జగన్ వస్తున్నారని మాజీమంత్రి అంబటి రాంబాబు తెలిపారు. జగన్ వెళ్తున్నారంటే అనేక మంది అనుసరిస్తారు.. వైఎస్సార్ బిడ్డగా జగన్ కోసం జనం వస్తారు.. పార్టీ కార్యకర్త మృతి చెందారు.. కాబట్టే వాళ్ళ కుటుంబ సభ్యులను పరామర్శకు వెళ్తున్నారు.. ఇక, జగన్ బయటకు వస్తున్నాడంటే చంద్రబాబు, లోకేష్ భయపడుతున్నారు అని ఎద్దేవా చేశారు. మేం ఇన్ని పర్యటనలకు వెళ్ళాం.. ఎక్కడైనా లా అండ్ ఆర్డర్ సమస్య వచ్చిందా అని ప్రశ్నించారు. జగన్ పర్యటనలు భగ్నం చేయాలనే కుట్రలు చేస్తున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు. మిస్టర్ లోకేష్, మిస్టర్ చంద్రబాబు అధికారం ఉంది కదా అని మీ ఇష్టం వచ్చినట్లు చేస్తున్నారు అని అంబటి రాంబాబు పేర్కొన్నారు. ఓ పక్క కేసులు పెడతారు.. మాపైనే దాడులు చేస్తారు.. ప్రజాస్వామ్యంలో ఎన్నాళ్లు సాగుతుందో మేము చూస్తామని అన్నారు. మీరు చేసిన వాగ్దాన భంగాలు ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం.. మీరు ఎన్నాళ్లు అనిచి వేస్తారో మేము చూస్తామని తెలిపారు. జగన్ కు ప్రజల్లో జనాదరణ పెరుగుతుంది.. ఇప్పటి వరకు చంద్రబాబు వెన్నుపోటు మంచితనాలు చాలా చూశాం.. భయపడితే రాజకీయాలు చేయలేం అని మాజీ మంత్రి అంబటి రాంబాబు చెప్పుకొచ్చారు.

# భూసరిహద్దులు తెరుచుకున్నాయి : ఇరాన్

టెహ్రాన్ : ఇరాన్‌లో చిక్కుకుపోయిన భారతీయ విద్యార్థులను సురక్షితంగా తరలించాలన్న భారత్ అభ్యర్థనకు ఇరాన్ సోమవారం స్పందించింది. ఇరాన్ గగనతలం మూసివేయబడినప్పటికీ, విద్యార్థులను సురక్షితంగా తరలించేందుకు వీలుగా అన్ని భూ సరిహద్దులు తెరుచుకున్నాయని తెలిపింది. ప్రస్తుత ఉద్రక్త పరిస్థితులు, దేశంలోని విమానాశ్రయాల మూసివేయడంతో, అనేక దేశాలు తమ దౌత్యవేత్తలను, పౌరులను సురక్షితంగా పంపాలన్న అభ్యర్థనను దృష్టిలో ఉంచుకుని అన్ని భూభాగాల సరిహద్దులు తెరిచి ఉన్నాయని తెలియజేస్తున్నామని విదేశాంగ శాఖ పేర్కొంది. ఈమేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి భారతదేశ దౌత్య కార్యాలయానికి గ్రీన్ సిగల్ ఇచ్చారు. దౌత్యవేత్తలు మరియు పౌరులను సురక్షితంగా తరలించేందుకు సహాయం అందిస్తామని తెలిపారు. సరిహద్దులను దాటే వ్యక్తుల పేర్లు, పాస్‌పోర్ట్ నెంబర్లు మరియు వాహనాల వివరాలను జనరల్ ప్రోటోకాల్ విభాగానికి అందించాలని ఇరాన్ భారత్‌ను కోరింది. దౌత్యవేత్తలు మరియు ఇతర పౌరుల ప్రయాణానికి అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు ప్రయాణ సమయం మరియు ఆ వ్యక్తి ఏ సరిహద్దు నుండి వెళతారో తెలియజేయాలని కోరింది. ఇజ్రాయిల్ దాడులు, ఇరాన్ ప్రతీకార దాడులతో వేలాది మంది భారతీయులు ఇరాన్‌లోని వివిధ నగరాల్లో చిక్కుకుపోయారు. 1500 మందికి పైగా భారతీయ విద్యార్థులు ఉండగా, వారిలో ఎక్కువమంది జమ్మూకాశ్మీర్‌కు చెందినవారే ఉన్నారు.

# వ్యవసాయ గణాంకాల్లో మరింత కచ్చితత్వం

### శాటిలైట్ లెక్క.. సాగు పక్కా
### ఉపగ్రహాల డేటాతో పైలట్ అధ్యయనాలు
### 93-95% కచ్చితత్వంతో ఫలితాలు
### ఈ ఖరీఫ్ నుంచి డిజిటలీకరణకు సన్నాహాలు
### సెప్టెంబర్ నాటికి పూర్తిస్థాయి గణాంకాలు



దేశంలో సగానికిపైగా ప్రజలకు జీవనాధారం వ్యవసాయమే. అలాంటి ప్రధాన రంగానికి సంబంధించి కచ్చితమైన గణాంకాల సేకరణ ఇన్నాళ్లూ కలగానే ఉంది. మొట్టమొదటిసారిగా శాటిలైట్ ఆధారిత అంచనాల సేకరణ ప్రారంభం కావటంతో కచ్చితత్వంతో కూడిన గణాంకాల సేకరణకు మార్గం సుగమమైంది. ఇప్పటికే పైలట్ అధ్యయనాలు పూర్తయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లో వరి సాగు విస్తీర్ణం భారీగా పెరిగినట్లు డిజిటల్ సర్వే గుర్తించింది. ఇది వ్యవసాయ గణాంకాల నమోదు ప్రక్రియలో పెద్ద ముందడుగు. కేంద్ర వ్యవసాయ శాఖ చొరవతోబీ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సాగు లెక్కల సేకరణ, డిజిటలీకరణ ఇక పక్కాగా జరగనుంది. దేశంలో వ్యవసాయ రంగంలో గణాంకాల ప్రక్రియ కొంత సంక్లిష్టంగా, సుదీర్ఘ ప్రక్రియగా ఉంది. గ్రామస్థాయిలో సిబ్బంది భూమి రికార్డు పుస్తకాల్లో సాగు విస్తీర్ణం, పంటల వివరాలను నింపుతారు. ఖరీఫ్ జూన్‌లో ప్రారంభమైనప్పటికీ పంట అంచనాలకు సంబంధించిన గణాంకాలు అరకొరగానే అందుతుండేవి. ఈ గణాంకాలను అనేక సార్లు సవరించేవారు. చివరికి ఎప్పటికో తుది అంచనాలు పాలకులకు అందుబాటులోకి వచ్చేవి. అయితే, శాటిలైట్ డేటాతో అనుసంధానం చేసి వ్యవసాయ గణాంకాల సేకరణను డిజిటలీకరించటంతో సెప్టెంబర్ నాటికే తొలి అంచనాలు అందుబాటులోకి రానున్నాయి. వ్యవసాయ గణాంకాల డిజిటలీకరణ దిశగా ఇది చాలా పెద్ద ముందుడుగని చెప్పుకోవచ్చు.

### పూర్తయిన పైలట్ అధ్యయనాలు

వ్యవసాయ రంగానికి సంబంధించి ఎలాంటి విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాలన్నాబీ ముందస్తు మార్కెటింగ్ సదుపాయాలు, ఎగుమతి దిగుమతులు చేపట్టాలన్నా.. నమ్మకమైన గణాంకాల సేకరణ అత్యంత కీలకం. ఇప్పుడు ఈ సమస్యను అధిగమించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేశాయి. 'వివిధ రాష్ట్రాల్లో ఇప్పటికే పైలట్ అధ్యయనాలు పూర్తయ్యాయి. ఫలితాలు 93-95% కచ్చితత్వంతో వచ్చాయి. గణాంకాలను మాన్యువల్‌గా నమోదు చేసినప్పటితో పోలిస్తే ఇది చాలా మెరుగు. అందువల్ల ఈ ఏడాది ఖరీఫ్ నుంచి దేశంలోని అన్ని జిల్లాల్లో శాటిలైట్ డేటా ఆధారంగా వివరాలు సేకరిస్తున్నాం. ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో పండించారు, దిగుబడుల తొలి డిజిటల్ అంచనాలను సెప్టెంబర్ నాటికే విడుదల చేయడానికి ఏర్పాట్లు చేశాం'అని అధికార వర్గాలు చెబుతున్నాయి.

### 2024లోనే డిజిటల్ క్రాప్ సర్వే

సాధారణంగా భూమి రికార్డులు నిర్వహించే గ్రామస్థాయి సిబ్బంది (గిరిదవారీ పద్ధతి) ప్రతి ఏటా సాగయ్యే పంటల వివరాలు, విస్తీర్ణం, దిగుబడి అంచనాలు తదితర వివరాలను పుస్తకాల్లో నమోదు చేస్తూ, అనేక దఫాలు సవరిస్తూ ఉండేవారు. దాంతో అనిశ్చితి నెలకొనేది. అటువంటి అనిశ్చితికి స్వస్తి చెబుతూ రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో వ్యవసాయ గణాంకాల సేకరణ వ్యవస్థను మెరుగుపరిచే పనికి శ్రీకారం చుట్టింది కేంద్ర ప్రభుత్వం. కేంద్ర వ్యవసాయ శాఖ గత ఏడాది నుంచి పంటల సాగు వివరాలపై శాటిలైట్ ఆధారిత గణాంకాల సేకరణ ప్రారంభించింది. 2024 ఖరీఫ్‌లో డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పంటల విస్తీర్ణం, తదితర గణాంకాల డిజిటలీకరణ జరిగింది. దాదాపు కచ్చితమైన పంట అంచనాల సేకరణ సాధ్యపడింది. ఉత్తరప్రదేశ్‌లో వరి సాగు విస్తీర్ణం భారీగా పెరిగినట్లు ఆ డిజిటల్ సర్వే గుర్తించింది. ఆ అనుభవాలతోనే ఈ ఏడాది అన్ని రాష్ట్రాల్లో డిజిటల్ పద్ధతుల్లో శాటిలైట్ ఆధారిత గణాంకాల సేకరణకు సన్నాహాలు జరుగుతున్నాయి.

### కొత్త పంటల వివరాలూ..


పంటల మార్పిడి గురించి, కొత్త పంటల సాగుకు సంబంధించి గణాంకాల వివరాలు గతంలో లభించేవి కాదు. సంప్రదాయకంగా సాగయ్యే వరి, మొక్కజొన్న, జొన్న వంటి 25-26 రకాల పంటల వివరాలు మాత్రమే గణాంకాల్లోకి చేరేవి. ఇప్పుడు శాటిలైట్ డేటా ఆధారంగా డిజిటల్ గణాంకాల సేకరణతో ఈ సమస్య తీరనుంది. బెర్రీస్, అవొకాడో, డ్రాగన్‌ఫ్రూట్, కివి వంటి కొత్తపంటల సాగును సైతం ఇప్పుడు నమోదు చేస్తున్నారని వ్యవసాయ శాఖ వర్గాలు తెలిపాయి.

# పాకిస్థాన్‌ను ముంచిన మతమౌఢ్యం



మతాన్ని కేంద్రంగా చేసుకుని పరిపాలిస్తే ఒక దేశం ఏ విధంగా వెనుకబడిపోతుందనేది పాకిస్థాన్‌ను పరిశీలిస్తే అవగతమవుతుంది. మత ప్రాతిపదికన ఏర్పడిన దేశమది. తొలి నుంచీ అనుసరించిన మత ప్రేరిత విధానాల వల్ల పాకిస్థాన్ అన్ని రంగాలలో వెనుకబడి పోయింది. ఇటీవల ఖతర్ పర్యటన నుంచి స్వదేశానికి తిరిగి వెళ్ళిన పాకిస్థాన్ ప్రధాని షహేబాజ్ షరీఫ్ 'తాము 75 ఏళ్ళుగా బిక్షాటన చేస్తున్నట్లు' వాపోయారు! 1947లో స్వతంత్ర దేశంగా ఆవిర్భవించినప్పుడు పాకిస్థాన్‌కు వ్యవసాయమే ప్రధాన ఆదాయవనరు. పాకిస్థాన్ భౌగోళికంగా భారత్ కంటే చిన్న దేశమే అయినప్పటికీ సమృద్ధ జలవనరులు, సారవంతమైన సాగు భూములకు నెలవైన పంజాబ్ కారణాన పాక్ ఆర్థిక స్థితిగతులు మెరుగ్గా ఉండేవి. అవిభక్త భారత్ విభజన నాటికి ఉన్న 921 ప్రధాన పరిశ్రమలలో కేవలం 34 మాత్రమే పాక్‌కు దక్కాయి. అవి కూడా ప్రధానంగా బెంగాల్‌లోని జనపనార పరిశ్రమలు మాత్రమే. 1950లో పాకిస్థాన్ తలసరి ఆదాయం 1268 డాలర్లు. ఇది అప్పట్లో భారత్ తలసరి ఆదాయం కంటే దాదాపు రెండు రెట్లు అధికం. అయితే కశ్మీర్‌ను స్వాయత్తం చేసుకోవడమే పాక్ జాతీయ రాజకీయాల ప్రధాన లక్ష్యమయింది. ఆ లక్ష్య సాధనకై భారత్‌కు వ్యతిరేకంగా యుద్ధాలకు తెగబడింది. ఈ యుద్ధాలు, రాజకీయాల వల్ల పౌర, సైనిక పాలకులు పలు విధాల ప్రయోజనాలు పొందారు. అయితే దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లడంలో విఫలమయ్యారు. దేశాన్ని అత్యధిక కాలం ఏలిన సైనికాధికారులు ఇస్లామిక్ భావజాలంతో కశ్మీర్‌ను బూచిగా చూపి పంజాబీలు, సింధీలు, బలూచీలు, పఠాన్లు, మహాజీర్లుగా విడిపోయిన దేశాన్ని ఒక్కటిగా నిలబెట్టారు. అయితే దానితో పాటు దేశ బడ్జెట్ కేటాయింపుల్లో సింహభాగాన్ని రక్షణ శాఖకు దక్కించుకోవడంలో సఫలీకృతులయ్యారు. సోవియట్ యూనియన్, అమెరికా మధ్య ప్రచ్ఛన్న యుద్ధంలో పొరుగున ఉన్న అఫ్ఘానిస్థాన్ ఒక పావుగా మారింది. పాక్ సైన్యంలో స్వతహాగా అత్యధికులుగా ఉన్న పఠాన్ల అంశం, అఫ్ఘాన్ లోని పరిణామాలు సహజంగా ఇస్లామాబాద్‌కు అంతర్జాతీయంగా ఒక సముచిత పాత్రను కల్పించాయి. సోవియట్ ఎర్రసేనలను దెబ్బతీయడానికి అమెరికా జిహాద్‌ను ప్రోత్సహించి పాకిస్థాన్‌కు అన్ని రకాలుగా అండగా నిలిచింది. జనరల్ జియా ఉల్ హఖ్ హయాంలో ఈ జిహాద్ ఉగ్రవాదం పరాకాష్ఠకు చేరుకుంది. అమెరికా మద్దతుతో ఇస్లామాబాద్ పాలకులు ఆడింది ఆట పాడింది పాట అయింది. ఇదే సమయంలో పాక్ పాలకులు తాము అనుసరిస్తున్న మత ప్రేరిత భావజాలానికే మరింతగా నిబద్ధమయ్యారు. సోవియట్ యూనియన్ కుప్పకూలిన తర్వాత జిహాద్ నుంచి అమెరికా వైదొలిగినా ఆ భావజాలం మాత్రం అదే విధంగా పాక్ రాజకీయాలు, సమాజంలోనూ దృఢంగా ఉండిపోయింది. విద్య, మౌలిక వసతుల అభివృద్ధిలోనే కాదు అన్నింటా దేశ పురోగతి క్రమేణా కుంటుపడిపోయింది. విద్యార్థులకు నవీన, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే అంశాల కంటే మధ్య యుగం నాటి ముస్లిం రాజుల యుద్ధాలు వగైరా గూర్చి ఎక్కువగా బోధిస్తారు. నాణ్యమైన విద్యాలేమి కారణాన అక్కడి యువత విదేశీ ఉద్యోగ విపణిలో అవకాశాలను అందుకోలేకపోతోంది. పాకిస్థానీ ప్రవాసుల సంఖ్య 80 లక్షలు కాగా, అదే భారతీయ ప్రవాసుల సంఖ్య ఒక కోటీ 80 లక్షలు (విదేశాలలో పౌరసత్వం కలిగి ఉన్నవారి సంఖ్య దీనికి అదనం). విదేశాలలో భారతీయులు అన్ని రంగాలలో నిపుణులుగా ఉండగా పాకిస్థానీయులు నిమిత్తమాత్ర కార్మికులుగా ఉన్నారు, లేదా చిన్నాచితకా ఉద్యోగాలు చేస్తున్నారు. అవిభక్త భారత్ విభజన అనంతరం భారతదేశం అనతికాలంలోనే శరవేగంగా పురోగమనం వైపు పయనించగా పాకిస్థాన్ మాత్రం మతమౌఢ్యంలోకి జారిపోయింది. ఈ వాస్తవాన్ని గ్రహించే సరికి పాకిస్థాన్‌కు పుణ్యకాలం దాటిపోయింది. దేశం పూర్తిగా దివాలా తీసి ఏ పార్టీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలోకి పాకిస్థాన్ దిగజారిపోయింది. తాము 75 ఏళ్ళుగా బిచ్చమడుక్కుంటున్నామన్న ప్రధానమంత్రి షహేబాజ్ షరీఫ్ చేసిన వ్యాఖ్యలో వాస్తవం ఉంది. పాకిస్థాన్‌కు 200 కోట్ల డాలర్ల ఆర్థిక సహాయం చేయడానికి ఖతర్ ముందుకు వచ్చింది. సౌదీ అరేబియా, కువైత్ దేశాలు కూడ పాక్‌ను అన్ని విధాల ఆదుకోవడానికి ముందుకు వస్తున్నాయి. ఇస్లాం అధికారిక మతమైన గల్ఫ్ దేశాలు వివేకంతో మతానికి, పరిపాలన మధ్య స్పష్టమైన విభజన రేఖ గీయడం వలన అన్ని రంగాలలో పురోగమిస్తున్నాయి. సామరస్యం, సహనశీలత భారత పుణ్యభూమిలో స్వతస్సిద్ధంగా ఉంది. ఇది ఒక పార్టీ లేదా ప్రభుత్వం చట్టం చేయడంతో వచ్చింది కాదు. వసుధైక కుటుంబంగా తరతరాలుగా అన్ని సమూహాలను మమేకం చేసుకుని ప్రగతిశీలంగా ముందుకు సాగుతోంది. అలాంటి మనం ఇప్పుడు ధార్మిక భావోద్వేగాలను మాత్రమే కేంద్రంగా చేసుకోని రాజకీయాలు నడపడం, పాలన చేయాలనుకోవడం నిస్సందేహంగా తిరోగమనమే..

# అమెరికా మిత్రులను ఆకర్షిస్తున్న రష్యా



రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఆ ఇరు దేశాలకు లేదా ఒక నిర్దిష్ట భౌగోళిక ప్రాంతానికి మాత్రమే పరిమితం కాలేదు. రష్యా దురాక్రమణ ప్రపంచంలో అనేక కీలక రాజకీయ, సైనిక, ఆర్థిక, దౌత్య సమీకరణలకు దారితీస్తోంది. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభ, భద్రతా మండలిలో రష్యాపై జరిగిన ఓటింగ్‌లోని వ్యత్యాసం, ఆయా దేశాలు ద్వైపాక్షికంగా అనుసరిస్తున్న దౌత్యనీతి మారుతున్న సమీకరణలకు దర్పణం పడుతోంది. ఒక దేశం మరో దేశంపై చేసిన దండయాత్రను ఖండించడానికి బదులుగా తమ దేశానికి సంభవించే లాభనష్టాల అంచనాలతో వివిధ దేశాలు ముందుకు వెళ్తున్నాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్‌లు ఇప్పటికే రష్యాపై పలు ఆంక్షలు విధించాయి. అయితే ఆ ఆంక్షల నుంచి రష్యా చమురు, గ్యాస్ ఎగుమతులకు మినహాయింపు ఇవ్వడం ఆ దేశాల ద్వంద్వ నీతిని తెలియజేస్తుంది. చమురు సరఫరా ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా కీలక పాత్రపోషిస్తున్న గల్ఫ్ దేశాలు ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తున్నాయి. తమపై విధిస్తున్న ఆంక్షల కారణాన పెరిగే ఇంధన ధరలపై ఐరోపా దేశాల ప్రభుత్వాలు తమ ప్రజలకు సంజాయిషీ చెప్పుకోడానికి సంసిద్ధం కావాలంటూ రష్యా హెచ్చరించింది. ఈ హెచ్చరికతో అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగిపోయాయి. రష్యా కారణాన సరాఫరాలో అంతరాయం ఏర్పడి ఐరోపాలో సంక్షోభం తలెత్తకుండా గల్ఫ్ దేశాలు ఆదుకునేలా అమెరికా చేస్తున్న ప్రయత్నాలకు సానుకూల స్పందన లభించడం లేదు. చమురు ఉత్పాదక గల్ఫ్ రాజ్యాలన్నీ కూడ తమ రక్షణావసరాల కొరకు మొదటి నుంచీ అమెరికాపై ఆధారపడివున్నాయి. అయితే గత ఆరేళ్ళుగా ప్రపంచ చమురు నిక్షేపాలపై పట్టుకొరకు గల్ఫ్ దేశాలు, రష్యా సంఘటితమతమయ్యాయి. సౌదీ అరేబియా ఆధిపత్యంలో ఉన్న ఒపెక్ (పెట్రోలియం ఎగుమతి దేశాల సమాఖ్య) తనతో రష్యాను కలుపుకుని ఒపెక్ ప్లస్ గా మారిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా పెట్రోలియం ధరల పై అవి పూర్తి పట్టును సాధించాయి. సున్నీ గల్ఫ్ దేశాలకు, షియా ఇరాన్‌కు ఏ మాత్రం పడదు. దీనికి తోడుగా ఐరోపాకు తమ చమురు, ఇంధనాన్ని చౌకగా రవాణా చేసేందుకు ఈ దాయాది దేశాలు చేస్తున్న ప్రయత్నాలలో సిరియా, లిబియాల పాత్ర అత్యంత కీలకమైనది. మధ్యధరా సముద్రం మీదుగా నల్ల సముద్రం ద్వారా ఐరోపాకు చేరుకోవడం సులభం. సిరియా, లిబియాలలో జరుగుతున్న పోరాటం ఇందులో భాగమే. ఈ రెండు దేశాలలో కూడ రష్యా సైనిక స్థావరాలు ఉన్నాయి. తనకు అండగా నిలుస్తున్న రష్యాకు అనుకూలంగా సిరియా ఓటు వేసింది. ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో సిరియా, ఇరిట్రియాతో సహా కేవలం అయిదు దేశాలు మాత్రమే రష్యాకు అనుకూలంగా ఓటు వేశాయి. ఈ రెండు దేశాలకు అమెరికా మిత్ర దేశాలైన అరబ్ రాజ్యాలతో వివాదాలు ఉన్నాయి. ఇరాక్ ఓటింగుకు దూరంగా ఉంది. ఇరాన్, యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్, అల్జీరియా, మొరాకో కూడ భారత్ తరహా తటస్థ విధానంలో భాగంగా ఓటింగులో పాల్గొనలేదు. భారత్‌తో పాటు చైనా, పాకిస్థాన్‌లు కూడా రష్యాకు పరోక్ష మద్దతుగా ఓటింగ్‌లో పాల్గొనలేదనేది ఇక్కడ గమనార్హం. ఈ దేశాలేవీ కూడా రష్యాను ఖండించలేదు. ప్రస్తుతం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అధ్యక్ష స్థానంలో ఉన్న యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ కూడ రష్యా వైపు మొగ్గుచూపుతోంది. ఇతర గల్ఫ్ దేశాలు కూడా ఇదే వైఖరిని అవలంబిస్తున్నాయి. అటు ఇరాన్‌ను ఇటు గల్ఫ్ దేశాలను, ఒక వైపు చైనా, పాకిస్థాన్‌లను మరో వైపు భారతదేశాన్ని ఇలా పరస్పర వైరుధ్యం కల్గిన దేశాలను ఎలాంటి ఆర్భాటం, ప్రచారం లేకుండా రష్యా తన పక్షాన నిలుపుకోవడం దాని నిగూఢ దౌత్యనీతికి నిదర్శనం. మాస్కో దౌత్య ప్రజ్ఞను మెచ్చుకోక తప్పదు. ఇక భారత్ విషయానికి వస్తే, ప్రతిపక్షాల అరోపణలు ఏమైనా సరే, దేశ ప్రయోజనాల దృష్ట్యా నరేంద్ర మోదీ అవలంబిస్తున్న వైఖరి పూర్తిగా సమర్థనీయమైనది. అరబ్బు ప్రపంచంలోని ఇతర పెద్ద దేశాలైన ఈజిప్టు, ఇరాక్, ట్యూనిసియా, లెబనాన్, యమన్ దేశాలలో రష్యా, ఉక్రెయిన్‌ల గోధుమ పిండితో తయారయ్యే రొట్టెలు ప్రధాన ఆహారం. ధనిక గల్ఫ్ దేశాలతో పాటు యమన్, ట్యూనిసియా మొదలగు పేద అరబ్బు దేశాలలో కూడా ప్రజలందరికీ అవసరమైన రొట్టె పిండిని ప్రభుత్వాలే రాయితీపై సరఫరా చేస్తాయి. గతంలో రొట్టె పిండి రాయితీ తగ్గింపు అనంతరం ట్యూనిసియాలో పెల్లుబికిన ప్రజాగ్రహావేశాలు అరబ్బు ప్రపంచానికి సోకి దాన్ని కుదిపివేశాయి. అమెరికాకు విశ్వసనీయ మిత్రులుగా ఉన్న కొందరు దేశాధినేతలు అధికారాన్ని కోల్పోగా మిగిలిన వారు అప్రమత్తమయ్యారు. తమకు గిట్టని ఇరాన్‌కు అన్నింటా బాసటగా నిలిచే రష్యాను అమెరికా సంప్రదాయయక మిత్ర రాజ్యాలైన గల్ఫ్ దేశాలు ఎందుకు సమర్థిస్తున్నాయి? మార్కెట్ ప్రయోజనాల కంటే ఎక్కువగా అమెరికా విశ్వసనీయతను కోల్పోవడమే అని చెప్పక తప్పదు. ఇది నిష్ఠుర సత్యం. లిబియా మొదలు అఫ్ఘానిస్తాన్ వరకు అమెరికా తమను మోసం చేసిందని అరబ్బులు భావిస్తున్నారు. అలా అరబ్బులు అనుభవపూర్వకంగా దూరమవుతున్న అమెరికాకు భారత్ ఎంత వరకు దగ్గరవుతుందనేది వేచి చూడాలి.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510 Editor: Polagoni Rajesh,epaper. www.prabhatha suryaa.com. Email. Prabhata surya @gmail.com.Rni TGTEL/25/A0784.